అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

మంగళవారం 11-4-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 49 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50

పూలే ఆశయాలు, కార్యాచరణ నేటికీ స్ఫూర్తిదాయకం



జయంతి సందర్భంగా సీఎం కేసీఆర్ నివాళులు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దేశంలోని మనుషులంతా అన్ని రంగాల్లో సమానత్వంతో జీవించాలనే ఆకాంక్షలతో ఆధిపత్య వ్యతిరేక పోరాటం కోసం తన జీవితాన్ని ధారపోసిన గొప్ప భారతీయ సామాజిక తత్వవేత్త, మహాత్మాజ్యోతిరావు గోవిందరావు పూలే అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, కార్యాచరణ నేటికీ స్ఫూర్తిదాయకమేనని తెలిపారు. పూలే 197వ జయంతి సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలు, త్యాగాలను సీఎం స్మరించుకున్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదలచేశారు. వర్ణ, లింగ వివక్షకు వ్యతిరేకంగా, దళిత, గిరిజన, ...9లో

గవర్నర్ X గవర్నమెంట్...



మరోసారి బిల్లుల రగడ..

- మూడు బిల్లులకు తమిళిసై ఆమోదం
- రెండు రాష్ట్రపతి సమ్మతికి.. రెండు ప్రభుత్వానికి వాపస్
- మరో రెండు పెండింగ్..

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందర రాజన్ వ్యవహార‌శైలితో మరోసారి రాష్ట్రంలో రాజకీయ దుమారం రేగింది. గతంలో మాదిరిగా 'గవర్నర్ వర్సెస్ గవర్నమెంట్...'లాగా పరిస్థితి తయారైంది. బిల్లుల విషయంలో తమిళి సై మొండి పట్టు పట్టగా... ఆమె రాష్ట్ర ప్రభుత్వం పట్ల ...2లో

గవర్నర్ తీరుపై పిటిషన్ విచారణ వాయిదా

- దాఖలు చేసిన సర్కార్..రెండు వారాల తర్వాత పరిశీలన : సుప్రీం

వివరాలు 2లో..

తీర్మానం పెట్టిన గంటల్లోనే..

బిల్లుకు తమిళనాడు గవర్నర్ ఆమోదం

- తమిళనాడు రాజకీయాల్లో భగ్గుమంటున్న విభేదాలు



చెన్నై : ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్‌ను నిషేధించడం, ఇంటర్నెట్ గేమ్‌లను నియంత్రించడం కోసం రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లును తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి సోమవారం ఆమోదించారు. ఆరు నెలల పాటు పెండింగ్‌లో ఉంచిన బిల్లును గవర్నర్‌కి వ్యతిరేకంగా తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టిన గంటల వ్యవధిలోనే ఆమోదించడం గమనార్హం. గత నెలలో గవర్నర్ కొన్ని ప్రశ్నలతో బిల్లుని వెనక్కిపంపారు. దీంతో ప్రభుత్వం రెండోసారి బిల్లును ఆమోదించింది. రాష్ట్ర యూనివర్సిటీ ఛాన్సలర్‌గా తనను తొలగించాలని కోరుతూ ప్రవేశపెట్టిన బిల్లుతో పాటు తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన పలు బిల్లులకు గవర్నర్ ఇప్పటివరకు సమ్మతించలేదు. కాగా, ఎంకె స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే గవర్నర్ ఆర్.ఎన్. రవికి ...2లో

మూడు పార్టీలకు జాతీయ హోదా రద్దు

ఆప్ కు జాతీయ హెూదా

- సీపీఐ, టీఎంసీ, ఎన్‌సీపీకి తొలగింపు
- ఆరు పార్టీలకు రాష్ట్ర హెూదా కట్
- కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం

నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో మూడు పార్టీలకు కేంద్ర ఎన్నికల సంఘం జాతీయ హెూదా రద్దు చేసింది. ఢిల్లీ, పంజాబ్‌లో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి కొత్తగా జాతీయ హెూదా లభించింది. సీపీఐ,తృణమూల్ కాంగ్రెస్, ఎన్‌సీపీ పార్టీలకు జాతీయ హెూదాను రద్దు చేస్తున్నట్టు సీఈసీ ప్రకటించింది. ఈ మేరకు సోమవారం కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది.

ఉత్తరప్రదేశ్‌లో ఆర్‌ఎల్‌డీ, ఆంధ్రప్రదేశ్‌లో బీఆర్ఎస్, మణిపూర్‌లో పీడీఏ, పుదుచ్చేరిలో పీఎంకే, పశ్చిమ బెంగాల్‌లో ఆర్‌ఎస్‌పీ, మిజోరంలో ఎంపీసీలకు ఇచ్చిన రాష్ట్ర పార్టీ హెూదాను కూడా కమిషన్ రద్దు చేసింది. ఢిల్లీ, గోవా, పంజాబ్, గుజరాత్ అనే నాలుగు రాష్ట్రాల ఎన్నికల పనితీరు ఆధారంగా ఆప్ కుజాతీయ హెూదా కల్పిస్తున్నట్టు కమిషన్ పేర్కొంది.


ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో వారి పనితీరు ఆధారంగా నాగాలాండ్, మేఘాలయలో ఎన్‌సీపీ, తృణముల్ కాంగ్రెస్‌లు వరుసగా రాష్ట్ర పార్టీలుగా గుర్తింపు పొందాయని కమిషన్ తెలిపింది. నాగాలాండ్‌లోని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్ పాశ్వాన్), మేఘాలయలోని వాయిస్ ఆఫ్ పీపుల్ పార్టీకి, త్రిపురలోని టిప్రా మోతాకు రాష్ట్ర రాజకీయ పార్టీ హెూదాను కూడా మంజూరు చేసినట్టు కమిషన్ పేర్కొంది.

దీంతో ప్రస్తుతం బీజేపీ కాంగ్రెస్, సీపీఐ(ఎం), బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ), ఆప్ లుజాతీయ పార్టీలుగా ఉన్నాయి..

అడవి అదృశ్యం...

ఐదేండ్లలో 89 వేల హెక్టార్ల పచ్చటి సంపద కనుమరుగు

- రహదారులు , అటవీయేతర ప్రయోజనాల కోసమంటూ కార్పొరేట్లకు మళ్లింపు



పచ్చదనం ఉంటేనే మానవమనుగడ సమతుల్యంగా ఉంటుంది.పక్షులు,పశుసంపద సుభిక్షంగా ఉంటుంది. లేదంటే..పర్యావరణం దెబ్బతినడమే కాదు. అడవుల్లో ఉండాల్సిన జంతువులు జనవాసాల్లోకి దూసుకువస్తాయి. ఇపుడు అదే జరుగుతోంది. అడవులు అదృశ్యమైపోతున్నాయి. అటవీసంపదను కొల్లగొట్టటానికి .. అడవులనే జీవనాధారంగా చేసుకున్న గిరిజనులనే తరిమేసేలా చట్టాలకు సవరణలు జరుగుతున్నాయి. అడవుల సంరక్షణ బిల్లులంటూ తెరపైకి తెచ్చి.మొత్తం అడవులే లేకుండా చేస్తున్నారు.కార్పొరేట్ దోస్తులకు పచ్చని అడవులతో పాటు సమస్త సహజ వనరులనూ బీజేపీ ప్రభుత్వం కట్టబెడుతుంది.

న్యూఢిల్లీ: భారతదేశంలో గత ఐదేండ్లలో 89 వేల హెక్టార్ల అడవి (రికార్డెడ్ ఫారెస్ట్) కనుమరుగైంది. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ పార్లమెంటులో ఇచ్చిన సమాచారం ప్రకారం, దేశంలోని సుమారు 89 వేల హెక్టార్ల అటవీ భూమి రోడ్లు మొదలైన 25 రకాల అటవీయేతర అవసరాల కోసం మళ్లించడానికి అనుమతించబడింది. వాస్తవానికి ఇంత పెద్ద విస్తీర్ణంలో అనేక చిన్న పట్టణాలకు వసతి కల్పించవచ్చని పర్యావరణ వేత్తలు అంటున్నారు.

భూభాగంలో 24 శాతం అటవీ విస్తీర్ణం

కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ప్రకారం, దేశంలోని మొత్తం భూభాగంలో దాదాపు 24 శాతం అటవీ విస్తీర్ణంలో ఉంది.డిబ్ల్యూ వెబ్‌సైట్ ప్రచురించిన ఒక నివేదిక ప్రకారం, 88,903.80 హెక్టార్ల అటవీ భూమిని 25 రకాల అటవీయేతర ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడానికి ప్రభుత్వం అనుమతించిందని కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ పార్లమెంటుకు తెలియజేసింది. రోడ్ల కోసం అటవీ భూమిని గరిష్టంగా మళ్లించడం జరిగింది. గరిష్టంగా 19,424 హెక్టార్ల అటవీ భూమిని రోడ్ల వినియోగానికి మళ్లించారు.

రోడ్లకోసం అడవుల నరికివేత

గత ఐదేండ్లలో అడవులను అటవీయేతర ప్రయోజనాల కోసం అడ్డదిడ్డంగా నరికివేస్తున్నారు. ఇలా 19,424 హెక్టార్ల మేర అడవులు నరికేశారు. అంతేకాదు.. ...9లో

ఓటేయొద్దు..



మసీదులు తవ్వదాం.. పేపర్ లీక్ చేద్దామనేటోళ్లు మనకొద్దు

- ఆక్వా హబ్‌లో స్థానికులకు ఉపాధి : మంత్రి కేటీఆర్

నవతెలంగాణ - తంగళ్ళపల్లి

తెల్లారిలేస్తే మసీదులు తవ్వదామా.. పేపర్ లీక్ చేద్దామా అనే వారికి ఓటు వేయొద్దని.. ఈ సారైనా మంచి వారిని కరీంనగర్ ఎంపీగా గెలిపించుకోవాలని మంత్రి కేటీఆర్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల్లో సోమవారం మంత్రి విస్తృత పర్యటన చేశారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు, మహనీయుల విగ్రహావిష్కరణలు చేశారు. తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. ఎస్సీ, ముదిరాజ్ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. బీఆర్.అంబేద్కర్, చాకలి ఐలమ్మ విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామంలో ఇప్పటి వరకు రూ.12కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ముంపు ప్లాట్‌లకు డబ్బులు రాని వారు, 18 సంవత్సరాలు నిండి డబ్బులు రాని వారికి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. 350 ఎకరాల్లో ఆక్వా హబ్ ఏర్పాటు చేయనున్నామని, స్థానిక యువతకు శిక్షణ ...9లో

స్ట్రాంగ్ రూం కీ మాయం



- ధర్మపురి అసెంబ్లీ ఎన్నికల ఫలితాల డాక్యుమెంట్లు సమర్పించాలన్న హైకోర్టు
- గదుల తాళాలు తీసేందుకు యత్నించిన జగిత్యాల కలెక్టర్
- తెరుచుకోని స్ట్రాంగ్‌రూం తాళాలు
- అందులోనే కీలక 17ఏ, 17సీ డ్యాక్యుమెంట్లు, ప్రొసీడింగ్ పత్రాలు
- తాళాలు లేవని కోర్టుకు చెబుతామని కలెక్టర్ ప్రకటన

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

జగిత్యాల జిల్లా ధర్మపురి అసెంబ్లీ ఫలితాల వివాదం మలుపు తిరిగింది. ఎన్నికల ఫలితాలకు సంబంధించిన ఈవీఎంలు, ఇతర డ్యాక్యుమెంట్లు, సీసీ పుటేజీల వివరాలు సమర్పించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. ఈ మేరకు సోమవారం కలెక్టర్ యాస్మిన్‌బాషా స్ట్రాంగ్‌రూమ్ గదుల తాళాలు తెరిచేందుకు ప్రయత్నించగా సంబంధిత 'కీ' లేకపోవడంతో గందరగోళం నెలకొంది. సగదు గదుల తాళం చెవులు (కీ లు) తమ వద్ద లేవని, ఇదే విషయం కోర్టుకు చెబుతామని కలెక్టర్ చెప్పడంతో ...9లో

బీఆర్ఎస్ నుంచి బహిష్కరణ

పొంగులేటి, జూపల్లిపై వేటు..



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బహిష్కరణకు గురయ్యారు. ఈ మేరకు సోమవారం పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన కారణంగా జూపల్లి, పొంగులేటిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలంటూ కేసీఆర్ ఆదేశించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలంగాణ భవన్ ఒక ప్రకటనలో తెలిపింది.



కోర్టుల్లో కేసులు వేస్తేనే .. పాస్ కాని బిల్లులు



తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్న గవర్నర్

- నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లోనే..
- గవర్నర్‌పై మంత్రి హరీశ్‌రావు విమర్శలు
- మూడు బిల్లులు పాస్ చేసినందుకు ధన్యవాదాలు తెలిపిన మంత్రి

నవతెలంగాణ-కొండపాక

కోర్టులో కేసులు వేస్తే తప్పా బిల్లులు పాస్ కాని దుస్థితి నెలకొన్నదని, రాష్ట్ర అభివృద్ధిని గవర్నర్ అడ్డుకుంటున్నారని, బిల్లులు పాస్ చేయకుండా పెండింగ్‌లో పెడుతున్నారని మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నాలుగు జిల్లాలకు తాగు నీరందించే ట్రయల్ రన్ నిర్వహణలో భాగంగా ...9లో

సీఎం సారూ.. పర్మినెంట్ చేయండి..

నాలుగేండ్లు పాయే..కొలువు గ్యారంటీ లేకపాయే

- ఆందోళనలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు
- పెండింగ్‌లోనే రెండు నెలల వేతనాలు
- 28 నుంచి సమ్మెలోకి?



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'సీఎం సారూ చేతులెత్తి వేడుకుంటున్నాం..దయచేసి పర్మినెంట్ చేయించండి' అంటూ రాష్ట్రంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు వేడుకుంటున్నారు. ఏ ప్రభుత్వ శాఖలో ఉద్యోగమొచ్చినా ప్రొబెషనరీ కాలం మాత్రం రెండేండ్లే. జేపీఎస్‌లకు మాత్రం ఎక్కడా లేని నిబంధన తీసుకొచ్చి పెట్టి మూడేండ్లు అని రాష్ట్ర సర్కారు కొర్రీ పెట్టింది. ఏడాదే ఎక్కువగా కదా..సర్కారు కొలువు ఎందుకు వదిలేయానే ఉద్దేశంతో గమ్మునా పనిచేశారు. టైంకాగానే పర్మినెంట్ ప్రస్తావన ఎత్తితే..'కాదు..కాదు..ఇంకా ఏడాది పెంచుతున్నాం' అని మెలిక పెట్టి కూర్చున్నది. కుంటలో పడ్డాక బురద అంటకుండా పోతుందా భరిద్దాంలే అని జేపీఎస్‌లు చచ్చినట్టు కొలువుచేశారు. మంగళవారంతో నాలుగేండ్లు పూర్తవుతుంది. నేటికీ పర్మినెంట్ ప్రస్తావనే లేదు. 'ఇంకెన్నాళ్లు ఈ ఎదురుచూపులు..బానిస బతుకులు' అని జేపీఎస్‌లు ఆందోళన బాట పట్టేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ నెల 28 నుంచి సమ్మెలోకి వెళ్లేందుకు కూడా సమాయత్తం అవుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం 2019లో రిక్రూట్‌మెంట్ టెస్టు ద్వారా 9,355 పంచాయతీరాజ్ జూనియర్ కార్యదర్శుల పోస్టులను భర్తీ చేసింది. మూడేండ్ల ఒప్పందం మీద 2019 ఏప్రిల్ 12 నుంచి జేపీఎస్‌లు విధులు చేపట్టారు. గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీ, పల్లె ప్రగతి, హరితహారం, తదితర కార్యక్రమాల నిర్వహణతో పాటు 55 దాకా రిజిష్టర్లను వారే చూసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో కొండంత పనిని మీదేసుకుని పనిచేస్తున్నారు. అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులకు ప్రొబేషనరీ కాలం రెండేండ్లు మాత్రమే. వీరికి మాత్రం రాష్ట్ర సర్కారు మూడేండ్లు అని నిర్ణయించింది. ఈవిషయంలో పెద్దఎత్తున విమర్శలొచ్చినా రాష్ట్ర సర్కారు వెనక్కి తగ్గలేదు. దాన్ని రెండేండ్లకు కుదించి తమకూ పీఆర్సీ వర్తింపజేయాలని అధికారుల వద్ద జేపీఎస్‌లు ప్రాధేయపడ్డా కనికరించలేదు. ఈ గొడవ ఇలా ఉండగానే పుండుమీద కారం చల్లినట్టుగా వారి ప్రొబెషనరీ కాలాన్ని నాలుగేండ్లకు పెంచుతూ సీఎం కేసీఆర్ బాంబు పేల్చారు. జేపీఎస్‌లలో అసంతృప్తి పెరిగిపోతుండటం, ఓవైపు వీఆర్వో, వీఆర్ఏల గొడవ నడుస్తుండటంతో సీఎం కాస్త ఆలోచించి రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులతో సమానంగా ఇస్తామని ఊరటనిచ్చారు. కానీ, అమలు చేయలేదు. గతంలో ఇస్తున్న 15 వేల వేతనాన్ని రూ.28,719కి పెంచి ఊరటనిచ్చింది. వాస్తవానికి రెగ్యులర్ అయితే వారికి మరింత వేతనం పెరగడంతో పాటు పీఎఫ్, ఇతర ఉద్యోగులకు లభించినట్టుగానే అన్ని సౌకర్యాలు వర్తిస్తాయి. కానీ, ...9లో

ఆవిష్కరణకు అంబేద్కర్ విగ్రహం సిద్ధం

హుస్సేన్‌సాగర్ తీరంలో 125 అడుగుల నిర్మాణం

- పనులను పరిశీలించిన మంత్రులు, సీఎస్, డీజీపీ

నవతెలంగాణ-హైదరాబాద్

బీఆర్‌కేఆర్ భవన్‌లో ఎస్సీల అభివద్ధి శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఆర్థిక మంత్రి టి హరీశ్‌రావు, ఆర్‌అండ్‌బీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్‌తో కలిసి ఈ నెల 14న అంబేద్కర్ విగ్రహావిష్కరణ ఏర్పాట్లపై సమీక్షించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈ నెల 14వ తేదీన ముఖ్యమంత్రి 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సంబం ధించి పూర్తిస్థాయి ఏర్పాట్లను ఘనంగా చేస్తున్నామని పేర్కొన్నారు. పోలీసు శాఖ బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు చేస్తుందనీ, ఆర్ అండ్ బీ శాఖ లైటింగ్, షామియానా, కుర్చీలు, పూలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. విద్యుత్ శాఖకు నిరంతర విద్యుత్ అందించాలనీ, ట్రాన్స్‌ఫార్మర్లను సిద్ధంగా ఉంచాలని కోరారు. అలాగే ఆరోగ్య సిబ్బందితో పాటు అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచాలని ఆరోగ్య శాఖను ఆదేశించామని తెలిపారు. ప్రజాప్రతినిధులతో పాటు జిల్లాల నుంచి వచ్చే ప్రజలకు సరైన సీటింగ్ ఏర్పాట్లు చేయాలని మంత్రులు ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు నీరు, మజ్జిగ, మిఠాయిలు అందించాలి. 14వ తేదీన వాహనాల రాకపోకల కోసం నెక్లెస్ రోడ్డు మూసివేయనున్నందున ప్రత్యామ్నాయ మార్గాన్ని ఉపయోగించాలని ప్రజలకు ముందస్తుగా తెలియజేయాలని పోలీసులకు సూచించారు. అదేవిధంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీని ఆదేశించారు. ఈ సమావేశానికి ఫైనాన్స్ స్పెషల్ సీఎస్ రామకృష్ణారావు, ఆర్ అండ్ బీ సెక్రటరీ శ్రీనివాస్‌రాజు, ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, ఉన్నతాధికారులు హాజరయ్యారు.





గవర్నర్ x గవర్నమెంట్...

(మొదటిపేజీ తరువాయి)

అనుసరిస్తున్న తీరుపై బీఆర్ఎస్ నేతలు భగ్గుమన్నారు. రాష్ట్ర అసెంబ్లీ, కౌన్సిల్‌లో పాసై గవర్నర్ ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వం రాజ్‌భవన్‌కు పంపిన 10 బిల్లుల్లో మూడింటికి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆమోదం తెలిపారు. రెండు బిల్లులను రాష్ట్రపతి సమ్మతి కోసం రాష్ట్రపతి భవన్‌కు పంపారు. మరో రెండింటిని తిరిగి ప్రభుత్వానికి పంపిన గవర్నర్..రెండు బిల్లులను తనవద్దే పెండింగ్‌లో ఉంచారు. ప్రభుత్వం పంపిన బిల్లులపై గవర్నర్ నిర్ణయం తీసుకోవడంలేదని రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన రిట్ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిపిన సుప్రీంకోర్టు తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఇదిలా ఉండగా ప్రభుత్వం పంపిన బిల్లుల్లో తెలంగాణ మోటర్ వెహికిల్స్ ట్యాక్సేషన్ అమెండమెంట్ బిల్ 2022, మున్సిపాలిటీస్ అమెండమెంట్ బిల్ 2023, ప్రొ.జయశంకర్ తెలంగాణ అగ్రికల్చరల్ యూనివర్సిటీ అమెండమెంట్ బిల్ 2023కు గవర్నర్ ఆమోదం తెలిపారు. తెలంగాణ ఫారెస్ట్ యూనివర్సిటీ బిల్ 2022, యూనివర్సిటీస్ కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ బిల్ 2022లను రాష్ట్రపతి సమ్మతి కోసం గవర్నర్ రాష్ట్రపతి భవన్‌కు నివేదించారు. తెలంగాణ స్టేట్ ప్రయివేటు యూనివర్సిటీస్ అమెండమెంట్ బిల్ 2022, తెలంగాణ మున్సిపల్ లా అమెండమెంట్ బిల్ 2022, తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ అమెండమెంట్ బిల్ 2022పై గవర్నర్ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. తెలంగాణ పంచాయతీరాజ్ అమెండమెంట్ బిల్ 2023, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా అమెండమెంట్ బిల్ 2022పై వివరణ కోరుతూ గవర్నర్ ఈ రెండు బిల్లులను ప్రభుత్వానికి వాపస్ పంపారు. ఈ నేపథ్యంలో మరోసారి ఈ వ్యవహారం చర్చనీయాంశమైంది.

తీర్మానం పెట్టిన గంటల్లోనే..

(మొదటిపేజీ తరువాయి)

వ్యతిరేకంగా సోమవారం ఉదయం మరో తీర్మానం చేసింది. రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను గవర్నర్ క్లియర్ చేయడం లేదని, ప్రజా సంక్షేమానికి వ్యతిరేకంగా ఆయన పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ.. ఇది గవర్నర్‌కు వ్యతిరేకంగా తమ ప్రభుత్వం చేసిన రెండో తీర్మానమని అన్నారు. గవర్నర్ నిర్లిప్త వ్యక్తిగా ఉండాలని సర్కారియా కమిషన్ పేర్కొందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారంలో గవర్నర్ జోక్యం చేసుకోకూడదని డాక్టర్ అంబేద్కర్ కూడా చెప్పారన్నారు. కానీ గవర్నర్ బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రతినిధిలా వ్యవహరిస్తున్నారని, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. అలాగే గవర్నర్ గైడ్‌గా ఉండాలని అనేక సుప్రీంకోర్టు ఆదేశాలు కూడా స్పష్టం చేశాయన్నారు. అయితే మన గవర్నర్ ప్రజలకు మిత్రుడిగా ఉండటానికి సిద్ధంగా లేరని సీఎం స్టాలిన్ విమర్శించారు. అసెంబ్లీ ఆమోదించి పంపిన బిల్లులను గవర్నర్ పెండింగ్‌లో ఉంచుతూ తప్పుడు సమాచారం ఇస్తున్నారని దుయ్యబట్టారు. బిల్లును పెండింగ్‌లో ఉంచడం అంటే తిరస్కరించినట్లేనని ఇటీవల గవర్నర్ రవి చేసిన వ్యాఖ్యలపై ఈ సందర్భంగా స్టాలిన్ మండిపడ్డారు. గవర్నర్ చర్యలను మాత్రమే తాము విమర్శిస్తున్నామనీ, అసెంబ్లీ కార్యక్రమాలకు ఆటంకం కలిగిస్తే ఊరుకోమని అన్నారు. అనంతరం తమిళనాడు మంత్రి దురై మురుగన్, గవర్నర్ రవికి వ్యతిరేకంగా చేసిన తీర్మానాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులకు నిర్దిష్ట వ్యవధిలోగా ఆమోదం తెలిపేలా తమిళనాడు గవర్నర్‌కు తక్షణమే తగిన ఆదేశాలు జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఈ తీర్మానం ద్వారా తమిళనాడు ప్రభుత్వం కోరింది.

నేడు హైదరాబాద్‌లో విద్యార్థి, నిరుద్యోగుల మహాదీక్ష

- ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకుల పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రం లీకేజీపై సమగ్రమైన న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య పార్క్ వద్ద విద్యార్థి, నిరుద్యోగుల మహాదీక్ష భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో జరగనుంది. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టి నాగరాజు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ దీక్షలను జయప్రదం చేయాలని కోరారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రం లీకేజీపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్రమైన విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన నిరుద్యోగులకు నెలకు రూ.20 వేలు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. రాష్ట్రంలోని నిరుద్యోగులందరికీ నిరుద్యోగ భృతి అందించాలని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీని తక్షణమే ప్రక్షాళన చేయాలని తెలిపారు. పదో తరగతి హిందీ ప్రశ్నాపత్రం బయటకు రావడంపైనా, బండి సంజయ్ పాత్రపైనా సమగ్రమైన విచారణ జరిపించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్ గువేరా, అశోక్‌రెడ్డి, డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి ఎండీ జావీద్ పాల్గొన్నారు.

కుల దురహంకారంతోనే దళిత యువకుడు నవీన్ హత్య


- నిందితులను కఠినంగా శిక్షించాలి :కేవీపీఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


కుల దురహంకారంతోనే దళిత యువకుడు నవీన్‌ను హత్య చేశారని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్ వెస్లీ, టి స్కైలాబ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిందుతులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. 'తక్కువ కులపోడు మా అమ్మాయిని ప్రేమిస్తాడా అని' తాళ్ల జ్యోతి బంధువులు మర్రి రాజు మరికొంతమంది బాధితుడు ఇరిగి నవీన్‌ను కాపు కాసి వెంటాడి అత్యంత దారుణంగా చంపారని తెలిపారు. నల్గొండ జిల్లా త్రిపురారం మండలం గుంటిపల్లి అన్నారంకు చెందినఅతడు (ఎస్సీ) తాళ్ల జ్యోతి (బీసీ) ప్రేమించుకున్నారని పేర్కొన్నారు. ఈ విషయం ముదిరాజ్ కులానికి చెందిన అమ్మాయి బావ మర్రి రాజు, తండ్రి నాగయ్యకు తెలిసి పథకం ప్రకారం నిడమనూరు మండలం గుంటిపల్లికి పిలిపించి కత్తులతో కర్రల తో దాడి చేసి నవీన్‌ను హత్య చేశారని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయడం ద్వారా నిందితులను కఠినంగా శిక్షించా లని డిమాండ్ చేశారు. అతని కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియో, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు, మూడెకరాల భూమి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కూతుర్లకు విషమిచ్చిన తండ్రి

- ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పెద్ద కూతురు మృతి
- చిన్న కూతురు పరిస్థితి విషమం



నిందితుడు



నవతెలంగాణ-పాలకుర్తి

భార్యభర్తల కుటుంబ కలహాలు చిన్నారులకు శాపంగా మారాయి. కన్న తండ్రే తన ఇద్దరు కూతుర్లకు విషమిచ్చిన ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడూరు గ్రామ శివారు జానకీపురంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. పాలకుర్తి ఎస్ఐ తాళ్ల శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. జానకీపురంకు చెందిన గుండె శ్రీను-ధనలక్ష్మి దంపతులకు ఇద్దరు ఆడ పిల్లలతో పాటు ఒక కుమారుడు ఉన్నాడు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు తలెత్తడంతో ధనలక్ష్మిని శ్రీను చిత్రహింసలకు గురిచేసేవాడు. భరించలేని ధనలక్ష్మి పోలీసులను ఆశ్రయించడంతో విచా రణ జరిపిన పోలీసులు శ్రీనుపై కేసు నమోదు చేసి జైలుకు పంపించారు. జైలు నుంచి వచ్చిన శ్రీను... భార్య కాపురానికి రావడం లేదని పెద్ద మను షులకు ఫిర్యాదు చేయడంతో పెద్దల సమక్షంలో ధనలక్ష్మి కాపురానికి వచ్చింది, కాగా, కొడుకుని తీసుకొని ధనలక్ష్మి పుట్టింటికి వెళ్లింది. ఈ సమ యంలో ఈ నెల 6న ఇద్దరు కూతుళ్లకు కూల్‌డ్రింక్‌లో విషం కలిపి తాగిం చటంతో అస్వస్థతకు గురయ్యారు. గమనించిన స్థానికులు వారిని చికిత్స కోసం జనగామ ఆస్పత్రికి తరలించారు. చిన్నారుల ఆరోగ్య పరిస్థితి విష మించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా పెద్ద కుమార్తె నాగ ప్రియ (9), మృతి చెందగా, చిన్న కుమార్తె నందిని (8)ని హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ కలహాలతో కన్న కూతుర్లకే థంసప్‌లో విషం కలిపి అన్నం తినిపించడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. భార్య ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఘటనా స్థలాన్ని వర్ధన్నపేట ఏసీపీ సుందరగిరి శ్రీనివాసరావు, పాలకుర్తి సీఐ దేవనపల్లి విశ్వేశ్వర్ సందర్శించారు.

సునీత్ చోప్రా బహుముఖ ప్రజ్ఞాశాలి

సంతాప సభలో వక్తలు



న్యూఢిల్లీ : సునీత్ చోప్రాను ఉద్యమ సహచరులు, స్నేహితులు గుర్తుచేసుకున్నారు. ఇది ఒక అరుదైన విప్లవకారుడి జీవిత చిత్రమని వక్తలు కొనియాడారు. సోమవారం నాడిక్కడ ఏఐఏడబ్ల్యుయూ కేంద్ర కార్యాలయంలో సునీత్ చోప్రా సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ విప్లవకారుడిగా జీవితం గడిపిన సునీత్‌కు, ఇతరుల సామర్థ్యాలను వెలికితీసే అపురూపమైన సామర్థ్యం ఉందన్నారు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి అని, అన్నింటికంటే మంచి మనిషి అని ఏచూరి పేర్కొన్నారు. కళలు, సాంస్కృతిక రంగాల్లో ఉన్నత వర్గాలతో పాటు, గ్రామీణ వ్యవసాయ కార్మికులతో సమానంగా జీవించిన సునీత్‌ను సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాష్ కారత్ గుర్తు చేసుకున్నారు. సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకరత్ మాట్లాడుతూ లండన్‌లో సునీత్ విద్యార్థి జీవితంతో సహ అయన విద్యార్థి ఉద్యమాన్ని గుర్తు చేసుకున్నారు. సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ మాట్లాడుతూ ప్రజల మధ్య జీవించిన సునీత్, సంఘం పనిలో ఉండగానే మెట్రో స్టేషన్ లో కుప్పకూలి మృతిచెందారని తెలిపారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యుయూ) ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, జాతీయ అధ్యక్షుడు ఎ. విజయరాఘవన్ మాట్లాడుతూ ఈ ఏడాది జనవరిలో కేరళలో ఉన్న సునీత్, ఇఎంఎస్ స్వగ్రామంలో సీపీఐ(ఎం) ఇంటింటి సందర్శన కార్యక్రమంలో భాగంగా అనేక ఇండ్లను సందర్శించారని గుర్తు చేశారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా సునీత్ తనదైన ముద్ర వేయగలిగాడని విజయరాఘవన్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఏడబ్ల్యుయూ సహాయ కార్యదర్శి విక్రమ్‌సింగ్, జేఎన్‌యూ ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్, కళాకారులు, క్యూబా, ఉత్తర కొరియా ప్రతినిధులు, ఏఐకేఎస్ నాయకులు హన్నన్ మొల్లా, విజూ కృష్ణన్, ఐద్వా ప్రధాన కార్యదర్శి మరియం ధావలే, ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు విపి సాను తదితరులు నివాళులర్పించారు.

కోదాడ ఎమ్మెల్యేకు సుప్రీంకోర్టులో చుక్కెదురు

న్యూఢిల్లీ : కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులో తన వివరణ ఇచ్చేందుకు, లిఖిత పూర్వక స్టేట్‌మెంట్ నమోదు చేసేందుకు అవకాశం కల్పించాలన్న ఎమ్మెల్యే వినతిని ధర్మాసనం తిరస్కరించింది. 2018 ఎన్నికల అఫిడవిట్ లో మల్లయ్య యాదవ్ తన ఆస్తుల వివరాలను తప్పుగా వెల్లడించారని కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణకు హాజరై వాంగ్మూలం ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. పద్మావతి పిటిషన్ పై కౌంటర్ దాఖలు చేయకుండా మల్లయ్య యాదవ్ ఆలస్యం చేయడంపై పలుమార్లు న్యాయస్థానం తీవ్రంగా పరిగణించింది. హైకోర్టు ఆదేశాలపై ఎమ్మెల్యే స్పందించకపోవడంతో కౌంటర్ దాఖలు చేసే అవకాశాన్ని న్యాయస్థానం నిరోధించింది. హైకోర్టులో 2019 డిసెంబర్ 30 నుంచి 2020 మార్చి 3 వరకు ఐదు సార్లు విచారణ జరగ్గా.. మల్లయ్య యాదవ్ తరపున ఎవరూ హాజరు కాకపోవడంతో హైకోర్టు సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో తన వివరణ ఇచ్చేందుకు హైకోర్టు అనుమతి ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని మధ్యంతర ఉత్తర్వులపై సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

ఈ పిటిషన్ ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ పి ఎస్. నరసింహ, జస్టిస్ జెబి పార్థీవాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ తరపున సీనియర్ న్యాయవాది ఆదినారాయణరావు వాదనలు వినిపిస్తూ హైకోర్టులో వివరణ ఇచ్చేందుకు, లిఖితపూర్వకంగా కౌంటర్ దాఖలు చేసేందుకు తమకు అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. దీనికి స్పందించిన సిజెఐ 2020లోనే హైకోర్టు ఏం ఆదేశించిందో మీ న్యాయవాదికి తెలుసని, మూడేళ్ల తర్వాత ఇప్పుడు మీరు ఇక్కడకు రావడం ఏమిటని ప్రశ్నించారు. మీరు మీ న్యాయవాదితో మాట్లాడి పరిస్థితి తెలుసుకోవాలని మందలించారు. పలుదఫాల అవకాశం ఇచ్చినా వారు హైకోర్టుకు హాజరుకాలేదని, కౌంటర్ దాఖలు చేయలేదని పద్మావతిరెడ్డి తరపు సీనియర్ న్యాయవాది జంధ్యాల రవిశంకర్ ధర్మాసనానికి తెలియజేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం ఈ విషయంలో తాము జోక్యం చేసుకోబోమంటూ పిటిషన్ ను కొట్టివేసింది.

గవర్నర్ తీరుపై పిటిషన్ విచారణ వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదం పొందిన 10 బిల్లులను ఆమోదించేలా గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ కు ఉత్తర్వులు ఇవ్వాలని దాఖలైన పిటిషన్ పై విచారణను సర్వోన్నత న్యాయ స్థానం రెండు వారాలకు వాయిదా వేసింది. రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లులకు ఆమోదముద్ర వేసే దిశలో గవర్నర్ తీరును తప్పుబడుతూ తెలంగాణ ప్రభుత్వం మార్చి 2న సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ ను దాఖలు చేసింది. ఈ పిటిషన్ సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ పిఎస్ నరసింహా, జస్టిస్ పార్థివాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా సొలిసిటర్ జనరల్(ఎస్ జి) తుషార్ మెహతా వాదిస్తూ... గవర్నర్ కొన్ని బిల్లులు ఆమోదించారని, అందుకు సంబంధించిన వివరాలతో ఉన్న లేఖను పరిశీలించాలని కోరారు. గవర్నర్ బిల్లులను ఆమోదించవచ్చని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ నెల 9న గవర్నర్ కార్యాలయం ఒక రిపోర్ట్ కోర్టుకు అందిందనీ, అది సీజేఐ రికార్డు చేశారని తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వాన్ని మరి కొన్ని బిల్లుపై గవర్నర్ వివరణ కోరినట్టు వివరించారు. తాను గవర్నర్ తరపున అందుకున్న లేఖపై మాత్రమే వాదిస్తున్నాననీ, అయితే ఆ లేఖలో తనను ఉద్దేశించి ఉన్న అంశాన్ని తొలగించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వ తరపు అడ్వకేట్ ఆన్ రికార్డ్ (ఏఓఆర్) శ్రీహర్ష పీచర వాదనలు వినిపించారు. తెలంగాణ ప్రభుత్వం తరపు వాదనలు వినిపిస్తోన్న సీనియర్ అడ్వకేట్ హాజరు కానుందున పాస్ అవుట్ చేయాలని ధర్మాసనాన్ని కోరారు. దీనిపై స్పందించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ ఏవైనా అంశాలుంటే ప్రస్తావించాలని కోరారు. అసెంబ్లీ పాస్ చేసిన 10 బిల్లుల్లో పలు బిల్లులు 2022 సెప్టెంబర్ లో ఆమోదంపొందాయన్నారు. ఈ వాదనలపై జోక్యం చేసుకున్న సీజేఐ, పది బిల్లుల్లో మూడు బిల్లులు గతేడాది సెప్టెంబర్ లో పాస్ అయ్యాయి. ఈ బిల్లులపై గవర్నర్ కార్యాలయం నుంచి ఏవైనా ఫైనల్ ఇండికేషన్స్ ఉన్నాయా?' అని ఎస్ జీ ని ప్రశ్నించారు. ఎస్ జీ జోక్యం చేసుకొనీ, ఈ అంశాలపై తాను ఎలాంటి వ్యాఖ్యలను చేయలేనని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఈ బిల్లులపై గవర్నర్ కార్యాలయంతో చర్చించినట్టు తెలిపారు. మధ్యలో జోక్యం చేసుకున్న తెలంగాణ తరపు ఏఓఆర్ ఒక వారం వాయిదా వేయాలని కోరారు. ఇరువైపు వాదనలు విన్న ధర్మాసనం తెలంగాణ పిటిషన్ పై విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. 2022 సెప్టెంబర్ 9 నుంచి గవర్నర్ కార్యాలయంలో పెండింగ్ లో ఉన్న బిల్లుల ఆమోదంపై నిర్ణయం తెలపాలని ఆదేశాలు జారీ చేశారు. పంచాయితీ రాజ్ చట్టం(అమైండ్ మెంట్) బిల్లు, ఆజామాబాద్ ఇండిస్ట్రియల్ ఏరియా(అమైండ్ మెంట్) బిల్లు-2022 లపై న్యాయ శాఖ నుంచి ఎలాంటి స్పందన రాలేదని సీజేఐ వెల్లడించారు. తదుపరి విచారణ నాటికి ఏం జరిగిందో చెప్పాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఆదేశిస్తూ తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు.

మండుతున్న ఎండలు

9 జిల్లాల్లో 42 డిగ్రీలకుపైగా నమోదు

- దస్తూరాబాద్(నిర్మల్)లో 42.8 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత
- వచ్చే నాలుగు రోజుల్లో 2 నుంచి 4 డిగ్రీలు పెరిగే అవకాశం
- పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. సోమవారం 9 జిల్లాలో 42 డిగ్రీలకు పైగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నిర్మల్ జిల్లా దస్తూరాబాద్‌లో అత్యధికంగా 42.8 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. వచ్చే నాలుగు రోజుల్లో రాష్ట్రంలో అదనంగా రెండు నుంచి నాలుగు డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది.

41 డిగ్రీలు దాటిన జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరిక జారీ చేస్తున్నది. ఆ జాబితాలో ఆదిలాబాద్, నిర్మల్, కొమ్రంభీమ్ అసిఫాబాద్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, నల్లగొండ, హైదరాబాద్, రంగారెడ్డి, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల, సూర్యాపేట, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాలున్నాయి. ఎండలు క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

దస్తూరాబాద్(నిర్మల్)	42.8 డిగ్రీలు
కొల్లాపూర్(నాగర్‌కర్నూల్)	42.7 డిగ్రీలు
కట్టంగూర్(నల్లగొండ)	42.6 డిగ్రీలు
ఆదిలాబాద్ అర్బన్	42.6 డిగ్రీలు
నేలకొండపల్లి(ఖమ్మం)	42.5 డిగ్రీలు
ఆలంపూర్(జోగులాంబ గద్వాల)	42.4 డిగ్రీలు
హుజూర్‌నగర్(సూర్యాపేట)	42.4 డిగ్రీలు
తాళ్లమడుగు(ఆదిలాబాద్)	42.2 డిగ్రీలు
మహదేవ్‌పూర్(భూపాలపల్లి)	42.2 డిగ్రీలు

భారతదేశంలో గణరాజ్యాలు నిజమే

కానీ, ఇది ప్రజాస్వామ్యానికి పుట్టిల్లు కాదు: ఎస్వీకే ట్రస్టీ పి.సాంబిరెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారతదేశంలో గణరాజ్యాలు (స్టేట్స్ ఆఫ్ రిపబ్లికన్) ఉన్న మాట నిజమే అయినప్పటికీ, ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లు అది కాదని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్టీ పి.సాంబిరెడ్డి స్పష్టం చేశారు. ఎస్వీకే కార్యదర్శి ఎస్.వినయకుమార్ సమన్వయంలో 'ప్రజాస్వామ్యానికి మన దేశం పుట్టిల్లా? ప్రధాని వ్యాఖ్యల్లో వాస్తవమెంత?' అనే అంశంపై సోమవారం నిర్వహించిన వెబినార్‌లో సాంబిరెడ్డి వక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చారిత్రక పరిణామ క్రమంలో శాస్త్రీయంగాను సాధ్యం కానీ ప్రజాస్వామ్యం ప్రాచీన కాలంలోనే ఉన్నట్టు ప్రధాని మోడీ చెప్పుకోవడానికి ఖండించారు. మన దేశంలో బౌద్ధ పాలకులు పై చేయిగా ఉన్నప్పుడు పురోగమనం జరిగిందని తెలిపారు. ఆదిమ సమాజం సమానత్వాన్ని కలిగి ఉందని తెలిపారు. అయితే సొంత ఆస్తి, ఆ ఆస్తిని వారసులకు ఇవ్వడం తదితర పరిస్థితులు వచ్చిన తర్వాత రాజ్యాలుగా ఏర్పడ్డాయని వివరించారు. అలాంటి రాజ్యాల్లో సమాజంలోని 80 శాతం మందికి ఓటు హక్కు నిరాకరించబడిందనీ, కేవలం 20 శాతం మంది మాత్రమే తమ నాయకులను ఎన్నుకునే హక్కు కలిగి ఉన్నారని వివరించారు. 80 శాతం మంది బానిసలుగా చాతుర్వర్ణ వ్యవస్థలో పై వర్గాలకు ఊడిగం చేయడానికి ఉద్దేశింపబడ్డాయని తెలిపారు. మనుధర్మశాస్త్రం పోవాలని దానితో బాధింపబడిన అసంఖ్యాక ప్రజలు కోరుకుంటుంటే ప్రధాని మోడీ తిరిగి అలాంటి ప్రజాస్వామ్యం తేవాలనుకుంటున్నారని సాంబిరెడ్డి విమర్శించారు.

ఫ్యూడల్, పెట్టుబడీదారీ వ్యవస్థల తర్వాతే ప్రజాస్వామ్యమొచ్చిందనీ, అయితే దానికి పరిమితులున్నాయని ఆయన తెలిపారు. వైదిక మతం, వేదాలు, మనుధర్మశాస్త్రం మనలను బలహీనం చేశాయనీ, అవి బలహీనమైతేనే పురోగమనం సాధ్యం అవుతుందని తెలిపారు. బౌద్ధపాలకుల కాలంలో అవి బలహీనపడి సమాజం పురోగమనంలోకి పయనించిందనీ, అయితే ఆది శంకరాచార్యుడు పాలకుల అండతో బౌద్ధాన్ని తరిమారని తెలిపారు. ఆది శంకరాచార్యునిది ప్రతిఘాత విప్లవంగా అభివర్ణించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం అమల్లో ఉన్న ప్రజాస్వామ్యం యూరోప్‌లో పుట్టిందనీ, అంతకు ముందు అక్కడి సమాజం వెయ్యేండ్లు ఫ్యూడల్ వ్యవస్థకు, చర్చి దోపిడీకి గురయిందని తెలిపారు. ఆడంస్మిత్,హెగెల్, రూసో లాంటి వారు శ్రమ, హేతబద్ధత, సమానత్వం, స్వేచ్ఛ తదితర విషయాలు గురించి చెప్పడం, వాటితో పెట్టుబడీదారి సమాజం, కార్మికులు, రైతాంగం కలిసి ఫ్యూడల్ ప్రభు వులు, చర్చికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారని వివరించారు. చరిత్రలో తొలిసారిగా ఫ్రెంచ్‌లో సంపూర్ణ విప్లవమొచ్చిందని వివరించారు. అక్కడ శత్రు శేషం లేకుండా చేశారని తెలిపారు. ఆ తర్వాత అందరికి ఓటు హక్కు వచ్చిందన్నారు. ఆదిమ, బానిస, ఫ్యూడల్, పెట్టుబడీదారీ వ్యవస్థల క్రమాను గత పురోగమనంలో భాగంగా ప్రజాస్వామ్యం ఉద్భవించిందని తెలిపారు.

జంషెడ్‌పూర్‌లో ఉద్రిక్తత ..

- భారీగా పోలీసుల మోహరింపు

జంషెడ్‌పూర్ : జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌లో ఉద్రిక్తతలు నెలకొనడంతో భారీగా పోలీసులను మోహరించారు. ఆ ప్రాంతంలో 144 సెక్షన్ విధించడంతో పాటు ఇంటర్‌నెట్‌ను నిలిపివేసినట్టు అధికారులు తెలిపారు. స్థానిక సంస్థ సభ్యులు రామనవమి జెండాను అపవిత్రం చేశారనీ, నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం నుంచి నిరసనలు చేపట్టారని పోలీసు అధికారులు తెలిపారు. ఆదివారం రాత్రి పరిస్థితి ఉద్రిక్తంగా మారిందనీ, శాస్త్రినగర్‌లో రెండు గ్రూపులు రాళ్లు రువ్వుకోవడంతో పాటు రెండు దుకాణాలు, ఆటోకు నిప్పుపెట్టారు. దీంతో అల్లరి మూకలను చెదరగొట్టేందుకు పోలీసులు టియర్‌గ్యాస్ ప్రయోగించినట్టు అధికారులు తెలిపారు.సోమవారం ఉదయం కూడా పోలీసులు ఆ ప్రాంతంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారనీ, ప్రస్తుతం అక్కడ పరిస్థితి అదుపులో ఉందని సిటీ పోలీసు చీఫ్ ప్రభాత్ కుమార్ మీడియాకు తెలిపారు. స్థానికంగా గుమిగూడిన వారిని అక్కడి నుంచి పంపామని అన్నారు. ఆ ప్రాంతమంతా బలగాలను మోహరించామనీ, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్)ను మోహరించామని చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి కొంతమందిని అదుపులోకి తీసుకున్నట్టు తూర్పు సింగ్‌భూమ్ డిప్యూటీ కమిషనర్ విజయ జాదవ్ తెలిపారు. తాము పరిస్థితిని అంచనా వేస్తున్నామనీ, సాధారణ స్థితిని తీసుకురావడానికి కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. కొంతమంది సాంఘిక వ్యతిరేక శక్తులు శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు యత్నిస్తున్నారని అన్నారు.

అమృత్‌పాల్ సింగ్ సన్నిహితుని అరెస్ట్

చండీగఢ్ : పరారీలో ఉన్న ఖలిస్తాన్ వేర్పాటువాద నేత అమృత్‌పాల్ సింగ్ కోసం గాలింపు కొనసాగుతున్నది. అమృత్‌పాల్ సింగ్ సన్నిహితుడు పప్పల్‌ప్రీత్ సింగ్‌ను సోమవారం అరెస్టు చేసినట్టు అధికారులు తెలిపారు. పంజాబ్‌లోని హెూషియాపూర్‌లో కౌంటర్ ఇంటెలిజన్స్ పంజాబ్ పోలీసు విభాగం అదుపులోకి తీసుకుంది. పంజాబ్ పోలీసులు, ఢిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగం సంయుక్త ఆపరేషన్‌లో భాగంగా ఈ అరెస్టు జరిగినట్టు అధికారులు తెలిపారు. గత నెలలో జలంధర్‌లో అమృత్‌పాల్ సింగ్, పప్పల్‌ప్రీత్ సింగ్‌లు పోలీసులకు చిక్కినట్టే చిక్కి తప్పించుకున్నారు. అప్పటి నుంచి పప్పల్‌ప్రీత్ సింగ్ అతనితోపాటే ఉన్నాడు. హెూషియాపూర్ చేరుకున్న అనంతరం వారు తప్పించుకునేందుకు వివిధ మార్గాల్లో వెళ్లడం సీసీటీవీ కెమెరాల్లోనూ రికార్డయింది. ఏప్రిల్ 14న బైసాఖి సందర్భంగా సిక్కులతో సమావేశం ఏర్పాటు చేయాల్సిందిగా అమృత్‌పాల్ సింగ్ ప్రముఖ సిక్కు సంఘం అకాల్ తక్త్‌ని కోరిన సంగతి తెలిసిందే. దీంతో పంజాబ్ వ్యాప్తంగా పోలీసులకు సెలవులను రద్దు చేస్తున్నట్టు పంజాబ్ డీజీపీ ఆదేశించారు.

నూతన సచివాలయంలో అగ్నిప్రమాదం ఘటన

- సీబీఐ విచారణ కోరిన కెఎ పాల్ పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ : తెలంగాణ నూతన సచివాలయంలో అగ్నిప్రమాదంపై సీబీఐ విచారణ జరిపించాలంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కెఎ పాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ పిటిషన్‌ను సీజేఐ జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ పిఎస్ నరసింహా, జస్టిస్ జెబి పార్థీవాలాలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. ఆర్టికల్ 32 ప్రకారం ఈ అభ్యర్థన ఎలా చేస్తారని కెఎ పాల్‌ను ధర్మాసనం ప్రశ్నించింది. తెలంగాణ నూతన సచివాలయంలో అగ్నిప్రమాదం కాదనీ, నరబలి జరిగిందని పిటిషనర్ ఇన్ పర్సన్ పాల్ వాదించారు. ఇలాంటి పిటిషన్లు విచారించబోమని సీజేఐ స్పష్టం చేశారు. తాను 23 గంటలు ప్రయాణించి వచ్చానని కెఎ పాల్ చెబుతుండగా.. సీజేఐ జోక్యం చేసుకొని "ఏదేదో వాదిస్తున్నారు. ఉద్దేశం వేరుగా ఉంది. రాజకీయ వ్యక్తి కదా..." అని వ్యాఖ్యానించారు. దేశానికి బిలియన్లలో డొనేషన్లు ఇచ్చాననీ, ఆరుగురు సీఎంలు తన పీస్ ర్యాలీలకు వచ్చారని పాల్ పేర్కొన్నారు. కాగా, దేశంలో జరుగుతున్న అన్ని అగ్నిప్రమాదాలపైనా సీబీఐ విచారణ జరపమనాలా? అంటూ అసహనం వ్యక్తం చేసిన ధర్మాసనం పిటిషన్ కొట్టివేసింది.

నేడు వాయనాడ్‌కు రాహుల్

వయనాడ్ : కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్‌గాంధీ లోక్‌సభలో అనర్హతవేటుకు గురైన తర్వాత తొలిసారి తన నియోజకవర్గమైన వాయనాడ్‌కు మంగళవారం (ఏప్రిల్ 11) రానున్నారు. వాయనాడ్‌లో రాహుల్ మంగళవారం రోడ్‌షోను నిర్వహించనున్నట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఇక అక్కడ రాహుల్‌కు ఘనంగా స్వాగతం పలికేందుకు కాంగ్రెస్ పార్టీ భారీ ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తున్నది. కాగా, మోడీ ఇంటిపేరు గురించి రాహుల్‌గాంధీ 2019లో చేసిన వ్యాఖ్యలపై గుజరాత్‌లోని సూరత్ కోర్టు అతనికి రెండేండ్ల జైలు శిక్ష విధించిన సంగతి తెలిసిందే. శిక్షానంతరం అతనిపై లోక్‌సభలో అనర్హత వేటు పడింది. ఇక ఈ కేసు విషయంలో రాహుల్‌కి ఏప్రిల్ 4న సూరత్‌కోర్టు బెయిల్ మంజూరైంది. అయితే రాహుల్ అప్పీల్‌పై ఏప్రిల్ 13వ తేదీన ఆ కోర్టు విచారణ చేపట్టనుంది.

జ్ఞానవాపి మసీదు కేసులో 14న సుప్రీం విచారణ

- 'వాజూ'కు అనుమతి కోరిన మసీదు కమిటీ

న్యూఢిల్లీ : రంజాన్ మాసంలో వారణాసిలోని జ్ఞానవాపి మసీదు సముదాయంలో 'వాజూ' చేసుకోవడానికి అనుమతినివ్వాల్సిందిగా అంజుమన్ ఇంతెజామియా మసీదు కమిటీ చేసిన పిటిషన్‌పై ఈ నెల 14న విచారించడానికి సుప్రీం సోమవారం అంగీకరించింది. తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు శివలింగం నమూనాలో ఉందంటూ కొందరు చెబుతున్న ప్రాంతాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా గతేడాది నవంబరు 11న సుప్రీం కోరింది. ఈ అంశంపై త్వరగా విచారణ చేపట్టాల్సిందిగా మసీదు కమిటీ తరపు సీనియర్ న్యాయవాది హుజెఫా అహ్మది కోర్టును కోరారు. దీనిపై ఈ నెల 14న విచారణ చేపడతామని ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ తెలిపారు. ఈ వివాదానికి సంబంధించి వారణాసి కోర్టులో దాఖలైన అన్ని పిటిషన్లను కలిపి విచారించాలని కోరుతూ కొందరు హిందువులు చేసిన విజ్ఞప్తిపై ఈ నెల 21న విచారించడానికి సుప్రీంకోర్టు అంగీకరించింది. వాజుఖానా వద్ద గల వాటర్ ఫౌండేషన్ మొత్తం మసీదు నిర్మాణంలో భాగమని, నమాజ్ చేయడానికి ముందుగా భక్తులు చేతులు కడుక్కోవడానికి ఈ రిజర్వాయర్‌ను ఉపయోగిస్తారని మసీదు కమిటీ పేర్కొంటోంది.

మసీదుపై మూకదాడి, విధ్వంసం

- ఆరుగురికి గాయాలు
- 10మంది అరెస్టు

చండీఘడ్: హర్యానాలోని సోనీపట్‌లో గల శాండల్ కలన్ గ్రామంలో లాఠీలు చేతబట్టిన కొంతమంది మతతత్వ గూండాలు మసీదులో చొరబడి అక్కడ నమాజ్ చేస్తున్న వారిపై దాడి చేశారు. మొత్తంగా ఆ స్థలాన్నంతా ధ్వంసం చేశారు. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ దాడిలో ఆరుగురు గాయపడ్డారు. ఈ దాడికి సంబంధించి పోలీసులు 10మందిని అరెస్టు చేశారు. ఈ సంఘటన తర్వాత అదనంగా పోలీసు బలగాలను మోహరించారు. సంఘ వ్యతిరేక శక్తులు కొందరు మసీదులోకి చొరబడి, ప్రార్థనలు చేస్తున్న వారిని కొట్టారని సోనీపట్ పోలీసు కమిషనర్ సతీష్ బాలన్ తెలిపారు. ఈ దాడికి ముందు గ్రామంలో ఇరు గ్రూపుల మధ్య ఎలాంటి ఘర్షణలు, గొడవలు లేవని తెలిపారు. లాఠీలు చేతబట్టుకున్న కొంతమంది వ్యక్తులు గ్రామ వీధుల్లో అటూ ఇటూ తిరుగుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో కనిపిస్తున్నాయి. లోపల ప్రార్థనలు ఆపాలని కొంతమంది వ్యక్తులు కోరారని, ఆ తర్వాత అక్కడ విధ్వంసం సృష్టించారని స్థానికులు తెలిపారు. దాడికి పాల్పడిన వారు కూడా అదే గ్రామానికి చెందినవారు, వారిపై ఐపిసి సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు. దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని బాలన్ తెలిపారు.

ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ రెమ్యూనరేషన్ పెంచాలి : టీపీటీఎల్ఎఫ్

హైదరాబాద్:ఇంటర్మీడియట్ స్పాట్ వాల్యుయేషన్ ఎగ్జామినర్లకు ఇస్తున్న రెమ్యూనరేషన్, టీఏ, డీఏల ను పెంచాలని తెలంగాణ ప్రయివేట్ టీచర్లు, లెక్చరర్ల ఫెడరేషన్ (టీపీటీఎల్ఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు కాచిగూడ జూనియర్ కాలేజ్ క్యాంప్ ఆఫీసర్ ఐలయ్యను ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎ విజయ్ కుమార్, నాయకులు కె విజయ్, అధ్యాపకులు సైదిబాబు, సైదులు కలిసి వినతిపత్రం సమర్పించారు.

నేటినుంచి ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవాలు

13 వరకు జరపాలని తెలంగాణ రైతుసంఘం పిలుపు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 88వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం నుంచి ఈనెల 13 వరకు గ్రామాల్లో సభలు, ప్రదర్శనలను జరిపి సంఘం జెండావిష్కరణలు చేయాలని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. సోమవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవం పోస్టర్లను తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, ఉపాధ్యక్షులు నంద్యాల నర్సింహ్మారెడ్డి, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, రాష్ట్ర నాయకులు ఆర్ రాహుల్, ఆర్ ఆంజనేయులులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ దున్నేవాడికే భూమి, ఆంగ్లేయులు భారతదేశాన్ని విడిచి వెళ్లాలనే నినాదంతో 1936, ఏప్రిల్ 11న స్వాతంత్రోద్యమంలో భాగంగా ఏఐకేఎస్ ఆవిర్భవించిందని గుర్తు చేశారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, ఇతర గ్రామీణ పేదల్ని సంఘటిత పరిచిందన్నారు. భూస్వామ్య విధానాన్ని సమూలంగా రద్దు చేయడం, పేద రైతులు, వ్యవసాయ కార్మికుల ఐక్యత పునాదిగా రైతాంగాన్ని ఏకం చేసిందని చెప్పారు. రైతు సమస్యలపై ఆందోళనలు నిర్వహించడంతోపాటు ఇతర వర్గాల పోరాటాలకు సంఘీభావం తెలిపిందని అన్నారు. మార్కెట్ గుత్తాధిపత్యంతో సాగే దోపిడీని ఎదిరించిందని వివరించారు. వ్యవసాయంలో విదేశీ కంపెనీల చొరబాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని చెప్పారు. వడ్డీ ప్రమాణాల మెరుగుదల కోసం, గ్రామీణ ప్రజల సాంస్కృతిక అభివృద్ధి కోసం పాటుపడుతుందని అన్నారు. సంఘం నాయకత్వాన వర్లీ ఆదివాసుల పోరాటం, తెభాగ పోరాటం, పున్నప్రావాయలార్, గణముక్తి పోరాటాలు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగాయని గుర్తు చేశారు. భూ సంస్కరణలను అమలు జరపాలంటూ సాగిన పోరాటంతో 1968లో మొదటిసారి, 1973లో రెండోసారి అవి అమలయ్యాయని చెప్పారు. ఫలితంగా 64.96 లక్షల ఎకరాలను స్వాధీనం చేసుకుని 54.02 లక్షల ఎకరాలను దేశవ్యాప్తంగా జవంపిణీ చేశారని వివరించారు. ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను ఢిల్లీలో రైతాంగ పోరాట ఫలితంగా కేంద్రం ఉపసంహరించుకున్నదని అన్నారు. కేంద్రం ఇచ్చిన హామీల అమలు, కనీస మద్దతు ధరల చట్టం, రుణ విమోచన చట్టం కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలని రైతాంగానికి ఆయన పిలుపునిచ్చారు.

మిగిలిన రైతులకు తక్షణమే రైతుబంధు విడుదల చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం రబీలో రైతుబంధు ప్రకటించి రైతుల ఖాతాల్లో నగదును జమ చేసిందని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్, ప్రధాన కార్యదర్శి టి సాగర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కానీ కొంతమంది రైతులకు సుమారు రూ.300 కోట్ల బిల్లులు ట్రెజరీ వద్ద గత 50 రోజులుగా పాస్ చేయకుండా ఆగిపోయాయని పేర్కొన్నారు. దీంతో వారు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ బిల్లులు రాని వారిలో రైతుబంధు బాధితులున్నారని పేర్కొన్నారు. ఈ కొద్ది మంది రైతులకు జమ చేయకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రతినిధుల చుట్టూ, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ రైతులు తిరుగుతున్నారని వివరించారు. గతనెల 31వ తేదీ వరకు డబ్బులు ఖాతాల్లో వేస్తామంటూ ప్రభుత్వం ప్రకటించినా అది అమలుకు నోచుకోలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం మిగిలిన రైతులకు ఈనెల 15వ తేదీ వరకు వారి ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే బాధిత రైతులంతా ఆందోళనకు సిద్ధమవుతారని పేర్కొన్నారు.

నేటితో పది ప్రధాన పరీక్షలు పూర్తి

- సైన్స్‌కు 99.61 శాతం హాజరు
- ఏడుగురిపై మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి ప్రధాన పరీక్షలు మంగళవారం సోషల్ స్టడీస్ సబ్జెక్టుతో పూర్తి కానున్నాయి. ఈనెల మూడో తేదీ నుంచి ఈ పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. మొదటి రోజే ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్ష ప్రారంభమైన ఏడు నిమిషాలకే అంటే ఉదయం 9.37 గంటలకు ప్రశ్నాపత్రం వాట్సాప్‌లో బయటకొచ్చింది. రెండోరోజు హిందీ ప్రశ్నాపత్రం కూడా వాట్సాప్ ద్వారా బయటకొచ్చింది. దీంతో పరీక్షల నిర్వహణ, ప్రభుత్వ నిర్లక్ష్యం, పాఠశాల విద్యాశాఖ అధికారుల అలసత్వంపై పెద్దఎత్తున విమర్శలు తలెత్తాయి. మొదటి రోజు ఫస్ట్ లాంగ్వేజ్ ప్రశ్నాపత్రం బయటకు వెళ్లడానికి కారణమైన బందెప్ప, సమ్మప్పను ఉద్యోగం నుంచి ప్రభుత్వం తొలగించింది. రెండోరోజు హిందీ ప్రశ్నాపత్రం బయటకెళ్లిన ఘటనలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై పోలీసులు ఏ1 ముద్దాయిగా కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అనంతరం ఆయన బెయిల్‌పై విడుదలయ్యారు. ఆ తర్వాత థర్డ్ లాంగ్వేజ్ (ఇంగ్లీష్) పరీక్ష నుంచి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. దీంతో విద్యాశాఖ అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. సోమవారం నిర్వహించిన సైన్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు 4,86,829 మంది దరఖాస్తు చేసుకుంటే, 4,84,921 (99.61 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. 1,908 (0.39 శాతం) మంది గైర్హాజరయ్యారని వివరించారు. ప్రయివేటు విద్యార్థుల్లో 4,589 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారిలో 3,778 (82.33 శాతం) మంది పరీక్ష రాశారని తెలిపారు. 811 (17.67 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడు మంది విద్యార్థులపై మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయని తెలిపారు. నిజామాబాద్‌లో ఇన్విజిలేటర్‌ను సస్పెండ్ చేశామని, హన్మకొండలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌ను విధుల నుంచి తొలగించామని పేర్కొన్నారు.

గిరిజన జాతిని నిర్లక్ష్యం చేస్తున్న బీజేపీ

- పోస్టు కార్డు ఉద్యమాన్ని చేపట్టిన విద్యార్థులు
- పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి సత్యవతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గిరిజన జాతిని నిర్లక్ష్యం చేస్తున్నదని ఆ శాఖా మంత్రి సత్యవతి రాథోడ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో తెలంగాణ గిరిజన విద్యార్థుల పోస్టు కార్డు ఉద్యమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనులకు సంబంధించిన 10శాతం రిజర్వేషన్ల అంశంపై కేంద్రం రాజ్యాంగ సవరణ చేసి ఆమోదించకుండా నిర్లక్ష్యం చేస్తున్నదని తెలిపారు. రాష్ట్రంలో గిరిజన విశ్వవిద్యాలయం విషయంలో పట్టనట్టుగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ఈ నేపథ్యంలో తమ భవిష్యత్ ప్రయోజనాల రీత్యా ఈ అంశాలను కేంద్ర ప్రభుత్వం తక్షణం పరిగణలోకి తీసుకోవాలని కోరుతూ విద్యార్థులు పోస్టుకార్డు ఉద్యమాన్ని చేపట్టడం సముచితమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని 10శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నదనీ, దీంతో విద్య, ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయని వివరించారు. 2014 విభజన చట్టం ప్రకారం కేటాయించిన గిరిజన విశ్వవిద్యాలయాన్ని తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారామ్ నాయక్, బీఆర్ఎస్ నాయకులు జాన్సన్ రాథోడ్, ప్రొఫెసర్ రమణ నాయక్, బీఆర్ఎస్ గిరిజన విద్యార్థి నాయకుడు శ్రీను నాయక్, వివిధ యూనివర్సిటీల విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ముందస్తు సమాచారం లేకుండానే ప్రజావాణి రద్దు

సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు

- నిరాశతో వెనుతిరిగిన ఫిర్యాదుదారులు
- ముందస్తు సమాచారం లేదంటున్న ఉద్యోగస్తులు





నవతెలంగాణ-వరంగల్

వరంగల్ కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి వచ్చి అధికారులకు తమ సమస్యలను, గోడును విన్నవించుకోవడానికి వచ్చిన ప్రజలకు ప్రజావాణి రద్దయినట్టు తెలియడంతో తీవ్ర నిరాశతో వెనుదిరిగారు. సంబంధిత అధికారులకు సైతం కలెక్టరేట్‌కు వచ్చిన తర్వాతనే రద్దయిన విషయం తెలుసుకోవాల్సిన పరిస్థితి ఉంది. భగభగమనే మండే ఎండలను సైతం లెక్కచేయకుండా సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వృద్ధులు, పిల్లలు, మహిళలు, రైతులు.. రాయపర్తి, వర్ధన్నపేట, నర్సంపేట, నల్లబెల్లి, ఖిలావరంగల్ వంటి పలు మండలాల నుంచి కలెక్టరేట్‌లోని ప్రజావాణికి వచ్చారు. తీరా ప్రజావాణి రద్దయినట్టు తెలియడంతో తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి సంఘటనలు జరగలేదని, కొంతమంది అధికారుల నిర్లక్ష్యం వల్లనే ముందస్తు సమాచారం అందటం లేదని పలువురు బహిరంగంగా విమర్శించారు. ఇప్పటికైనా ప్రజావాణి నిర్వహించడానికి అనానుకుల పరిస్థితులు తలెత్తినప్పుడు ముందస్తుగా ప్రజలకు సమాచారాన్ని అందజేస్తే సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ప్రయాసపడాల్సిన అవసరం ఉండదని బాధితులు వాపోతున్నారు. డబ్బులు ఖర్చు అవుతున్నాయే తప్ప ఏండ్ల తరబడి తిరిగినా సమస్యలు పరిష్కారం కావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజావాణి లేదని ఇక్కడికి అచ్చినంక తెలిసింది : వక్కల రవి, రైతు నల్లబెల్లి

పూర్వీకుల నుంచి వారసత్వంగా నాకు వచ్చిన 1.19 ఎకరాల భూమి మీద గతంలో బ్యాంకులో లోన్ తీసుకున్నాను. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నేటి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా పాసుబుక్కులు ఇచ్చింది. 2021 తర్వాత 1-బి లో ఒక ఎకరం భూమి చూపెడుతుంది. మిగతా 19 గుంటల భూమి 1-బిలో నమోదుకాక కార్యాలయం చుట్టూ తిరగలేకపోతున్నాను. రైతుబంధు ఎకరం భూమికే వస్తుంది. 19 గుంటల భూమికి పడట్లేదని పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా పరిష్కారం కావడం లేదు. ముందస్తు సమాచారం ఇస్తే సమయం డబ్బు ఖర్చు అయ్యేది కాదు.

కంటి వెలుగుకు విశేష స్పందన

- హెచ్‌యూజే ఆధ్వర్యంలో కార్యక్రమం విజయవంతం
- శిబిరాన్ని సందర్శించిన డీఎం అండ్ హెచ్‌ఓ వెంకట్



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ (హెచ్‌యూజే - టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వెలుగు కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. సోమవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఎంహెచ్ భవన్‌లో ఎంవీఎస్ఆర్ మెమోరియల్ హాస్పిటల్‌లో కంటిపరీక్షలు నిర్వహించారు. సుమారు 150 మంది జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు టెస్టులు చేయించుకున్నారు. దగ్గరి చూపులో స్వల్ప లోపం ఉన్న జర్నలిస్టులకు అక్కడే రీడింగ్ గ్లాసెస్ అందించారు. కంటిచూపు సమస్య ఎక్కువగా ఉన్న మరికొంత మందికి మూడు వారాల్లో కండ్లద్దాలు అందజేస్తామని అధికారులు తెలిపారు.

కాగా, కంటి వెలుగు శిబిరాన్ని డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ వెంకట్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ పద్మజ, కంటి వెలుగు ప్రోగ్రామ్ ఆఫీసర్ అశ్మిత తదితరులు సందర్శించారు. పరీక్షలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రిస్కిప్షన్ గ్లాసెస్‌ను మూడు వారాల్లో అందిస్తామని డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకట్ తెలిపారు. ప్రతి ఒక్కరూ కంటి వెలుగు స్కీమ్ ద్వారా పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా హెచ్‌యూజే అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్ కుమార్, జగదీశ్వర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉచితంగా కంటివెలుగు పరీక్షలు నిర్వహించడం, అద్దాలు అందించడం అభినందనీయమన్నారు. జర్నలిస్టులకు ప్రత్యేక కంటివెలుగు శిబిరం నిర్వహించాలని కోరిన వెంటనే, సహకరించిన డీహెచ్ శ్రీనివాస్‌రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ రామలక్ష్మి, డాక్టర్ శ్రీధర్, హెచ్‌యూజే వర్కింగ్ ప్రెసిడెంట్ నవీన్, ట్రెజరర్ రాజశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాగవాణి, హెచ్‌యూజే ఆఫీస్ బేరర్లు క్రాంతి, వీరేష్, ఎం.రమేష్, ప్రశాంత్, నర్సింహా, రేణయ్య, కిష్టయ్య, శ్రీధర్, కుమార్, రవితేజ, నిస్సార్, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య, రాష్ట్ర నాయకులు పిల్లి రాంచందర్, చంద్రశేఖర్, గుడిగ రఘు, ఆనందం, మధుకర్, బండి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయ్ దిద్దుబాటు

సీఎంఆర్ పెండింగ్ ఉన్న మిల్లులకు కేటాయింపులు కష్టమే!

- డిఫాల్టర్లు, అక్రమార్కులను గుర్తించే పనిలో టాస్క్‌ఫోర్స్
- వందశాతం సీఎంఆర్ ఇచ్చిన మిల్లులకు ప్రాధాన్యత
- మిగిలిన ధాన్యం బహిరంగ మార్కెట్‌లో అమ్మే ఆలోచనలు
- ఏటా నష్టాన్ని నియంత్రించేందుకు పలు కీలక నిర్ణయాలు
- సీఎం కేసీఆర్ వద్దకు చేరిన ప్రతిపాదనలు
- మరో పది రోజుల్లో ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ షురూ!

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి (బి.శ్రీకాంత్)

ప్రతియేటా వానాకాలం, యాసంగి సీజన్‌లలో ఇబ్బడిముబ్బడిగా ధాన్యం దిగుబడి వస్తోంది. అయితే, ధాన్యం సీఎంఆర్ విషయంలో రాష్ట్ర సివిల్ సప్లయ్ శాఖ దిద్దుబాటు చర్యలకు దిగింది. మిల్లర్లు మర ఆడించిన బియ్యం ఇవ్వకపోవడం.. గడువు దాటిందని కేంద్రం తీసుకోకపోవడంతో ఆ భారమంతా రాష్ట్ర సివిల్ సప్లయ్ సంస్థపైనే పడుతోంది. ప్రతి సీజన్‌లో మిల్లర్లకు ధాన్యం కేటాయించడం.. సకాలంలో సీఎంఆర్ రూపంలో బియ్యం తిరిగి ఇవ్వకపోవడం పరిపాటిగా మారింది. కేటాయించిన ధాన్యం కొందరు మిల్లర్లు అమ్ముకోవడం, మళ్లీ వచ్చిన సీజన్ ధాన్యం మర ఆడించి పాత లెక్కలు చూపడం, రేషన్ డీలర్లతోనే పీడీఎస్ బియ్యం కొని ఎఫ్‌సీఐకి అప్పగించడం వంటి అక్రమాలూ జరుగుతున్నాయి.. దీంతో ఈసారి ఆ నష్టాన్ని నియంత్రించేందుకు సివిల్ సప్లయ్ శాఖ దిద్దుబాటు చర్యలకు దిగింది. డిఫాల్టర్లు, అక్రమార్కులకు ధాన్యం కేటాయించకుండా.. మిగిలిన ధాన్యాన్ని ఎంఎస్పీ ధరకే బయట అమ్మేందుకు సిద్ధమైనట్టు తెలిసింది. రెండు రోజుల కిందట తయారు చేసి పంపిన పలు కీలక నిర్ణయాల నివేదిక సీఎం అనుమతి కోసం ఎదురుచూస్తున్నట్టు సివిల్ సప్లయ్ వర్గాల సమాచారం.



సివిల్ సప్లయ్ సంస్థకు నష్టాలు వస్తున్న కారణాల్లో మిల్లర్లు సకాలంలో సీఎంఆర్ ఇవ్వకపోవడమే ప్రధాన అంశంగా ఉంది. ప్రతి సీజన్‌కు కొంత సీఎంఆర్ పెండింగ్ పెడుతున్న మిల్లులు.. ఆర్నెళ్లకోమారు వచ్చే ఖరీఫ్, రబీ ధాన్యం తీసుకుంటూ గందరగోళంగా బియ్యం అప్పగిస్తున్నాయి. పాత సీజన్‌కు సంబంధించిన బియ్యాన్ని తరువాతి సీజన్‌లో వచ్చే ధాన్యం మర ఆడించి ఇస్తున్న పరిస్థితి అక్కడక్కడా ఉన్నట్టు ఆరోపణలు ఉన్నాయి. అయినా పూర్తిస్థాయిలో సకాలంలో సీఎంఆర్ అప్పగించడంలో మిల్లులు చేస్తున్న జాప్యానికి ఎఫ్‌సీఐ నుంచి గడువు ముగిసిపోవడంతో ధాన్యం కొనుగోలు చేసిన ప్రభుత్వంపైనే భారం పడుతోంది. ఇది రాష్ట్ర వ్యాప్తంగా ఉంది. కరీంనగర్ జిల్లా వరకు పరిశీలిస్తే 2021-22 వానాకాలం సీజన్‌లో ప్రభుత్వం సేకరించిన 3,95,863 మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని 183 మిల్లులకు కేటాయిస్తే.. తిరిగి బియ్యం రూపంలో 2,65,228 మెట్రిక్‌టన్నుల బియ్యం రావాల్సి ఉంది. ఇందులో మిల్లులు 86.65శాతమే అప్పగించాయి. అందులోనూ వంద శాతం సీఎంఆర్ అప్పగించిన మిల్లులు 117 మాత్రమే ఉన్నాయి. మిగిలిన 66 మిల్లులు 35,401మెట్రిక్‌టన్నుల బియ్యం ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సి ఉంది. 2021-2022 యాసంగి సీజన్‌ను పరిశీలిస్తే.. ప్రభుత్వం 178 మిల్లులకు 3.07లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేటాయించింది. తిరిగి 2.08లక్షల మెట్రిక్‌టన్నుల బియ్యం రావాల్సి ఉండగా.. ఇంకా 38,519 మెట్రిక్‌టన్నుల (19శాతం) సీఎంఆర్ పెండింగ్‌లోనే ఉంది. ఇందులో 70మిల్లులు వంద శాతం సీఎంఆర్ అప్పగించగా.. 108మిల్లుల్లో ఇంకా పెండింగ్ ఉండటం గమనార్హం. మొన్నటి వానాకాలం సీజన్‌కు సంబంధించి కూడా ప్రభుత్వం మిల్లులకు కేటాయించిన ధాన్యంలో సీఎంఆర్ రూపంలో 12.21శాతమే వచ్చింది.

బయట మార్కెట్‌లో ధాన్యం అమ్ముకునే ఆలోచనలో సివిల్ సప్లయ్

ప్రతి సీజన్‌లోనూ మిల్లర్లు సకాలంలో సీఎంఆర్ ఇవ్వకపోవడం, డిఫాల్టర్లు, అక్రమార్కుల సంఖ్య పెరుగుతుండటంతో ప్రభుత్వం ఈ యాసంగి పంటపై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. కొనుగోలు చేసిన ధాన్యంలో సగం ధాన్యం మిల్లులకు ఇవ్వకుండా గోదాములకు తరలించే ఆలోచనలో ఉంది. తద్వారా మిల్లర్లపై ఒత్తిడి తగ్గి సకాలంలో మిల్లింగ్ పూర్తయ్యే అవకాశాలు ఉంటాయని భావిస్తోంది. ఒకవేళ ఖాళీగా ఉన్న మిల్లర్లకు అవసరమైతే మరికొంత ధాన్యాన్ని ఇవ్వనుంది. లేకపోతే ఎంఎస్పీ నష్టపోకుండా టెండర్ల ప్రక్రియ ద్వారా ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో అమ్మే ఆలోచనలో ఉంది. మొత్తంగా ట్రాన్స్‌పోర్టు, మిల్లింగ్, సీఎంఆర్ డెలివరీ, ఎఫ్‌సీఐతో ఇబ్బందులు లేకుండా.. పౌరసరఫరాల శాఖ నష్టపోకుండా చర్యలు తీసుకునేందుకు పలు కీలక ప్రతిపాదనలు తయారు చేసుకుంది. ఇప్పుడు వాటిని సీఎం కేసీఆర్ దగ్గర అనుమతి కోసం పంపించారు.

అన్నీ హొటళ్లు, రెస్టారెంట్లలో తాగునీటిని ఉచితంగా అందించాలి

- అర్వింద్ కుమార్

నవతెలంగాణ - హైదరాబాద్

గ్రేటర్ హైదరాబాద్‌లోని అన్ని హొటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, వీధి వ్యాపారులు తప్పనిసరిగా జలమండలి సరఫరా చేసే తాగునీటిని గానీ, ఆర్.ఓ వాటర్, శుద్ధి చేసిన నీటిని గానీ తప్పనిసరిగా ఉచితంగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమీషనర్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. ఒకవేళ, హొటళ్లు, రెస్టారెంట్లలో తప్పనిసరి పరిస్థితుల్లో వాటర్ బాటిళ్లను సరఫరా చేస్తే ఆయా బాటిళ్లపై ముద్రించిన గరిష్ట ధరను మాత్రమే వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలోని అనేక హొటళ్లు, రెస్టారెంట్లలో వేర్వేరు బ్రాండ్ల పేరుతో బాటిల్ వాటర్‌ను అత్యధిక ధరకు విక్రయిస్తున్నారని ఒక స్వచ్ఛంద సంస్థ చేసిన ఫిర్యాదు మేరకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి స్పందించారు.

పేపర్ లీకేజీ కాదు..మాల్ ప్రాక్టీస్

- కుట్రపూరితంగా కేసుల నమోదు
- బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

పదో తరగతి పేపర్ లీకేజీ కాలేదని, మాల్ ప్రాక్టీస్ జరిగిందని బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యులు, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం వరంగల్ పోలీసు కమిషనర్ కార్యాలయానికి వచ్చిన ఆయన విచారణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంటపాటు ఈటల రాజేందర్‌ను పోలీసు అధికారులు ప్రశ్నించారు. విచారణ అనంతరం ఈటల మీడియాతో మాట్లాడారు. ప్రగతిభవన్‌లో అధికారాలను అడ్డుపెట్టుకొని కుట్ర పూరితంగా అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. కేసీఆర్‌ను అధికారం నుంచి దించేంత వరకు ప్రజలకు అండగా ఉంటామఇన తెలిపారు. 30 లక్షల మంది యువతీయువకులు ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నారని, 4 పరీక్షా పత్రాలు లీకైనట్టు దర్యాప్తులో తేలిందని, వారి జీవితాలతో సీఎం కేసీఆర్ ఆటలాడుతున్నారని విమర్శించారు. ఉదయం 9.30 గంటలకు పదో తరగతి పరీక్ష ప్రారంభమై 11.00 గంటల తరువాత పేపర్ బయటకు వస్తే అది లీకేజీ కాదని, కేవలం ఆ పరీక్షా కేంద్రంలో జరిగిన మాస్ కాపీయింగ్ మాత్రమేనన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై సర్వత్రా చర్చ జరుగుతుండటంతో దాన్నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే ఈ కేసులు పెడుతున్నారని ఆరోపించారు.

రైల్వే, రోడ్ల విస్తరణతో నిర్వాసితులకు అన్యాయం

- పరిహారం ఇవ్వాలని ఖమ్మం జిల్లా కలెక్టర్‌కు..
- కమ్యూనిస్టు పార్టీల వినతి



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

జాతీయ రహదారుల పరిహారం విషయంలో ఎకరం రూ.కోట్ల విలువ చేసే పంట భూములను రూ.25 లక్షల లోపే పరిహారం చెల్లిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్వాసితులకు తీరని నష్టం చేకూరుస్తోందని సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, న్యూడెమోక్రసీ ఆరోపిస్తున్నాయి. మహబూబాబాద్ (కొరవి)- కోదాడ 365 ఏ జాతీయ రహదారి నిర్వాసితులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తూ సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కలెక్టర్ వీపీ గౌతమ్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు మాట్లాడుతూ.. కొరవి- కోదాడ నాలుగు వరుసల జాతీయ రహదారితో రూ.కోట్ల విలువ చేసే భూములు కోల్పోతున్న రైతులను ఆదుకోవాలని కోరారు. బహిరంగమార్కెట్లో ఎంత ధర ఉందో అంతమొత్తం పరిహారంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన వారిలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రూరల్ మండల కార్యదర్శి నంద్ర ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు ఊరడి సుదర్శన్‌రెడ్డి, పి.మోహన్‌రావు, కోటి శ్రీనివాసరావు, సీపీఐ నాయకులు దొండపాటి రమేష్, పుచ్చకాయల సుధాకర్, చందర్‌రావు, ఎం.వెంకటరెడ్డి, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు మలీదు నాగేశ్వరావు, ఆవుల వెంకటేశ్వర్లు, న్యూడెమోక్రసీ నుంచి ఉపేందర్ ఉన్నారు.

నర్సింగ్ ఎక్సలెన్సీ అవార్డు గ్రహీత పుష్పకు అభినందనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రం నుంచి నర్సింగ్ ఎక్స్‌లేన్సి అవార్డును అందుకున్న ఏకైక నర్సుగా కె.పుష్పకు పలువురు అభినందనలు తెలిపారు. సమర్పణ్ దివస్ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పేద రోగుల సేవల కోసం విశిష్ట సేవలందించిన నర్సులను ఎంపిక చేసి అవార్డులను అందజేసింది. ఢిల్లీ ఐఎంఏ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి డాక్టర్ మంజుపర మహేంద్రబాయ్, ఐఎంఏ జాతీయ అధ్యక్షులు డాక్టర్ శారద కె.ఆర్.అగర్వాల్, ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ అధ్యక్షులు డాక్టర్ దిలీప్ కుమార్ చేతుల మీదుగా నిలోఫర్ ఆస్పత్రి గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ అవార్డును అందుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉషారాణి తదితరులు ఆమెను అభినందించారు. అనంతరం పుష్ప మాట్లాడుతూ తన సేవలను గుర్తించి అవార్డుకు రెఫర్ చేసిన ట్రెన్డ్ నర్సెస్ అసోసియేషన్ (టీఎన్ఏ) అధ్యక్షురాలు డాక్టర్ రాజేశ్వరికి కతజ్ఞతలు తెలిపారు.


సంపాదకీయం

అ'న్యాయ తీర్పు'

మూడున్నర దశాబ్దాల క్రితం ఉత్తరప్రదేశ్‌లోని మలియానా గ్రామంలో జరిగిన పాశవిక ఊచకోత అప్పట్లో యావత్ దేశానికి భయోత్పాతం కలిగించగా అటువంటి కేసులో నేరారోపణలెదుర్కొంటున్న

> కేంద్రంలో బీజేపీ అధికారంలోకొచ్చాక మత ఘర్షణల కేసుల్లో నిందితులకు శిక్షలు తక్కువగా పడుతున్నాయి. గడచిన ఐదేండ్లల్లో 30శాతం లోపే శిక్షలు పడ్డాయని నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) నివేదిక పేర్కొంది. ఢిల్లీలో 1984లో సిక్కు వ్యతిరేక అల్లర్లుకానీ 2002లో గుజరాత్‌లో గోధ్రా అనంతర మారణ హోమంకానీ కేవలం విచారణలు ఆలస్యమైతేనో, దర్యాప్తు వ్యవస్థలు విఫలమైతేనో నిందితులు తప్పించుకున్నారనడం పాక్షిక విశ్లేషణే అవుతుంది. రాజకీయ ప్రభావం, దర్యాప్తు వ్యవస్థల కుమ్మక్కు కేసులు నీరుగారడానికి, న్యాయం ఆలస్యం కావడానికి, బాధితులకు న్యాయం దక్కకపోవడానికి ప్రధాన కారణాలు. పైకోర్టులను ఆశ్రయించి న్యాయం కోసం ప్రయత్నించాలి.

40మంది నిందితులకు స్థానిక న్యాయస్థానం క్లీన్‌చిట్ ఇవ్వడం జాతి మొత్తాన్నీ నివ్వెరపర్చింది. కోర్టుల్లో తమకు న్యాయం జరుగుతుందని 36 ఏండ్లుగా నిరీక్షించిన బాధిత కుటుంబాలకు గుండెకోత మిగిల్చింది. 1987 మే 23న మీరట్ నగర శివార్లలోని మలియానా గ్రామంపై ప్రాంతీయ సాయుధ కానిస్టేబుళ్ల బృందం అర్ధరాత్రి సమయంలో అల్లరి మూకలను వెంబడేసుకొని విచక్షణా రహితంగా కాల్పులు జరపగా 72మంది ముస్లింలు మరణించారు. ఈ మారణకాండ కేసు పోలీస్ దర్యాప్తు, కోర్టు విచారణ నత్తకు నడక నేర్పింది. దాడిలో 93 మంది పాల్గొనగా దశాబ్దాలపాటు విచారణ సాగడంతో చనిపోయిన వారు చనిపోగా 40మంది నేర అభియోగం ఎదుర్కొం టున్నారు. 800తడవలు కోర్టులో విచారణానంతరం సరైన సాక్ష్యాలు లేవంటూ మధుర జిల్లాకోర్టు నిందితులను వదిలిపెట్టింది. దర్యాప్తు ఏజెన్సీలు, ప్రాసిక్యూషన్ విఫలం కావడం వలన, ఆ రెండు ప్రక్రియలూ ఆలస్యమైనందున బాధితులకు న్యాయం జరగలేదు.




మలియానా హింసాకాండ నేపథ్యాన్ని చూడాలి. వివాదాస్పద బాబ్రీ మసీదు తాళాలు తెరిచాక 1987 మే 17న మీరట్‌లో పెద్ద ఎత్తున మతఘర్షణలు చెలరేగాయి. నగరంలో కర్ఫ్యూ విధించారు. మలియానా దాడి జరగడానికి ఒక్క రోజు ముందు మే 22న మీరట్ శివార్లలోని హషింపురా నుంచి 40మంది ముస్లింలను ప్రాంతీయ సాయుధ దళం, అల్లరి మూకలతో కలిసి అపహరించి ఢిల్లీ-యూపీ బోర్డర్‌కు తరలించి కిరాతకంగా కాల్చి చంపింది. శవాలను అప్పర్‌గంగ కాల్వలో పడేశారు. ఈ కేసు ముప్పై ఏండ్లు నడవగా మొదటి ప్రయత్నంలోనే ప్రాసిక్యూషన్ కేసును రుజువు చేయడంలో వైఫల్యం చెందింది. ట్రయల్‌కోర్టులో సాయుధ దళం తన జనరల్ డైరీని చూపించలేదని తెలియ వచ్చింది. ఆ అంశమే 2018లో ఢిల్లీ హైకోర్టు నిందితులపై నేరారోపణలు చేసేందుకు అవకాశం కల్పించింది. మలియానా కేసులోనూ ఎఫ్‌ఐఆర్ వైఫల్యం కనిపిస్తుంది. ప్రాసిక్యూషన్ అత్యంత లోపభూయిష్టం గా పనిచేసిందని మధుర కోర్టు ఎత్తిచూపింది. ప్రాసిక్యూషన్ కోర్టుకు అందజేయాల్సిన డాక్యుమెంట్లను కనీసం క్రమపద్ధతిలో పెట్టలేదు. పోస్టుమార్టం రిపోర్టులను ఫొటోకాపీలను అందజేసింది. వాటిని కోర్టు సాక్ష్యాలుగా అంగీకరింపని విధంగా చేసింది. కొందరు నిందితులు సంఘటనకు ముందే చనిపోయారంటూ ఓటర్ల జాబితాలో వారి పేర్లను పోలీసులు మార్చే ప్రయత్నం చేశారని కోర్టు దృష్టికి వచ్చింది. దర్యాప్తు అధికారి క్రాస్ ఎగ్జామినేషన్‌ను పూర్తి చేయలేదు. ఇంత దారుణంగా ఇన్వెస్టిగేషన్, ప్రాసిక్యూషన్ వ్యవస్థలు పని చేసినందునే నేరస్తులు బయటపడ్డారు.

కేంద్రంలో బీజేపీ అధికారంలోకొచ్చాక మత ఘర్షణల కేసుల్లో నిందితులకు శిక్షలు తక్కువగా పడుతున్నాయి. గడచిన ఐదేండ్లల్లో 30శాతం లోపే శిక్షలు పడ్డాయని నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) నివేదిక పేర్కొంది. ఢిల్లీలో 1984లో సిక్కు వ్యతిరేక అల్లర్లుకానీ 2002లో గుజరాత్‌లో గోధ్రా అనంతర మారణ హోమంకానీ కేవలం విచారణలు ఆలస్యమైతేనో, దర్యాప్తు వ్యవస్థలు విఫలమైతేనో నిందితులు తప్పించు కున్నారనడం పాక్షిక విశ్లేషణే అవుతుంది. రాజకీయ ప్రభావం, దర్యాప్తు వ్యవస్థల కుమ్మక్కు కేసులు నీరుగారడానికి, న్యాయం ఆలస్యం కావడానికి, బాధితులకు న్యాయం దక్కకపోవడానికి ప్రధాన కారణాలు. పైకోర్టులను ఆశ్రయించి న్యాయం కోసం ప్రయత్నించాలి. గుజరాత్‌లో బిల్కిస్‌బానో కేసులో శిక్షలు పడ్డ నిందితులనూ వదిలిపెడుతున్న ప్రభుత్వాలు కేంద్రంలో, కొన్ని రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న వేళ, మలియానా తీర్పు ఆందోళన కలిగిస్తుంది. మత విద్వేషాలు రెచ్చ గొడుతున్న ఉన్మాదశక్తులకు ఇంకా భయం లేకుండా పోతుంది. అటువంటి కుట్రలను ప్రజలు అప్రమత్తతతో ఎదుర్కోవాలి.

రబ్బరుతోటల రైతుల ఘోష

రబ్బరు ధరలు కరోనా కాలంలో పడిపోయాయి. ఆ తర్వాత మళ్ళీ కొంతమేరకు పెరిగినా ప్రస్తుతం మళ్ళీ పడిపోయాయి. కేరళ రాష్ట్రంలో రబ్బరు సాగు ఎక్కువ. దేశంలోని మొత్తం రబ్బరు పంటలో 80శాతం ఒక్క కేరళలోనే సాగుచేస్తారు. ఆ రైతులంతా ఇప్పుడు దారుణంగా దెబ్బతిన్నారు. కేంద్ర ప్రభుత్వం రబ్బరు రైతులను ఆదుకోడానికి ఏ మాత్రం తటపటాయింపూ లేకుండా తిరస్కరించింది. ఆ విధంగా తిరస్కరించడానికి మోడీ ప్రభుత్వం చూపిస్తున్న సాకులు ఏ మాత్రమూ సహేతుకంగా లేవు.



ప్రభాత్ పట్నాయక్

సీపీఐ(ఎం)కు చెందిన పార్లమెంటు సభ్యులు కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి పియూష్ గోయెల్‌ను కలిసి కేంద్ర ప్రభుత్వం రబ్బరు రైతులను ఆదుకోడానికి జోక్యం చేసుకోవాలని, రబ్బరుకు కనీస మద్దతు ధర ప్రకటించాలని కోరారు. కాని మంత్రిగారు ఆ డిమాండ్‌ను పూర్తిగా తోసిపుచ్చారు. వాణిజ్య పంటలకు కనీస మద్దతు ధర నిర్ణయించడం కేంద్ర ప్రభుత్వ విధానం కానేకాదన్నారు. దేశంలో విస్తృత ప్రాంతంలో ఎక్కువగా పండించే ప్రధాన

> ఆహార భద్రత కల్పించడం అంటే అవసరాలకు తగినంత మోతాదులో వాటిని అందుబాటులో ఉంచడం, వాటి ధరలను స్థిరంగా ఉంచడం మాత్రమే కాదు. వాటి డిమాండ్‌ను కూడా భద్రంగా ఉంచాలి. అంటే ప్రజానీకపు కొనుగోలుశక్తిని తగినంత మోతాదులో ఉండేలా చూసుకోవాలి. కేవలం తగినంత పరిమాణంలో ఆహారధాన్యాలను పండించేలా చూడడం ఒక్కటే ఆహారభద్రతకు సరిపోతుంది అనుకోవడం పొరపాటు. ఆహారధాన్యాల సరఫరా సక్రమంగా ఉండడంతోబాటు వాటి పంపిణీ కూడా సక్రమంగా జరిగేలా డిమాండ్ ను కూడా సక్రమంగా ఉంచుకోవడం కూడా ఆహార భద్రతలో భాగమే.

పంటలకు, ఎక్కువమంది ప్రజానీకం వినియోగించే పంటలకు, ఎక్కువ కాలం పాటు నిల్వ ఉండే పంటలకు, ముఖ్యంగా ఆహార భద్రతకు అవసరమైన పంటలకు మాత్రమే కనీస మద్దతు ధర ప్రకటించడం ప్రభుత్వ విధానం అని పియూష్ గోయెల్ వివరించారు. వాణిజ్య పంటలు ఈ ప్రమాణాలకు అనుగుణంగా లేనందున వాటికి కనస మద్దతు ధర నిర్ణయించడం కుదరదని ఆయన చెప్పారు.

ఇది రోతపుట్టించే వాదన. అసలు కనీస మద్దతు ధర అనేది ఎందుకు ప్రవేశపెట్టవలసి వచ్చిందో బహుశా మంత్రికి తెలియదనుకుంటాను. ఒకానొక సరుకు ధర ఎక్కువకాలం పాటు స్థిరంగా కొనసాగుతూ ఉంటే దానికి కనీస మద్దతు ధర అవసరం ఉండదు. ఒకానొక పంట ధర అస్థిరంగా కిందకు, పైకి మారిపోతూ ఉంటే, దాని ధర పడిపోయినప్పుడు ఆ పంటను పండించిన ఉత్పత్తిదారులకు (రైతులకు) దుర్భర పరిస్థితి ఏర్పడుతుంది. అటువంటి పరిస్థితిని నివారించడానికే కనీస మద్దతు ధర నిర్ణయించే విధానం వచ్చింది. అంతే తప్ప ఆ పంట ఎంత ఎక్కువ భూ భాగంలో పండిస్తారన్న ప్రమాణం కాని, ఇంకొక ప్రమాణం కాని కనీస మద్దతు ధర నిర్ణయించడానికి ప్రాతిపదిక కానేకావు. పంటల ధరల ఎగుడు, దిగుడుల నుండి రైతులను రక్షించడానికి మాత్రమే మద్దతు ధర నిర్ణయించడం అవసరమైంది. వాస్తవానికి ఆహార పంటలకన్నా, వాణిజ్య పంటల ధరలే ఎక్కువగా ఎగుడు దిగుడులకు లోనవుతూ ఉంటాయి.

దీని వెనుక కారణం ఇది: ఏదైనా పంట పండిన వెంటనే, ఎక్కువ మొత్తంలో మార్కెట్‌లో అందుబాటులోకి వస్తుంది. ప్రభుత్వం గనుక కనీస మద్దతు ధర రూపంలో ఆదుకోకపోతే, ఆసమయంలో దాని ధర పడిపోతూ ఉంటుంది. దానిని కొని ఎక్కువ మొత్తంలో నిల్వ చేసుకునే హోల్‌సేల్ వ్యాపారులు ఎంత తక్కువ ధరకు దానిని కొనగలిగితే అంత తక్కువకే కొనడానికి మొగ్గు చూపుతారు. రాబోయే కాలంలో ఆ సరుకు ఏ రేటుకు అమ్ముడు పోగలదో అంత కచ్చితంగా చెప్పలేనప్పుడు దానిని ఇప్పుడు వీలైనంత తక్కువ రేటుకే కొనడానికి వాళ్ళు సిద్ధపడతారు. అదే భవిష్యత్తులో ఆ సరుకు ధరలో అంత ఎక్కువ హెచ్చుతగ్గులు ఉండబోవు అని అంచనా ఉన్నప్పుడు ఆ సరుకును ఎక్కువ మొత్తంలో కొని నిల్వ ఉంచుకోడానికి సిద్ధపడతారు. అందువలన ఆ సరుకు ప్రస్తుత ధర పడిపోకుండా నిలదొక్కుకుంటుంది.



ఎక్కువ మంది ప్రజానీకం తరచూ వినియోగించే ఆహార ధాన్యాల వంటి సరుకుల ధరలు మరీ అంత హెచ్చుతగ్గులకు గురికావు. ఎందుకంటే ఆహారధాన్యాల ధరలు మరీఎక్కువగా పెరిగిపోతే దాని పర్యవసానాలను ఏ సమాజమూ భరించలేదు. అత్యంత దుర్మార్గమైన వలసపాలన కాలంలో మాత్రమే ఆహార ధాన్యాల ధరలు విపరీతమైన ఎగుడుదిగుడులకు గురయ్యాయి. అందుచేత కనీస మద్దతు ధర ఉన్నా, లేకున్నా ఆహార ధాన్యాల ధరల్లో ఎగుడుదిగుడులు కొంతమేరకు పరిమితంగానే ఉంటాయి. కాని వాణిజ్య పంటల విషయంలో అలా కాదు. ఎగుమతుల కోసం పండించే పంటలు, లేదా దేశీయంగా అంత అవశ్యం కాని సరుకుల తయారీకి ముడిసరుకుగా వినియోగించే పంటలు ధరల విషయంలో అంత స్థిరంగా ఉండవు. ఎక్కువ ఎగుడు దిగుడులకు లోనవుతూ ఉంటాయి.

ఈ వాస్తవం రబ్బరు ధరలను పరిశీలిస్తే బాగా కనిపిస్తుంది. 2014లో ఒక కిలో ముడి రబ్బరు ధర రూ.245 నుండి రూ.77కి పడిపోయింది. అంటే దాదాపు 70శాతం పడిపోయింది. ఇది రబ్బరు రైతుల పాలిట ఆశనిపాతంగా పరిణమించింది. ఈ మధ్య కాలంలో చూసినా ఇదే ధోరణి కనిపిస్తోంది. నవంబరు 2021లో కిలో ముడి రబ్బరు రూ.200 ఉంటే అది ఇప్పుడు రూ.120కి పడిపోయింది. అంటే దాదాపు 40శాతం. ఇటువంటి విపరీతమైన పతనం నుంచి రైతులను ఆదుకోడానికే ప్రభుత్వం జోక్యం చేసుకోవడం, కనీస మద్దతు ధర ప్రకటించడం అవసరం. అప్పుడే ధరల హెచ్చు తగ్గులను కొంతమేరకు అదుపు చేయడం సాధ్యపడుతుంది.

నయా ఉదారవాద విధానాలను మన దేశంలో అమలు చేయడం మొదలు పెట్టక మునుపు, అంటే ప్రభుత్వ జోక్యం, నియంత్రణలో ఆర్థిక వ్యవస్థ నడిచిన కాలంలో, వాణిజ్య పంటలకు వివిధ బోర్డులు ఉండేవి. అవి ఆ వాణిజ్య పంటలను నిర్దిష్ట కనీస ధరలకు కొనుగోలు చేసేవి. ధరలు పతనం అయ్యే పరిస్థితులు ఏర్పడితే బలంగా జోక్యం చేసుకునేవి. కాని, నయా ఉదారవాద విధానాల మొదలయ్యాక, ఈ బోర్డులు ఉనికిలో కొనసాగుతున్నప్పటికీ, వాణిజ్య పంటలను కొనుగోలు చేయడం, వాటిని అమ్మడం వంటి కార్యకలాపాలను నిలిపివేశాయి. అంటే అవి మార్కెట్‌లో జోక్యం చేసుకోవడం మానేశాయి.

పియూష్ గోయెల్ ఇంకొక విషయాన్ని కూడా చెప్పారు. ఆహార భద్రత కోసం ఆహార ధాన్యాల ధరలను స్థిరంగా ఉంచడం అవసరం అని, అటువంటి స్థిరత్వాన్ని వాణిజ్య పంటల విషయంలో కల్పించనవసరం లేదని అభిప్రాయపడ్డారు. ఇది అర్థంలేని వాదన. ఆహార ధాన్యాలకు కనీస మద్దతు ధర కల్పించడం అవసరం అన్న విషయంలో రెండోఅభిప్రాయం లేనేలేదు. కాని ఏ విధమైన మద్దతు ధర వాణిజ్య పంటల విషయంలో కూడా అవసరం. అప్పుడే డిమాండ్ ను పెంచగలుగుతాం. రబ్బరు పంటకు కనీస మద్దతు ధర లేకపోతే ఆ పంట రేట్లు మార్కెట్ లో కుప్పకూలిపోతే, అప్పుడు రబ్బరు రైతుల ఆర్థిక స్థితి ఛిన్నాభిన్నమైపోతుంది. అప్పుడు వాళ్ళు తమకు అవసరమైన వస్తువులను మార్కెట్‌లో కొనుగోలు చేయలేరు. ఆహారధాన్యాల ధరలను స్థిరంగా ఉంచినా, రబ్బరు రైతులు వాటిని కొనగలిగే స్థితిలో ఉండరు.

ఒకవేళ రబ్బరు ధరలు పడిపోయినప్పుడు కూడా ఆ రైతులు ఆహారధాన్యాలను ఇంతకు ముందులాగే కొనుగోలు చేయడం కొనసాగించగలిగారు అని మాటవరసకి అనుకుందాం. అప్పుడు వాళ్ళు వేరే ఇతర సరుకులను అంతకు ముందు కొనుగోలు చేసిన స్థాయిలో కొనలేరు. అప్పుడు ఆ ఇతర సరుకులను ఉత్పత్తి చేసేవారి కొనుగోలుశక్తి పడిపోతుంది. అప్పుడు వాళ్ళు ఆహారధాన్యాలను అంతకుముందరి స్థాయిలో కొనుగోలు చేయలేరు.

ఆహార భద్రత కల్పించడం అంటే అవసరాలకు తగినంత మోతాదులో వాటిని అందుబాటులో ఉంచడం, వాటి ధరలను స్థిరంగా ఉంచడం మాత్రమే కాదు. వాటి డిమాండ్‌ను కూడా భద్రంగా ఉంచాలి. అంటే ప్రజానీకపు కొనుగోలుశక్తిని తగినంత మోతాదులో ఉండేలా చూసుకోవాలి. కేవలం తగినంత పరిమాణంలో ఆహారధాన్యాలను పండించేలా చూడడం ఒక్కటే ఆహారభద్రతకు సరిపోతుంది అనుకోవడం పొరపాటు. ఆహారధాన్యాల సరఫరా సక్రమంగా ఉండడంతోబాటు వాటి పంపిణీ కూడా సక్రమంగా జరిగేలా డిమాండ్ ను కూడా సక్రమంగా ఉంచుకోవడం కూడా ఆహార భద్రతలో భాగమే.

మరి ఒక కేంద్ర ప్రభుత్వంలో కేబినెట్ స్థాయిలో ఉన్న వ్యక్తి ఇటువంటి అర్థంలేని వాదనలను ఎందుకు చేస్తున్నట్టు? కొద్ది కాలం క్రితం ఇదే ప్రభుత్వం అసలు కనీస మద్దతు ధరల విధానమే అనవసరం అని చెపుతూ దుర్మార్గమైన నల్ల చట్టాలను తెచ్చింది. అప్పుడు ఆహారధాన్యాలకు కూడా కనీస మద్దతు ధర అవసరం లేదు అన్న ప్రభుత్వం ఇప్పుడు వాణిజ్య పంటలకు అవసరం లేదంటున్నది. రైతులు పట్టుదలగా పోరాడడంతో దిగివచ్చి ఆ నల్ల వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుంది.

> మన దేశీయ వ్యవసాయాన్ని దెబ్బతీయడానికి సిద్ధమైపోయిన కేంద్ర ప్రభుత్వ విధానానికి భిన్నంగా కేరళ రాష్ట్ర ప్రభుత్వం తన ఆర్థిక వనరుల పరిమితులు ఎన్ని ఉన్నా, రబ్బరు రైతులకు అండగా నిలబడుతోంది. 204లో రబ్బరు ధరల స్థిరీకరణ నిధిని నెలకొల్పింది. గతేడాది బడ్జెట్‌లో అందుకోసం కేటాయింపులను రూ.600కోట్లకు పెంచింది. కిలో రబ్బరుకు కనీస ధర రూ.170గా నిర్ణయించింది. అంతకన్నా తక్కువ ధరకు రబ్బరును అమ్ముకోవలసివస్తే ఆ తేడాను రాష్ట్ర ప్రభుత్వం రైతుకు భర్తీ చేస్తోంది.

కార్పొరేట్-హిందుత్వ శక్తుల కలయిక మీద ఆధారపడి నడుస్తున్న ఈ ప్రభుత్వం వ్యవసాయంలో ఎలాగైనా కార్పొరేట్ల ప్రవేశానికి తలుపులు తెరవాలన్న ప్రయత్నంలో ఉంది. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల డిమాండ్లకు అనుగుణంగా వ్యవసాయ రంగ రూపురేఖల్ని మార్చేయాలని చూస్తోంది. కార్పొరేట్లకు రైతులకు నేరుగా సంబంధం నెలకొల్పితే అప్పుడు స్వదేశీ, విదేశీ కార్పొరేట్ రాబందుల ముందు రైతులు దాసోహం అనక తప్పని పరిస్థితి వస్తుంది. ఇప్పుడు ఈ ప్రభుత్వం లక్ష్యం ఇదే. పైకి దేశం గురించి, దేశ ప్రయోజనాల గురించి ఎన్ని కబుర్లు చెపుతున్నా, వాస్తవానికి అమలు చేస్తున్నది మాత్రం ఈ నయా ఉదారవాద ఎజెండానే. వ్యవసాయం విషయంలో ప్రపంచ వాణిజ్య సంస్థ ఏం కోరుతోందో దానినే మోడీ ప్రభుత్వం అమలు చేయడానికి పూనుకుంటున్నది.

వ్యవసాయానికి ప్రభుత్వం మద్దతు ఇచ్చే విధంగా జోక్యం చేసుకోవడం అంటే ప్రపంచ వాణిజ్య సంస్థ దృష్టిలో అది మార్కెట్‌లో అనుచిత జోక్యం చేసుకోవడం అవుతుంది. అదే రైతులకు నేరుగా నగదు బదిలీ చేస్తే మాత్రం అది అనుచిత జోక్యం అనిపించుకోదు. అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలు వందల కోట్ల డాలర్లు తమతమ రైతులకు నేరుగా నగదు రూపంలో అందిస్తుంటాయి. అందుకు ప్రపంచ వాణిజ్య సంస్థ ఏ అభ్యంతరమూ చెప్పదు. అదే కనీస మద్దతు ధర కల్పించే రూపంలో జోక్యం చేసుకుంటే మాత్రం అది మార్కెట్‌లో ధరలను ప్రభావితం చేస్తుంది అన్నవాదనతో దానిని వ్యతిరేకిస్తుంది. మార్కెట్ పూర్తిగా పోటీ మార్కెట్‌గానే ఉండాలని అంటుంది. అయితే వాస్తవంలో ఆ మార్కెట్ పూర్తిగా అగ్రి-బిజినెస్ కార్పొరేట్ల గుత్తాధిపత్యంలో నడుస్తుంది. కనీస మద్దతు ధర అనగానే, వాళ్ళకి అదొక ఆటంకంగా, అనుచిత జోక్యంగా అనిపిస్తుంది. ఎంత తక్కువ రేటుకు వీలైతే అంత తక్కువకే రైతులను దోచుకోవాలనుకునేవాళ్ళకి కనీస మద్దతు ధర అనే పద్ధతి ఆటంకంగానే అనిపిస్తుంది మరి.

అటువంటి శక్తులకి దాసోహం అంటూ మన దేశీయ వ్యవసాయాన్ని దెబ్బతీయడానికి సిద్ధమైపోయిన కేంద్ర ప్రభుత్వ విధానానికి భిన్నంగా కేరళ రాష్ట్ర ప్రభుత్వం తన ఆర్థిక వనరుల పరిమితులు ఎన్ని ఉన్నా, రబ్బరు రైతులకు అండగా నిలబడుతోంది. 204లో రబ్బరు ధరల స్థిరీకరణ నిధిని నెలకొల్పింది. గతేడాది బడ్జెట్‌లో అందుకోసం కేటాయింపులను రూ.600కోట్లకు పెంచింది. కిలో రబ్బరుకు కనీస ధర రూ.170గా నిర్ణయించింది. అంతకన్నా తక్కువ ధరకు రబ్బరును అమ్ముకోవలసివస్తే ఆ తేడాను రాష్ట్ర ప్రభుత్వం రైతుకు భర్తీ చేస్తోంది. (స్వేచ్ఛానుసరణ)



అలుపెరగని అరుణతార విమలా రణదివే...

'పూవు పుట్టగానే పరిమళిస్తుందన్నట్టు...' చిన్న వయస్సు నుంచే స్వాతంత్ర్యం కోసం ఉద్యమ జెండా పట్టిన వీర వనిత విమలా రణదివే. "సోదరీ సోదరులారా! మేలుకోండీ! దేశం మంటల్లో ఉంటే మనం నిద్రపోతే ఎలా? 13ఏండ్ల వయస్సులోనే 'సేవాదళ్' అనే స్వచ్ఛంద సంస్థలో చేరి ప్రభాత భేరీలు మోగించిన స్వేచ్ఛా పిపాసి విమలా రణదివే. ఆ వీర వనిత జీవిత అనుభవాలు శ్రామిక మహిళాలోకానికి స్ఫూర్తినిస్తాయనడంలో సందేహమేమీ లేదు. ఆమె పోరాట పటిమను అలవర్చుకోవాల్సిన అవసరాన్ని ప్రస్తుత పరిస్థితులు నొక్కి చెబుతున్నాయి. 'విమలా దీ' అని అందరూ ఆప్యాయంగా పిలుచుకొనే విమలా రణదివే జన్మదినం ఏప్రిల్ 10, 1915. ఆమె బతికున్నన్నాళ్లు శ్రామిక మహిళ హక్కుల కోసం నిరంతరం పోరాడారు. కార్మికవర్గ పోరాటాల్లో శ్రామిక మహిళల పాత్ర గురించి విమలా రణదివే జ్ఞాపకాల్లో ప్రస్తావించిన అనేక విషయాలు ప్రస్తుత పరిస్థితుల్లో శ్రామిక మహిళలు నిర్దేశించుకున్న లక్ష్యాలకు ఉపకరిస్తాయనటంలో సందేహం లేదు. ఈ నేపథ్యంలో విమలా రణదివే జయంతి సందర్భంగా ఈ నెల 10నుంచి 17వరకు శ్రామిక మహిళలు-పని ప్రదేశాల్లో హక్కులు అనే అంశంపై స్మారక ఉపన్యాసాలు, సదస్సులు, జనరల్ బాడీలు, సెమినార్లు నిర్వహించాలని సీఐటీయూ పిలుపునిచ్చింది.



ఎస్.వి.రమ
9490098899

కామ్రేడ్ విమల 12ఏండ్ల వయస్సులోనే ఉద్యమ ప్రస్థానం ప్రారంభించారు. స్వాతంత్రోద్యమంలో పాల్గొని 13ఏండ్లప్పుడే ఆరునెలలు జైలుశిక్ష అనుభవించారు. విదేశీ వస్త్రాలనమ్మే దుకాణాల ముందు పికెటింగులు నిర్వహించాలనే పిలుపునందుకుని షాపు గుమ్మంలో నిలబడి విదేశీ వస్త్రాలెవరూ కొనొద్దని నినదించారు. దీంతో విదేశీ సైనికులు ఆమెను అరెస్టు చేసి, కోర్టుకి తీసుకెళ్లి జడ్జీ ముందు నిలబెట్టారు. మీరు చిన్నపిల్లలు... "మీకు రాజకీయాలు తెలియవు..." కాబట్టి 'క్షమాపణ చెబితే... మిమ్మల్ని ఇంటికి పంపిస్తాం' అని జడ్జి అన్నారు. ఆ మాటలకు సమాధానంగా విమలా రణదివే, "కుసుమ్.. మేము ఏం చేశామో, ఎందుకు చేశామో మాకు తెలుసు. కాబట్టి మేము క్షమాపణ చెప్పబోమని' తెగేసి చెప్పారు. దీంతో వారికి ఆరుమాసాలు జైలు శిక్ష, కఠిన కారాగారవాసం 'సీక్లాస్..." అని తీర్పు వెలువరించారు. విడుదలై వచ్చాక చదువు కొనసాగించారు. కుటుంబ పోషణ కోసం టీచర్‌గా ఉద్యోగం చేశారు. ఆమె పుట్టిల్లు వామపక్షభావాల నిలయం. ఆమె సోదరుడు సర్ దేశాయ్. ఆయన ప్రోత్సాహంతో ఆమె కమ్యూనిస్టు భావాలను వంట పట్టించుకున్నారు. గిర్ని కాంగార్ (మిల్లు కార్మికులు) సంఘంలో చేరి వారిని సంఘటితం చేయడం మొదలు పెట్టారు. సర్ దేశాయ్, బీటీఆర్ కుటుంబాల మధ్య స్నేహం, అనుబంధం ఏర్పడ్డానికి కారణం వామపక్షభావాలే. ఆ విధంగా బీటీఆర్ చెల్లెళ్లు అహల్యా (రంగ్నేకర్), కుసుమ్‌తో విమలకు స్నేహం ఏర్పడింది. అందరూ కలిసి 'గిర్ని కాంగార్ సంఘం'లో చేరి పనిచేసేవారు. మిల్లు కార్మికుల సమ్మె సందర్భంగా అప్పటి బ్రిటిషు ప్రభుత్వం నిషేధాజ్ఞలు విధించింది. నిషేధాజ్ఞలను ధిక్కరించి మరీ ప్రదర్శన జరిగింది. ఆ ప్రదర్శనలో కమల్ ధోండీ ప్రాణాలు పోయాయి. కుసుమ్ కాళ్లల్లో తూటాలు దిగబడి గాయాలయ్యాయి. అప్పటికి ఇంకా దేశానికి స్వాతంత్ర్యం రాలేదు. రహస్య జీవితంలోనే బీటీఆర్‌తో వివాహమైంది. అరెస్టులు, జైళ్లు, రహస్య జీవి తాలు ఆమె జీవితంలో అంతర్భాగమయ్యాయి. కుటుంబ పోషణ కోసం చిన్న చిన్న ఉద్యోగాలు చేసిన కాలం మినహా, ఊపిరి ఉన్నంత వరకు ఉద్యమ జీవితాన్ని సాగించారు. స్వాతంత్ర్యానంతరం మహిళా ఉద్యమం, కార్మికోద్యమం రెండింటిలోనూ కొనసాగారు. కార్మిక సంఘం కేంద్రం కలకత్తాలో వున్న కాలంలో టీ-కాఫీ-రబ్బర్ ప్లాంటేషన్ కార్మిక సంఘంలో బాధ్యతలు తీసుకున్నారు. భాష సమస్య ఉన్నప్పటికీ కార్మికుల కష్టాలు తెలుసుకునేందుకు పట్టుదలతో బెంగాలి భాషపై పట్టు సాధించారు. 1979లో మద్రాసులో సీఐటీయూ మహాసభ సందర్భంగా మొదటి శ్రామిక మహిళా సదస్సు కూడా జరిగింది. ఆ సదస్సులో ఆమెకు కన్వీనర్ బాధ్యతను అప్పగించింది. 1989లో అంగన్‌వాడీ యూనియన్ ఏర్పడింది. ఆ సంఘం గౌరవాధ్యక్షురాలిగా ఉన్నారు. సుమారు 20ఏండ్లు 'ది వాయిస్ ఆఫ్ వర్కింగ్ ఉమెన్' పత్రికకు సంపాదకులుగా పనిచేశారు. శ్రామిక మహిళల సమస్యలపై వర్గ దృక్పథంతో అర్థం చేసుకొని పని చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో శ్రామిక మహిళల హక్కులు, అవకాశాలను కత్తిరించబడుతున్నాయి. స్కీము వర్కర్లు, విద్యా వైద్యం వంటి శాఖల్లో పని చేసే మహిళా కాంట్రాక్టు ఉద్యోగుల శ్రమశక్తిని కారుచౌకగా ఉపయోగించుకుంటోంది.

వస్తూత్పత్తి ఖర్చు తగ్గించుకుని తద్వారా మార్కెట్లో పోటీని తట్టుకొని నిలబడేందుకు తక్కువ వేతనాలకే వారిని పనిలో చేర్చుకుంటున్నారు. ఫ్యాక్టరీ పనిని ఇళ్లకు బదలాయించి స్త్రీలను 'హోమ్ బేస్డ్' వర్కర్లుగా మారుస్తున్నారు. వారి ఇళ్లనే కార్ఖానాలుగా, వస్తు తయారీ కేంద్రాలుగా మార్చి ఎంతో కొంత ఇచ్చి వారితో పని చేయిస్తున్నారు. ఈ విధంగా రకరకాల దోపిడీ పద్ధతులను అనుసరిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం ప్రభుత్వరంగ పరిశ్రమలను చావగొట్టి విదేశీ ప్రయివేటు కంపెనీలకు కారు చౌకగా కట్టబెడుతున్నది. పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవటం కోసమనే పేరుతో కోట్లాది కార్మికుల జీవితాన్ని బలిపెడుతున్నది. వారి శక్తి సామర్థ్యాలను నిర్వీర్యం చేస్తున్నది. లక్షలాది మంది మహిళలు అసంఘటిత కార్మికులుగా, అతితక్కువ వేతనాలకు, దుర్భరమైన పని పరిస్థితుల మధ్య నిర్బంధ శ్రమ చేస్తున్నారు. ఈ విషయాలు ఏవీ చర్చకు రాకుండా భావోద్వేగాలను రెచ్చగొట్టి కాలం వెళ్లదీస్తున్న వైనాన్ని చూస్తున్నాం. ఈ నేపథ్యంలో విమలా రణదివే పోరాట స్ఫూర్తి, ఆమె జీవితానుభవం శ్రామిక మహిళా ఉద్యమాలకు ప్రేరణ కాక తప్పదు...

ఆర్. రాజేశమ్

మనువాద గులాంగిరీపై పోరాడిన మహాత్ముడు

భారతదేశంలో బ్రిటిష్‌షోడి ఆధిపత్యం రెండువందల యేళ్ల పాటు సాగింది. ఈ విశాల భారత దేశంలోని భూమిపుత్రులను బానిసలుగా మార్చి నిరంకుశ వలస పాలనను వారు కొనసాగించారు. ఈ దేశపు ప్రజలను పీడిస్తున్న మరో తరహా బానిసత్వం కుల వ్యవస్థ పేరుతో మొదలయింది. రెండువేల యేండ్ల క్రితం ప్రారంభమై నేటికీ అది కొనసాగుతున్నది. బ్రిటిష్ వాడు రుద్దిన బానిసత్వాన్ని రద్దు చేయడానికి షహీద్ భగత్‌సింగ్, గాంధీ, నెహ్రూ... అమరులెందరో ఉద్యమిస్తే... మనువాద గులాంగిరీని రద్దుచేయడానికి ఆధునిక భారత చరిత్రలో తొట్టతొలిగా ఉద్యమించిన మహనీయుడు జ్యోతిబాపూలే. ఆ స్వాతంత్ర్య ఉద్యమనేత గాంధీ మహాత్ముడైతే... ఈ స్వాతంత్ర్య ఉద్యమ నేత పూలే సైతం నిస్సందేహంగా మహాత్ముడే!

జ్యోతిరావు గోవిందరావు పూలే 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్రలో జన్మించాడు. నాటి పీష్వా రాజుల దగ్గర జ్యోతిరావు కుటుంబం పూలమాలలు కట్టి అమ్మే వృత్తిని కొనసాగించిన కారణంగా పూలే అనే పేరు వచ్చింది. వెనుకబడిన 'మాలి' కులానికి చెందిన ఆయన కుల కట్టుబాట్ల కారణంగా చిన్ననాటి నుంచే అవమానాలను ఎదుర్కొన్నాడు. యుక్త వయస్సులో ఒక బ్రాహ్మణ మిత్రుని పెండ్లికి హాజరైన జ్యోతిరావును పెళ్లికొడుకు బంధువులు కులం పేరుతో అవమానించి పెండ్లి ఊరేగింపు నుంచి గెంటివేశారు. ఆ అవమానంతో రగిలిపోయిన పూలే కులాధిపత్యాన్ని నిర్మూలించడానికి అవిశ్రాంత పోరాటం కొనసాగించాలని ప్రతినబూనాడు. శూద్రులు, అతిశూద్రులపై అగ్రవర్ణాలవారు కొనసాగిస్తున్న దురాగతాలను నిరోధించడానికి పూలే 1873 సెప్టెంబరు 24న 'సత్య శోధక్ సమాజ్'ను స్థాపించాడు. మెజారిటీగా ఉన్న నిమ్నవర్గాల ప్రజలను కులదోపిడీ నుంచి విముక్తి చేయడంతోపాటు రైతులు, కూలీలను తమ హక్కుల కోసం సంఘటితపరిచేందుకు ఈ సంస్థ ద్వారా పూలే విశేషంగా కృషి చేశాడు.

ప్రపంచ దేశాల్లో ఎక్కడా లేని కృత్రిమ కుల వ్యవస్థను సృష్టించి, దేశంలోని మెజారిటీ వర్గాలను ఆర్థికంగా సామాజికంగా అణచివేసిన స్వార్థపర వర్గాల దోపిడీని జీవితాంతం వ్యతిరేకించి పోరాడిన మహానుభావుడు పూలే. ఆయన నడిపిన పోరాటాల స్ఫూర్తిని నేటి తరానికి అందించే ఒక మహత్తర సాధనంగా ఆయన రచన "గులాంగిరీ" నేటికీ నిలిచి ఉన్నది. ఈ దేశపు వెనుకబాటుతనానికి ప్రధాన కారణమైన కులవ్యవస్థ నికృష్ట స్వభావం గురించి తెలుసుకోవాలంటే ప్రతి ఒక్కరూ తప్పక చదవాల్సిన పుస్తకం "గులాంగిరీ". కాలాన్ని ఎదిరించి ఘనీభవించిన పూలే మూర్తి... ఆయన రాసిన గులాంగిరీ పుస్తకంలో మనకు ప్రత్యక్షమవుతుంది. నేటికాలంలో మనం చేపట్టాల్సిన సామాజిక న్యాయ పోరాటాలను ఎలా కొనసాగించాలో దగ్గర కూచోబెట్టుకుని మనకు నేర్పుతుంది.


సామాన్య ప్రజలకు సైతం అర్థమయ్యే భాషలో... ఉద్యమ సహచరుడు దోండిబా, పూలేల మధ్యన సంభాషణల రూపంలో గులాంగిరీ పుస్తకం కొనసాగుతుంది. ఈ దోండిబా ఎవరో కాదు పూలేను హత్య చేయించడానికి పూణే బ్రాహ్మణులు సుపారి ఇచ్చి కుదుర్చుకున్న కిరాయి హంతకుడు! ఓ అర్ధరాత్రి వేళ దోండిబా పూలేను చంపడానికి ఆయన ఇంట్లో దూరాడు. అలికిడికి నిద్రలేచిన పూలే దోండిబాను నిలదీసాడు. నిన్ను చంపడానికి బ్రాహ్మణులు డబ్బులు ఇచ్చారని దోండిబా తెలుపగా... "నా చావుతో నీ ఆకలి తీరుతుందనుకుంటే అలానే కానియ్యి" అని పూలే

> ఆ రోజుల్లో ఒక బ్రాహ్మణ వితంతువు గర్భవతి కాగా ఆనాటి సమాజం వేధింపులు తాళలేక ఆత్మహత్యకు ఒడిగట్టిన వేళ పూలే దంపతులు ఆమెకు తమ ఇంటిలో ఆశ్రయం కల్పించారు. ఆమెకు కలుగబోయే బిడ్డను తామే పోషిస్తామని భరోసా ఇచ్చి, ఆమెకు పుట్టిన బిడ్డను పూలే దంపతులు దత్తతతీసుకొని తమ బిడ్డగా స్వీకరించి పెంచి పెద్ద చేశారు. ఆ బిడ్డ పేరే యశ్వంతరావు పూలే! ఒక శూద్ర మాలి కుటుంబానికి వారసుడైన ఒక బ్రాహ్మణ బిడ్డ! "నిఖిలలోకమెట్లు నిర్ణయించిన గాని తరుగులేని విశ్వనరుడ నేను!" అంటూ మొన్న మొన్న జాషువా కవి అన్న మాటలను ఆనాడే తన జీవితాచరణ ద్వారా నిరూపించిన మహాత్ముడు పూలే!

సమాధానమిచ్చాడు. "మీ నిమ్నవర్గాల పిల్లలకు మేము చదువులు చెప్పడమే బ్రాహ్మణుల కోపానికి కారణమయిందని తెలుసుకో..." అని పూలే తెలపడంతో దోండిబా తన తపనను గ్రహించి హత్యాయత్నాన్ని విరమించుకున్నాడు. క్రమక్రమంగా పూలే ఉద్యమ సహచరుడయ్యాడు.

బ్రాహ్మణుల ఆధిపత్యానికి దారులు వేసిన పురాణాల బండారాన్ని పూలే తన గులాంగిరీ పుస్తకంలో అందరికీ అర్థమయ్యే రీతిలో విశదీకరిస్తాడు. బ్రాహ్మణులు బ్రహ్మముఖం నుండి జన్మించారనే కథనంపై వ్యాఖ్యానిస్తూ... మగ వ్యక్తి ముఖం నుండి వారు పుట్టడమే నిజమైతే... ఎవరి స్తన్యం తాగి పెరిగినట్టు? అని పూలే ప్రశ్నిస్తాడు. పూలే ప్రయోగించిన తార్కిక వాదనలతో బ్రాహ్మణులు సృష్టించిన కృత్రిమ కథనాలు దూది పింజల్లా తేలిపోతాయి.

బాధాకరమైన విషయం ఏమిటంటే ఆ మహాత్ముడికి దక్కాల్సిన గుర్తింపు, గౌరవం నేటికీ దక్కడం లేదు. తెలంగాణకు పూలేకు సంబంధమేమిటి? తెలంగాణలోని బీసీ గురుకులాల పేరులో నుంచి మహాత్మాజ్యోతిరావు పూలే పేరును తొలగించాలని ఆ మధ్య ఒక బీసీ నేత డిమాండ్ చేశారు. ఇక అగ్రవర్ణాల వారైతే పూలేను చులకన చేస్తూ, ఆయనొక బ్రాహ్మణ వ్యతిరేకి అంటూ కొట్టిపారేస్తున్నారు. పూలే జీవితం గురించి తెలిసిన వారెవరైనా ఆయన బ్రాహ్మణులనే కాదు, ఏ వర్గం వారినీ ద్వేషించలేదని అర్థం చేసుకుంటారు. ఆ రోజుల్లో ఒక బ్రాహ్మణ వితంతువు గర్భవతి కాగా ఆనాటి



సమాజం వేధింపులు తాళలేక ఆత్మహత్యకు ఒడిగట్టిన వేళ పూలే దంపతులు ఆమెకు తమ ఇంటిలో ఆశ్రయం కల్పించారు. ఆమెకు కలుగబోయే బిడ్డను తామే పోషిస్తామని భరోసా ఇచ్చి, ఆమెకు పుట్టిన బిడ్డను పూలే దంపతులు దత్తతతీసుకొని తమ బిడ్డగా స్వీకరించి పెంచి పెద్ద చేశారు. ఆ బిడ్డ పేరే యశ్వంతరావు పూలే! ఒక శూద్ర మాలి కుటుంబానికి వారసుడైన ఒక బ్రాహ్మణ బిడ్డ! "నిఖిలలోకమెట్లు నిర్ణయించిన గాని తరుగులేని విశ్వనరుడ నేను!" అంటూ మొన్న మొన్న జాషువా కవి అన్న మాటలను ఆనాడే తన జీవితాచరణ ద్వారా నిరూపించిన మహాత్ముడు పూలే! ఆయన జీవితము, సత్యశోధక సమాజ ఉద్యమం, ఆయన రచనలూ, నేటి కాలంలో మన దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు సరైన పరిష్కారాన్ని చూపుతాయి.

(నేడు మహాత్మా జ్యోతిరావుపూలే 196వ జయంతి)

సెల్: 9440443183

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై నేడు మహాదీక్ష

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ప్రవీణ్



నవతెలంగాణ-ఖమ్మం

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటనపై ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం మహాదీక్ష నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ తెలిపారు. సోమవారం ఖమ్మంలోని నగరం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగుల కలలను కుదిపేసిన టీఎస్‌పీఎస్సి పేపర్ లీకేజీ ఘటన అంశం జరిగి నెలరోజులు గడుస్తున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించకపోవడం చాలా దుర్మార్గమని, ముఖ్యమంత్రి వెంటనే స్పందించి ఈ పేపర్ లీకేజీ ఘటన పైన సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, తక్షణమే ముఖ్యమంత్రి స్పందించాలని, ఉద్యోగ నియమకాలను పారదర్శకంగా నిర్వహించాలని, లీకేజీ ఘటన వల్ల నష్టపోయిన నిరుద్యోగులకు పరీక్షలు పూర్తయ్యేంతవరకు నెలకు 20వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజ్ చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టినటువంటి నిరుద్యోగ భృతిని నిరుద్యోగులందరికీ తక్షణమే అందించాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని, మొదలగు అంశాలతో హైదరాబాద్ బాగ్లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో మహాదీక్షను నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహాదీక్ష కార్యక్రమాన్ని విద్యార్థులు, నిరుద్యోగులు, విద్యావేత్తలు, మేధావులు, రాజకీయ వేత్తలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు పర్వీన్, ఖమ్మం నగర కన్వీనర్ తరుణ్, నగర నాయకులు వీరేందర్, ఉపేందర్, మహేష్ నాయకురాలు షరీఫా, శ్రావ్య, రమ్య, ఊహ, స్నేహ, నవ్య పాల్గొన్నారు.



ఉద్యమ స్ఫూర్తితో కంటి వెలుగు

జిల్లా వ్యాప్తంగా 3,64,788 మందికి కంటి పరీక్షలు

బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నాయకులు, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు

నవతెలంగాణ - బోనకల్

ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తితో కంటి వెలుగు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున అమలు చేస్తున్నారని బీఆర్ఎస్ లోక్ సభాపక్ష నాయకులు, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని రావినూతల గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని నామ నాగేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 63 లక్షల 82 వేల 201 మందికి పైగాకంటి పరీక్షలు పూర్తి చేసి, 11లక్షల 40 వేల మందికి పైగా ఉచితంగా కళ్ళ అద్దాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో 286 గ్రామ పంచాయతీల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా టిఆర్ఎస్ ప్రభుత్వంలోనే మధిర నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో రైతు బంధు జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, టీపీసీ సభ్యులు చిత్తారు సింహాద్రి యాదవ్, పార్టీ మండల అధ్యక్షులు చేబ్రోలు మల్లికార్జున్‌రావు, రావినూతల సర్పంచ్ కొమ్మినేని ఉపేందర్, నాయకులు ముదావత్ సైదా, షేక్ సైదా, షేక్ జానీ, నామ సేవా సమితి నాయకులు చీకటి రాంబాబు, భార్గవ్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ

నవతెలంగాణ-ముదిగొండ

ముత్తారంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని కవి, రచయిత జయరాజ్‌తో ప్రొఫెసర్ కాసీంతో కలిసి ఆయన సోమవారం లాంఛనీయంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి, గ్రామ సర్పంచ్ తాళ్ల నాగయ్య ఉపసర్పంచ్ ఎల్‌పి ఉమాశ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యురాలు దమ్మాలపాటి సరస్వతి, ఎమ్మార్పీఎస్ నాయకుల కొలికపొంగు వెంకట్రావు, నూకల నాగేశ్వరరావు, పులిపాటి ప్రకాష్, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి గురుప్రసాదరావు, విద్యుత్ శాఖ ఏఈలు జిల్లా ప్రభాకర్ రావు, ఎల్.నరసింహారావు, అడ్వకేట్ మేకల సుగుణరావు, విగ్రహ నిర్మాణ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

హజ్ యాత్రకు జిల్లా నుండి 62 మంది ఎంపిక

నవతెలంగాణ - ఖమ్మంకార్పొరేషన్

భారతదేశం నుండి హజ్ యాత్రకు ఇండియా హజ్ కమిటి ద్వారా 2023 సంవత్సరానికి దేశం నుండి హజ్ యాత్రకు 1,80,000 వెళుతున్నారని, ఇందులో తెలంగాణ రాష్ట్ర నుండి 5278 మంది, ఉమ్మడి ఖమ్మం జిల్లా నుండి 62 మంది హజ్ యాత్రికులు లాటరీ పద్ధతిలో ఎంపికైనట్లు సోమవారం రాష్ట్ర హజ్ కమిటి సభ్యులు, ఖమ్మం కార్పొరేటర్ షేక్ మక్బూల్ తెలిపారు. ఎంపికైన యాత్రికులు కవర్ నంబర్ ప్రకారం యునియన్ బ్యాంక్ లేదా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా రూ.81,800 చెల్లించి ఏప్రియల్ 12 వ తేదీ లోగా ఫిట్ నెస్, కోవిడ్ వ్యాక్సిన్ సర్టిపికెట్లు, పాస్‌పోర్ట్, బ్యాంక్ పాస్ బుక్, ఆన్‌లైన్ చేసిన దరఖాస్తు కాపీలను హైదారాబాద్‌లోని రాష్ట్ర హజ్ హౌస్ లో అందించాలని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు షేక్ మక్బుల్ తెలిపారు.



సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు కోలేటి మృతి

నవతెలంగాణ - బోనకల్

మండల పరిధిలోని తూటికుంట్ల గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకుడు కోలేటి కృష్ణయ్య (68) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కృష్ణయ్య సీపీఐ(ఎం) నిర్వహించే ప్రతి కార్యక్రమంలో చురుకుగా పాల్గొనేవాడు. తూటికుంట గ్రామంలో సీపీఐ(ఎం) అభివృద్ధికి నిరంతరం కృషి చేశాడు. కృష్ణయ్య మృతదేహాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, ఎంపిపి కంకణాల సౌభాగ్యం, సర్పంచ్ నోముల వెంకట నరసమ్మ, మాజీ ఎంపీపీ తుళ్లూరు రమేష్, మాజీ సర్పంచ్ పాపినేని రామ నరసయ్య, సిపిఎం శాఖ కార్యదర్శి పాపినేని అప్పారావు, పాపినేని రమేష్, పాపినేని వెంకట్రావు, సిపిఎం మండల కమిటీ సభ్యులు నోముల పుల్లయ్య, సీనియర్ నాయకులు సాధినేని శారదయ్య తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

సాహిత్యం సమాజంతో మిళితమై ఉంటుంది

ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖాధ్యక్షులు ప్రొఫెసర్ కాశీం

నవతెలంగాణ-ఖమ్మం

సాహిత్యం సమాజంతో మిళితమై ఉంటుందని, మానవ ఉద్వేగాలన్నీ సాహిత్య ప్రక్రియల ద్వారా వ్యక్తమౌతూ, నిద్రాణమైన జాతిని మేల్కొలుపుతుందని ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు ప్రొఫెసర్ సి.కాశీం అన్నారు. సోమవారం ఖమ్మంలోని ఎస్ఆర్‌బిజిఎన్ఆర్ కళాశాల తెలుగు విభాగం, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జాకీరుల్లా అధ్యక్షతన 'తెలుగుసాహిత్యంపై అంబేద్కర్ ప్రభావం 'అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివితేనే జీవితాన్ని మార్చుకోవచ్చని గుర్తించిన దార్శనికుడు అంబేద్కరని అభివర్ణించారు. కార్యక్రమంలో తెలుగు శాఖాధిపతి డాక్టర్ జే.రమేష్, వైస్ ప్రిన్సిపాల్, డాక్టర్ బి.వి, రెడ్డి, కన్వీనర్ ఐ.కిరణ్‌కుమార్, ఐ.క్యూ.ఏ.సి కోఆర్డినేటర్ డాక్టర్ రమాసత్యవతి, సీనియర్ అధ్యాపకులు, కె.యు.ఈసి సభ్యులు డా.సీతారాం, తెలుగు అధ్యాపకులు, డాక్టర్ జె.అనురాధ, మేఘమాల, లక్ష్మీ కాంతం, పి.వెంకటేశ్వర్లు, ఎం.వి.రమణ, ఇతర విభాగాల అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ..రూ.2.40 లక్షల సొత్తు మాయం

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లిలోని వెంకటసాయినగర్‌లోని రెండు ఇండ్లలో చోరీ జరిగింది. ఈ ఘటనలో రూ.2.40 లక్షల సొత్తును దొంగలు ఎత్తుకెళ్ళినారు. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం కారేపల్లి మండలం వెంకటసాయినగర్‌లోని పల్లె ప్రకృతివనం లైన్‌లో రెండు ఇండ్లలో చోరి జరిగింది. రెండు ఇండ్లకు చెందిన యాజమానులు శని, ఆదివారంలు రెండు రోజులు సెలవు దినములు కావటంతో వారు ఊర్లకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దొంగలు రాత్రి సమయంలో ఇండ్ల అవరణంలోకి ప్రవేశించి ఇంటి తలుపు తాళాలను పగులగొట్టి లోనికి ప్రవేశించారు. స్టాఫ్‌వేర్ ఉద్యోగి అయిన నర్సింగ్ ఇంటిలోకి ప్రవేశించిన దొంగలకు అక్కడ ఏమి లభించలేదు. దీంతో అదే లైన్‌లో ఉన్న రైల్వే ఉద్యోగి బంక శాంతకుమార్ కుటుంబికులు బంధువుల ఇంటివెళ్ళటంతో ఇంట్లో ఎవరూ లేరు. దీనిని కనిపెట్టిన దొంగలు బండి శాంతకుమార్ ఇంట్లోకు చొరబడి ఇంట్లో ఉన్న బీరువాను తెరిచి దానిలో ఉన్న 6 తులాల బంగారు వస్తువులను ఎత్తుకెళ్ళారు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చిన బంక శాంతకుమార్ తలుపు తెరిచి ఉండటంతో లోని బీరువాలోని వస్తువులు చిందరవందరగా ఉండటంతో చుట్టుపక్కల వారితో కలిసి పోలీసులకు పిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని సింగరేణి సీఐ నూనె వెంకటేశ్వర్లు, ఎస్సై పుష్పాల రామారావు, సీసీఎస్ సిబ్బంది సందర్శించి విచారించారు. దొంగల ఆనవాళ్ల కోసం ఖమ్మం నుండి క్లూస్ టీమ్‌ను రప్పించి ఫింగర్ పింట్లను సేకరించారు. దీనికి సంబంధించి బాధితుడు ఇచ్చిన పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిన్ను నమ్ముకున్నోళ్లు నట్టేట మునుగుడే

- ఎస్సీ, ఎస్టీ సీట్లపైనే నీ టార్గెట్ ఎందుకు..?
- ఎప్పుడో మిమ్మల్ని సస్పెండ్ చేయాలి
- పొంగులేటిపై భగ్గుమన్న ఎమ్మెల్యే సండ్ర



నవతెలంగాణ-సత్తుపల్లి

గమ్యం తెలియని రాజకీయ నాయకులను నమ్ముకుంటే నట్టేట మునగడం ఖాయమని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య స్పష్టం చేశారు. గత కొన్ని రోజులుగా ఆత్మీయ సమ్మేళనాల పేరుతో జిల్లా రాజకీయాలను భ్రష్టుపట్టిస్తున్న తీరును చైతన్యవంతులైన ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు గమనిస్తూనే ఉన్నారని ఎమ్మెల్యే సండ్ర పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై ఫైర్ అయ్యారు. సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సండ్ర బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. నాకోసం రెండు జాతీయపార్టీలు ఎదురు చూస్తున్నాయని దిగ జారుడు మాటలు మాట్లాడుతూ ఆయా పార్టీలను అవమానపరుస్తున్నావని, నీకోసం ఏ జాతీయపార్టీ ఎదురు చూడటం లేదని, నిన్ను నమ్ముకొని నీవెంట తిరుగుతున్న అమాయకులను మభ్యపెట్టేందుకు నీ ఆత్మీయ సభల్లో పదేపదే ప్రస్తావిస్తూ నీ రాజకీయ పబ్బం గడుపు కునేందుకు నీవెంట తిరుగుతున్న వారికి తెలియక పోయినా విజ్ఞులైన ఉమ్మడి జిల్లా ప్రజలకు అర్థమవు తుందనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని సండ్ర ఘాటుగా స్పందించారు. నీ సభల్లో ప్రతిసారి దమ్ముంటే నన్ను సస్పెండ్ చేయాలంటూ నీ నక్కజిత్తులు అధిష్టానానికి తెలియంది కాదా అన్ని ప్రశ్నించారు. నిన్ను సస్పెండ్ చేయనక్కర్లేదని, పార్టీని, తండ్రి వయసున్న పార్టీ అధినేతను ఎట్లాపడితే అట్లా మాట్లాడటమే కాకుండా పక్క జిల్లాల నుంచి కూడా కూడా రప్పించి అధినేతను తిట్టిస్తున్న తీరు అజ్ఞానులు చేసే తీరు అజ్ఞాన రాజకీయమని సండ్ర ధ్వజమెత్తారు. పార్టీని, అధినేతను తిట్టిన నాటి నుంచే నీవు బీఆర్ఎస్‌లో లేవని నీవే తెలుసుకోవాలని సండ్ర పొంగులేటిని ఎద్దేవా చేశారు. నీవే గనక కొత్తపార్టీ పెట్టి నీలాగే విమర్శలు చేస్తూ ధిక్కార స్వరం వినిపిస్తే నీవు ఊరుకుంటావా పొంగులేటి అంటూ సండ్ర మండిపడ్డారు. ఎప్పుడో చేయాల్సిన పనిని ఇప్పటికైనా విధిలేని పరిస్థితుల్లో మీ ఇద్దర్ని పార్టీ నుంచి సస్పెండ్ చేయడాన్ని బీఆర్ఎస్ శ్రేణులు స్వాగతిస్తున్నాయని సండ్ర స్పష్టం చేశారు. సీతారామ ప్రాజెక్టు రాదని సభల్లో విమర్శించిన నీకు అదే ప్రాజెక్టు పనుల కోసం టెండర్లు వేసే అర్హత ఉందా అన్ని సండ్ర ప్రశ్నించారు. నీవు పెట్టిన ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల పరిధి సభల్లోనే అభ్యర్థులను ప్రకటించిన నీవు మిగతా చోట్ల అభ్యర్థులను ఎందుకు ప్రకటించలేకపోయావని పొంగులేటిని ప్రశ్నించారు. కేవలం నీవు ఎస్టీ, ఎస్సీ సీట్లపైనే నీ టార్గెట్ ఎందుకు పెట్టాల్సి వచ్చిందన్నారు. ఇక రాజీనామాల డ్రామా పర్వాలు మొదలవుతాయని, అవి రాజకీయ సంచలనాల కోసమేననే విషయాన్ని బీఆర్ఎస్ గమనంలోకి తీసుకోవాలన్నారు. ఇందులో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎవరూ కూడా అయోమయానికి గురికావద్దన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఆత్మ చైర్మెన్ వనమా శ్రీనివాసుదేవరావు, మున్సిపల్ చైర్మెన్ కూసంపూడి మహేశ్, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, పట్టణ, మండల బీఆర్ఎస్ అధ్యక్షులు ఎస్కే రఫీ, యాగంటి శ్రీనివాసరావు, నాయకులు దొడ్డా శంకరరావు, మాసుకోట సత్యనారాయణ, కౌన్సిలర్ అద్దంకి అనిల్‌కుమార్, నాయకులు వీరపనేని బాబీ, వల్లభనేని పవన్, నరుకుళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను ఓడించే శక్తి పొంగులేటికి లేదు

ఎంఎల్ఏ కందాళ ఉపేందర్‌రెడ్డి

కూసుమంచి : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ పార్టీని ఓడించే శక్తి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి లేదని, గతంలో ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పోటీలో లేకపోవడం వల్లే వైసీపీ నుంచి ఆయన గెలిచారనే సంగతి గుర్తుంచు కోవాలని ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో బీఆర్ఎస్ ఎంఎల్ఏలందరినీ ఓడిస్తానని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానిస్తున్నారని, అది ఆయన వల్ల అయ్యే పని కాదన్నారు. పదికి పది తప్పకుడా బీఆర్ఎస్ పార్టీ గెలుస్తుందన్నారు. విలేకరుల సమావేశంలో ఎంపీపీ బానోత్ శ్రీనివాస్‌నాయక్, డిసిసిబి డైరెక్టర్ ఇంటూరి శేఖర్, బిఆర్ఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు వేముల వీరయ్య, ఆసిఫ్ పాషా ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



పొంగులేటికి మతిభ్రమించింది

ఎమ్మెల్యే రాములు నాయక్

వైరా : బిఆర్ఎస్ పార్టీలో రాజకీయ పదవులు పొంది నిన్న మొన్నటి వరకు నోరారా పొగిడిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అసత్య ప్రచారాలు చేయటాన్ని ఎమ్మెల్యే లావుడియ రాములు నాయక్ తీవ్రంగా ఖండించారు. సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళనాల పేరుతో ప్రజలను మోసం చేస్తూ తానే ఈ జిల్లాను నడిపిస్తున్నట్లు, ఏ రాజకీయ పార్టీకి స్థానమే లేదని మతి భ్రమించి మాట్లాడితే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అన్నారు. ధన రాజకీయాలతో జిల్లా ప్రజలను ఎల్లకాలం మోసగించలేవని అన్నారు. వచ్చే ఎన్నికల్లో పదికి పది సీట్లు బిఆర్ఎస్ పార్టీ గెలుచుకుంటుందని, నీ వెంట వచ్చిన నాయకులు, కార్యకర్తలు బలి పశువులు కాక తప్పదన్నారు. రాజకీయాలలో విమర్శలు సహజమే అయినప్పటికీ స్థాయికి మించి, అర్హతకు మించి మాట్లాడితే సహించేది లేదన్నారు. సమావేశంలో వైరా మున్సిపల్ వైస్ చైర్మెన్ సీతారాములు, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షులు మద్దెల రవి, ఎంపీపీ వేల్పుల పావని, జడ్‌పిటిసి నంబూరి కనకదుర్గ, మార్కెట్ కమిటీ చైర్మన్ బిడికె రత్నం, జిల్లా నాయకులు పసుపులేటి మోహన్‌రావు, మాజీ ఎంపీటీసీ మచ్చా బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



అర్హులందరికీ పట్టాలు ఇప్పిస్తా

ఆందోళన చెందొద్దు...

పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే కందాల



నవతెలంగాణ- ఖమ్మం

నిజమైన అర్హులుంటే పట్టాలు ఇప్పిస్తామని పాలేరు శాసనసభ్యులు కందాల ఉపేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఖమ్మం 60వ డివిజన్లోని రామన్నపేట కాలనీలోని రైతు వేదిక వద్ద జీవో నంబర్ 58, 59 మంజూరైన ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండ్ల స్థలాల పట్టాలు రానివారికి నిజంగా అన్యాయం జరిగితే తప్పకుండా న్యాయం చేస్తానని తెలిపారు. రామన్నపేటలో ఆందోళన చేస్తున్న బాధితులతో మాట్లాడారు. పట్టాలు రాకపోతే అడగాలి కానీ మీరు అడుగుతున్న పద్ధతి కరెక్ట్ కాదు అన్నారు. 'మీ దగ్గరే, మీ ఇండ్ల పక్కనే ఇండ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమం పెట్టామని, మీరు ఎవరో చెప్పిన మాటలు విని మోసపోవద్దు' అని అన్నారు. నిరుపేదలైన వారందరికీ న్యాయం చేస్తానన్నారు. తన క్యాంప్ ఆఫీస్ దగ్గరలోనే ఉందని, ఎవరికైనా ఏదైనా సమస్య ఉంటే ఎప్పుడైనా కలవచ్చని తెలిపారు. అనంతరం ఒకటో డివిజన్ కైకొండాగూడం, 59వ డివిజన్ దానవాయిగూడెం, 60 డివిజన్ రామన్నపేట కాలనీలో లబ్దిదారులకు పట్టాలు, కళ్యాణ్ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. తొలుత ఖమ్మం 60వ డివిజన్లోని నిరుపేదలైన తమకు పట్టాలు ఇవ్వకుండా కార్పొరేటర్ కావాలని వారికి కావలసిన వాళ్లకు ఇటీవల గుడిసెలు వేసుకునే వాళ్లకు పట్టాలి ఇప్పిస్తున్నారని, తాము 20 సంవత్సరాల నుండి గుడిసెల్లో నివాసం ఉంటున్నామని, అయినాగాని తమ లాంటి పేదలకు అర్హులైన తమకు ఇవ్వకుండా ఒకసారి పట్టాలు పొందిన వారికి పట్టాలి ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై కార్పొరేటర్‌కి ఎన్నిసార్లు కలిసినప్పటికీ తమను పట్టించుకోలేదని, అందుకోసమే తమ గోడు ఎమ్మెల్యేకు చెప్పుకునేందుకే రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కార్యక్రమంలో ఒకటో డివిజన్ కార్పొరేటర్ తేజావత్ హుస్సేన్, 59 డివిజన్ కార్పొరేటర్ బట్టిపోతుల లలిత రాణి, 60 డివిజన్ కార్పొరేటర్ నిరంజన్, ఖమ్మంరూరల్ జెడ్పిటిసి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్పీఎస్సీ లీకేజ్‌పై సీబీఐతో విచారణ జరిపించాలి

18 జరిగే మహాధర్నాని

జయప్రదం చేయండి

అఖిలపక్ష సదస్సులో ప్రొఫెసర్ కోదండరాం



నవతెలంగాణ - ఖమ్మం

కేసిఆర్ పాలన లిక్కర్ లీకేజీల పాలన అని, టీఎస్పీఎస్సీ లీకేజ్‌పై సీబీఐతో విచారణ జరిపించాలని, లీకేజీపై సమగ్ర విచారణ కోరుతూ 18న జరిగే మహాధర్నాని జయప్రదం చేయాలని ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు. సోమవారం ఖమ్మంలోని సంజీవరెడ్డి భవనంలో కాంగ్రెస్, ప్రజాపంథ, న్యూడెమోక్రసీ, ఆమ్ ఆద్మీ, బిఎస్పి విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో టీఎస్పీఎస్సీ లీకేజీ వ్యవహారంపై సిబిఐతో విచారణ జరిపించాలని, పరీక్షలు రాసిన నిరుద్యోగులకు లక్ష రూపాయల నష్టపరిహారం చెల్లించాలని టిఎస్పిఎస్సి చైర్మన్ సభ్యులను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష పార్టీల సదస్సు జరిగింది. ఈ సదస్సులో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోట్ల నాగేశ్వరరావు, ప్రజా పంథా జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాడ దుర్గాప్రసాద్, బిఎస్పి జిల్లా అధ్యక్షుడు ఉపేందర్ సాహూ, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.రాజేంద్రప్రసాద్, గిరి, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు నలమూరు తిరుమలరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ జావేద్, పీసీసీ సభ్యులు పుచ్చకాయల వీరభద్రం, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, లకావత్ సైదులునాయక్, పల్లెబోయిన చంద్రం, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

సభ్యున్నే కానప్పుడు సస్పెండ్ ఎలా..?

- కేసీఆర్, కేటీఆర్ మాటలు నమ్మి మోసపోయా..
- కల్వకుంట్ల కుటుంబానికే బంగారు తెలంగాణ
- బీఆర్ఎస్ బహిష్కృత నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

తనకు పార్టీలో సభ్యత్వమే లేనప్పుడు తననెలా సస్పెండ్ చేస్తారని...తాను బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా మాట్లాడబట్టి వందరోజులైందని..ఇప్పుడు తనను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని బీఆర్ఎస్ బహిష్కృత నేత, ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. నీళ్ళు, నిధులు, నియామకాల పేరుతో రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మారుస్తానన్న కేసీఆర్ మాటలు నమ్మి ప్రజలు ముఖ్యమంత్రిని చేస్తే...కల్వకుంట్ల కుటుంబం మాత్రమే బంగారు మయం అయిందని విమర్శించారు. స్థానిక ఎస్ఆర్ కన్వెన్షన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒత్తిడి పెట్టి, సముచిత స్థానం ఇస్తానని పార్టీలో చేర్పించుకున్న కేసీఆర్, కేటీఆర్ మాటలు నమ్మి మోసపోయానన్నారు. తనతో పాటు 280 మంది ప్రజాప్రతినిధులు పార్టీలో చేరారని, ఏ ఒక్కరికైనా సముచిత స్థానం కల్పించారా? అని ప్రశ్నించారు. పార్టీ అవసరాలకు తనను విరివిగా వాడుకొని ఆ తర్వాత విస్మరించారని ఆయా సందర్భాలను గుర్తు చేశారు. 'నా తండ్రి పాదాలు తప్ప ఎవరి పాదాలూ తాకని తానూ తండ్రిలాగా తలచి మీ పాదాలు తాకిన మాట అబద్ధమా?' అని కేసీఆర్‌ను ఉద్దేశించి ప్రశ్నించారు. 2018 ఎన్నికలకు ముందు కొంగరకలాన్ సభకు భారీగా జనాన్ని తరలించినప్పుడు శీనన్న తమ కుటుంబ సభ్యుడు అంటే నమ్మాను...మేడిపండు లాంటి మాటలని గ్రహించలేకపోయానన్నారు. నెల రోజుల్లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తానని... మూడు నెలలైనా ఇవ్వలేదన్నారు. బీఆర్ఎస్ జాతీయ పార్టీ కదా...దానికి కొన్ని నియమని బంధనలు ఉన్నాయి కదా... సస్పెన్షన్‌కు ముందు షోకాజ్‌నోటీసైనా ఇచ్చారా? అని ప్రశ్నించారు. ప్రజాబలాన్ని ఏ ఒక్కశక్తి ఆపలేదు.. ఉమ్మడి ఖమ్మం జిల్లా అసెంబ్లీ సీట్లలో ఇప్పుడున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలలను 2023 ఎన్నికల్లో ఒక్కరిని కూడా అసెంబ్లీ గేటు తాకనీయనని శపథం పూనారు. కేసీఆర్ తెలంగాణను రూ.నాలుగు లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారు...సమయం వచ్చినప్పుడు ఆ లెక్కలతో సహా బయటపెడతా అని హెచ్చరించారు. తనలాగా మోసపోయిన వందలాది మంది త్వరలో బయటకు వస్తారన్నారు. వారందరితో కలిసి ఆచరణ సాధ్యమయ్యే హామీలతో కూడిన మేనిఫెస్టోతో ముందుకొస్తామన్నారు. శ్రీరాముని పాదాలు తాకే అవకాశం ఇచ్చిన రావణాసురునికి కృతజ్ఞతలు అంటూ ముగించారు. తాను ఏ పార్టీలో చేరేది...? ఎక్కడి నుంచి పోటీ? అనే విషయాలను త్వరలోనే ప్రకటిస్తానన్నారు. తన పార్టీ మార్పు విషయంలో ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రమేయం గతంలోనూ... ఇప్పుడు...ఎప్పుడూ ఉండదని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో పొంగులేటి వర్గీయులు భద్రాద్రి జిల్లా జడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, బర్రా రాజశేఖర్, మువ్వా విజయ్‌బాబు, బ్రహ్మయ్య, స్వర్ణకుమారి, చావా శివరామకృష్ణ, కోట రాంబాబు, పిడమర్తి రవి తదితరులు పాల్గన్నారు.

గురవమ్మ తల్లి జాతరలో గ్రామప్రభల ఊరేగింపు

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలం పేరుపల్లిలో జరుగుతున్న గురవమ్మతల్లి జాతర నాల్గోవ రోజు సోమవారం గ్రామ ప్రభల కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులు ఎడ్ల బండ్లపై ప్రభలను ఉంచి గ్రామంలో ఊరేగింపు జరిపారు. చివరి రోజు మంగళవారం బోనాలతో జాతర ముగియనుంది. పేరుపల్లి గ్రామస్తులు ఐక్యంగా గురమ్మతల్లి జాతరను ప్రతి ఏడు నిర్వహించటం ఆనవాయితీగా వస్తుందని ఆలయ చైర్మన్ పుట్టా నాగేశ్వరరావు తెలిపారు.

12న చీమలపాడులో బీఆర్ఎస్ సమ్మేళనం

నవతెలంగాణ-కారేపల్లి

బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం కారేపల్లి మండలం చీమలపాడులో ఈనెల 12న నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్ష ప్రధానకార్యదర్శులు పెద్దబోయిన ఉమాశంకర్, ఇస్లావత్ బన్సీలాల్ తెలిపారు. చీమలపాడులో సమ్మేళనంను ఈనెల 11న నిర్వహించాల్సి ఉండగా ప్రత్యేక కారణాలతో 12కు మార్చినట్లు వారు తెలిపారు. కార్యకర్తలు అభిమానులు, ప్రభుత్వం సంక్షేమ ఫలాలు తీసుకున్నవారు ఈ సమ్మేనంకు హాజరుకావాలని కోరారు.



వైరా బస్టాండులో వాటర్‌ఫ్రిజ్ ఏర్పాటు

నవతెలంగాణ - వైరాటౌన్

టిఎస్ ఆర్టిసి ఎండి వీసీ సజ్జనార్ ఆదేశానుసారం వైరా ఆర్టీసీ బస్టాండులో వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రయాణికుల దాహం తీర్చేందుకు సోమవారం మధిర డిపో మేనేజర్ ఎస్ దేవదానం నూతన వాటర్ కూలర్ ఫ్రిజ్‌ను, ప్రయాణికులు కూర్చోవడానికి 8 ఎయిర్‌పోర్ట్ కుర్చీలను ఏర్పాటు చేశారు. వేసవికాలం ముగిసేవరకు ప్రయాణికులు తాగటానికి ప్రతి రోజూ 20 క్యానుల మంచి నీటిని వెంపటి హెల్పింగ్ హ్యాండ్స్ చైర్మన్ వెంపటి రంగారావు అందిస్తున్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కాపా మురళీకృష్ణ, డాక్టర్ శ్రీకాంత్, వైరా బస్టాండ్ స్టేషన్ మేనేజర్ ఎవిలు, సేఫ్టీ వార్డెన్ జానీ, ప్రయాణికులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య రాజ్యాంగ పరిరక్షణకై పోరాటాలకు సిద్ధంకండి

నవతెలంగాణ - బోనకల్

లౌకిక వాదం, ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణకై ప్రజలను పోరాటాలు సిద్ధం చేయడానికి ధరల తగ్గింపు, ప్రజా సమస్యల పరిష్కారానికి ఏప్రిల్ 14 నుంచి 21 వరకు సిపిఐ ప్రజాపోరు యాత్ర చేపట్టనున్నట్లు సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనంద్‌రావు తెలిపారు. మండలంలోని రాయన్నపేట తూము ప్రకాష్‌భవన్లో సిపిఐ ప్రజాపోరు యాత్ర పోస్టర్‌ను సీపీఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్ కుమార్‌తో కలిసి సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ శాఖ కార్యదర్శి ఏలూరు పూర్ణచందు, తోటపల్లి ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



14న జరగబోయే సభను విజయవంతం చేయాలి

విలేకరుల సమావేశంలో అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని

నవతెలంగాణ- ఖమ్మం

ఈనెల14న జరగబోయే మంచిర్యాల బహిరంగ సభను విజయవంతం చేయాలని అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని పిలుపునిచ్చారు. సోమవారం ఖమ్మంలోని భట్టి విక్రమార్క క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ నెల 14న జరగబోయే మంచిర్యాల బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు . కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటానికి బట్టి విక్రమార్క పాదయాత్ర చేస్తున్నారన్నారు. మంచిర్యాలలో జరిగే బహిరంగ సభకు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా మల్లికార్జున కార్గే పాల్గొంటారు అన్నారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువాళ్ళ దుర్గాప్రసాద్, టిపిసిసి సభ్యులు ఎండి జావిద్, పుచ్చకాయ వీరభద్రం, లకావత్ సైదులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే సహించేది లేదు

సిబ్బందిని హెచ్చరించిన కమిషనర్

నవతెలంగాణ-వైరా

మునిసిపల్ కమిషనర్ పథాని వెంకటేశ్వర్లు బాధ్యతల్లో చేరి సోమవారం సిబ్బందితో మాట్లాడారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒకరి బాధ్యతల్లో ఇంకొకరు తలదూర్చి మొదటికే మోసం తెచ్చుకోవద్దని అన్నారు. పారిశుద్య కార్మికులు ఆ పనిలోనే ఉండాలని, బిల్ కలెక్టర్‌లు వారికి అప్పగించిన పనిలో వారుండాలని, మునిసిపల్ సిబ్బంది సమయపాలన పాటించాలని, సెలవు కావలసిన వారు ముందుగా తనను సంప్రదించాలన్నారు. మునిసిపాలిటీ అభివృద్ధిలో అందరి బాధ్యత ఉంటుందని, సిబ్బందిపై ఆరోపణలు వస్తే చర్య తప్పదన్నారు. పాలక వర్గ సభ్యులతో సమన్వయం తో వ్యవహరించాలని కోరారు .



అంబేద్కర్ విగ్రహావిష్కరణకు జన సమీకరణ

కలెక్టర్ వీపీ గౌతమ్

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డా. బిఆర్. అంబేద్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ప్రజలు పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అధికారులను ఆదేశించారు. ఐడిఓసి లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి హైదరాబాదులో 125 అడుగుల బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి జన సమీకరణ ఏర్పాట్లపై నియోజకవర్గ ఇంచార్జి అధికారులు, మున్సిపల్ కమిషనర్లులతో కలెక్టర్ సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డా. బిఆర్. అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14 రోజున హైదరాబాదులో అంబేద్కర్ విగ్రహావిష్కరణకు నియోజవర్గం నుండి 300 మంది తరలేలా ఏర్పాట్లు చేయాలన్నారు. మండలాల వారీగా జన సమీకరణ చర్యలు చేపట్టాలని కోరారు. నియోజకవర్గానికి ఆరు బస్సులు ఏర్పాటు చేసి ప్రతి బస్సు లో ఒక లైజన్ అధికారికి బాధ్యతలు అప్పగించాలన్నారు. ఎంపీడీవో, తహసిల్దార్ స్థాయి అధికారులను లైజన్ అధికారులుగా నియమించాలని అన్నారు. కార్యక్రమానికి వచ్చే వారికి బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్, వాటర్ బాటిల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం కోసం తీసుకెళ్లే 30 వాహనాలకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, ఎస్కార్ట్ సిబ్బంది ఉండాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలి, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ శిక్షణ కలెక్టర్ రాధికా గుప్తా, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వేణు మనోహర్, జెడ్పి సీఈఓ వి.వి. అప్పారావు, డిఆర్డీవో విద్యాచందన, ఎస్సి కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్ సోషల్ వెల్ఫేర్ కె. సత్యనారాయణ, ఆర్డీవో టి. కిషన్ రావు, ఏసిపి ప్రసన్న కుమార్, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి శ్రీరామ్, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఈ- ఆఫీస్ లోనే ఫైళ్ల నిర్వహణ

కార్యాలయాల ఫైళ్ల నిర్వహణ ఈ-ఆఫీస్ లోనే చేపట్టాలని, మాన్యువల్ ఫైళ్లను అంగీకరించేది లేదని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ సూచించారు. ఐడిఓసి లోని సమావేశ మందిరంలో కలెక్టర్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యాలయ ఫైళ్ల నిర్వహణ ఈ-ఆఫీస్ ద్వారా చేపట్టాలని, కాగిత రహిత ఫైళ్లతో భద్రతనే కాక, రికార్డు మార్పు చేయడానికి ఆస్కారం ఉండదని అన్నారు. కొన్ని శాఖల వారు కలెక్టరేట్ కి సమర్పించే ఫైళ్లు ఈ-ఆఫీస్ ద్వారా, మిగతా ఫైళ్లు మాన్యువల్ గా నిర్వహిస్తున్నారని, ఇలాకాక, అన్ని ఫైళ్లు ఈ-ఆఫీస్ ద్వారానే చేపట్టాలని తెలిపారు. పాత ఫైళ్ల నిర్వహణ విషయంలో విషయాన్ని బట్టి ఎల్డిస్, డీడీస్, ఆర్డిస్ గా విభజించి సమయానుసారం భద్రతా చర్యలు తీసుకోవాలని అన్నారు. స్వంత భవనాలున్న కార్యాలయాలు, ఐడిఓసి కి తరలిన నేపథ్యంలో, వారి పాత భవనాలు, ఇతర కార్యాలయాలకు కేటాయించిన నేపథ్యంలో ఆయా కార్యాలయాలను కేటాయించిన శాఖలు వెంటనే స్వాధీనం చేసుకోవాలని తెలిపారు. జీవో 58, 59 లపై ప్రత్యేక శిబిరాలు నిర్వహించి, దరఖాస్తుల సేకరణ చేయాలన్నారు. గ్రామాల్లో ఉన్న డొంకలు, వ్యవసాయ క్షేత్రాల రహదారులపై నివేదిక సమర్పించాలని అన్నారు. స్ట్రాంగ్ రూమ్ నుండి మండలాలకు సంబంధించిన రికార్డులు ఇంకనూ ఉంటే, పరిశీలించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. కలెక్టరేట్ కు సంబంధించి రికార్డు ను పూర్తి స్థాయిలో ఐడిఓసి కి తరలించాలన్నారు. ఫర్నీచర్, కంప్యూటర్లు పనికిరానివి ఉంటే తొలగింపు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలి, శిక్షణ సహాయ కలెక్టర్ రాధిక గుప్తా, జిల్లా రెవెన్యూ అధికారిణి ఆర్. శిరీష, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



టీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి

మాటూరుపేట ఆత్మీయ సమ్మేళనంలో జడ్పీ చైర్మన్, ఎంపీ నామా

నవతెలంగాణ-మధిర

తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధి బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమైందని ఎంపీ నామా నాగేశ్వరరావు, జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, డిసిసిబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం చెప్పారు. సోమవారం మధిర మండలం మాటూరు పేట గ్రామం నందు లింగాల కమల్ రాజ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ పార్టీదే అధికారం అని అన్నారు. యావత్ దేశం మొత్తం కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటుందన్నారు. రాష్ట్రంలో కెసిఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. సమావేశం అనంతరం కార్యకర్తలకు స్వయంగా పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు భోజనాలు ఒడ్డించి వారితో కలిసి భోజనాలు చేశారు. ఈ సమావేశంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షులు నల్లమల వెంకటేశ్వరరావు, బొమ్మెర రామూర్తి, పలు గ్రామాల సర్పంచులు, ఎంపిటీసీలు, గ్రామ శాఖ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి వ్యక్తి మృతి

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

ఓ వ్యక్తి వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు గ్యాస్ లీకై పేలిపోయి సంఘటనలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని దమ్మాయిగూడెం గ్రామానికి చెందిన ప్రసాద్ తన భార్య ఉదయం కూలి పనులకు వెళ్ళటంతో వంట చేస్తుండగా గ్యాస్ లీకై పేలిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు మృతుడికి భార్య సుజిత, పాప, బాబు కలరు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై వరాల శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రంజాన్ కిట్లను పంపిణీ చేసిన సండ్ర

నవతెలంగాణ-కల్లూరు



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మండల లోని 275 మంది ముస్లిం సోదరులకు రంజాన్ కిట్లను సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకటవీరయ్య సోమవారం పంపిణీ ప్రారంభించారు. కల్లూరులోని జామియ మసీదు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై తన సొంత ఖర్చులతో నియోజకవర్గంలోని మసీదులలో అలీం మౌజన్‌లకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ మాసం చాలా పవిత్రమైనదని, రంజాన్ మాసం సందర్భంగా నిష్ఠతో పాటించే ఉపవాస దీక్షలు, దైవ్వక ప్రార్థనలతో సామరస్యం, శాంతి సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు సయ్యద్ ఆలీ, ఇమామ్, ఎంపీపీ బీరవల్లి రఘు, జడ్పిటిసి కట్టా అజయ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు పాలెపు రామారావు, రైతు సమన్వయ సమితి ప్రతినిధులు డాక్టర్ లక్కినేని రఘు, పసుమర్తి చంద్రరావు, ఎఎంసి వైస్ చైర్మన్ కాటమనేని వెంకటేశ్వరరావు, జడ్పీ ,మండల కో ఆప్షన్ సభ్యులు ఎండి ఇస్మాయిల్, కమ్లి, ఎంపీటీసీ కొండూరు కిరణ్ కుమార్, మాజీ కో ఆప్షన్ సభ్యులు యాకుబ్ ఆలీ, బిఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు పెడకంటి రామకృష్ణ, మండల సెక్రెటరీ కొరకొప్పు ప్రసాద్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు రావూఫ్, అమీరుద్దీన్, అయుబ్, హనీఫ్ , ఇస్సాక్, షఫీ, ఎంపీటీసీ సభ్యులు మాదిరాజు లక్ష్మణ రావు, కొండూరు కిరణ్ కుమార్, ఆఫ్రోజ్, కట్టా అర్జప్ప, ఆలయ డైరెక్టర్లు భానోత్ బాలు, అజ్మీరా జమలయ్య, పాలడుగు శంకర్ రావు పాల్గొన్నారు.

'పరిహారం' పాట్లు



- జాతీయ ప్రాజెక్టులకు జిల్లాలో భారీగా భూసేకరణ
- రైల్వే, రోడ్ల విస్తరణతో నిర్వాసితులకు అన్యాయం
- ఆందోళనలో ఖమ్మంరూరల్ మండల రైతాంగం
- పరిహారం పెంపునకు నిర్వాసితుల డిమాండ్
- రైతులకు దన్నుగా కమ్యూనిస్టు పార్టీల నేతలు

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

జాతీయ రహదారుల పరిహారం విషయంలో కేంద్రం రైతులకు తీరని అన్యాయం చేస్తోంది. ఎకరం రూ.కోట్ల విలువ చేసే పంట భూములను రూ.పాతిక లక్షల లోపే పరిహారం చెల్లిస్తూ నిర్వాసితులకు తీరని వ్యథలు మిగులుస్తోంది. ఇప్పుడు ఖమ్మం జిల్లాలో ఏ మారుమూల ప్రాంతానికి వెళ్లినా రూ.30లక్షల లోపు ఎకరం ఎక్కడా లభించే అవకాశం లేకున్నా ప్రస్తుత రిజిస్ట్రేషన్ విలువకు మూడు రెట్లు అదనంగా చెల్లిస్తామంటూ రూ.కోట్ల విలువైన భూములకు రూ.పది నుంచి పాతిక లక్షలకు లెక్కలు కడుతోంది. ఫలితంగా నిర్వాసితులు ఆందోళనల బాట పట్టాల్సి వస్తోంది. దీనిలో భాగంగా మహబూబాబాద్ (కొరవి)- కోదాడ 365 ఏ జాతీయ రహదారి నిర్వాసితులు తమకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తూ జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. భూములు కోల్పోతున్న రైతులకు ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలు సీపీఐ(ఎం), సీపీఐతో పాటు సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథ, న్యూడెమోక్రసీలు అండగా నిలిచాయి.

స్వల్ప పరిహారంతో సరిపెడుతూ...

ఇప్పటికే గ్రీన్‌ఫీల్డ్ హైవే కారణంగా విలువైన పంట భూములు జిల్లాలో సుమారు మూడువేల ఎకరాలకు వరకు రైతులు కోల్పోతున్నారు. ఇప్పుడు కొరవి- కోదాడ నాలుగులేన్ల నేషనల్ హైవే, మూడో రైల్వేలైన్, మిర్యాలగూడ- డోర్నకల్ నూతన రైల్వేలైన్‌తోనూ ఖమ్మం రూరల్ మండలంలో పలు గ్రామాల్లో విలువైన భూములను రైతులు కోల్పోతున్నారు. వ్యవసాయపరంగానే కాకుండా గ్రానైట్ నిక్షేపాలున్న ఈ భూములకు ప్రభుత్వం అతి తక్కువ విలువ కట్టడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. నగరానికి సమీపంలో నూతనంగా వెలిసిన వెంచర్లలో గజం రూ.20వేల వరకు ఉన్నచోట రూ.మూడు, నాలుగు వేల పరిహారంతో సరిపెట్టేందుకు కేంద్రం పూనుకోవడంపైనా ఆక్షేపణలు వస్తున్నాయి.

రూ.కోటి విలువైన భూమికి రూ.పాతిక లక్షలలోపే...

ఖమ్మం నగరానికి చెంతనే ఉన్న ఖమ్మం రూరల్ మండలంలో ఏ గ్రామానికి వెళ్లినా...మారుమూల భూములైనా ఎకరం రూ.50లక్షల పైమాటే. ఇక రోడ్ల సమీపంలో ఉండే భూములైతే రూ.కోటి నుంచి రూ.కోటిన్నరకు పైనే ప్రస్తుత మార్కెట్ రేట్లు ఉన్నాయి. కానీ ఏ జాతీయ ప్రాజెక్టు అవసరాలకు భూమి సేకరించినా ఎకరం రూ.పాతిక లక్షలలోపే పరిహారం నిర్ణయిస్తుండటంపై రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తోంది. సుమారు 70 కి.మీ పైగా నిర్మించే కొరవి- కోదాడ నాలుగులేన్ల జాతీయ రహదారి 365ఏ కోసం ఖమ్మం రెవెన్యూ డివిజన్ పరిధిలో అత్యధికంగా భూమి సేకరిస్తు న్నారు. ముఖ్యంగా నగరానికి పది కి.మీ లోపు ఉన్న ఖమ్మం రూరల్ మండలంలో ఎం.వెంకటాయపాలెం, పొన్నెకల్లు, ఆరెంపుల, ఆరెకోడు, కాచిరాజుగూడెం, వాల్యాతండా తదితర రెవెన్యూలలో ఎకరం రూ.కోటి నుంచి రూ.రెండు కోట్ల వరకు పలుకుతున్నాయి. ప్రభుత్వం మాత్రం ఎకరానికి రూ.13.50 లక్షల నుంచి రూ.23.65 లక్షల వెలకట్టింది. దీనిపై రైతుల నుంచి పెద్ద ఎత్తున అభ్యంతరాలు వస్తున్నాయి. ఎకరం, రెండు ఎకరాలున్న సన్నచిన్నకారు రైతుల భూములు పూర్తిగా ఈ రోడ్డు కింద పోతుండటం, అతి స్వల్ప పరిహారం ఇస్తుండటంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ నేపథ్యంలో కమ్యూనిస్టు పార్టీలు నిర్వాసితుల తరపున పోరాటానికి సమాయత్తం అవుతున్నాయి.

కలెక్టర్‌కు వినతి...

నిర్వాసితుల పక్షాన కమ్యూనిస్టు పార్టీల నేతలు జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. కొరవి- కోదాడ నాలుగు వరుసల జాతీయ రహదారితో రూ.కోట్ల విలువ చేసే భూములు కోల్పోతున్న రైతులను ఆదుకోవాలని కోరారు. బహిరంగమార్కెట్లో ఎంత ధర ఉందో అంతమొత్తం పరిహారంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన వారిలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రూరల్ మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు ఊరడి సుదర్శన్‌రెడ్డి, పి.మోహన్‌రావు, కోటి శ్రీనివాసరావు, సీపీఐ నాయకులు దొండపాటి రమేష్, పుచ్చకాయల సుధాకర్, చందర్‌రావు, ఎం.వెంకటరెడ్డి, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథ నుంచి మలీదు నాగేశ్వరావు, ఆవుల వెంకటేశ్వర్లు, న్యూడెమోక్రసీ నుంచి ఉపేందర్ ఉన్నారు.

కనీసం రూ.50 లక్షలైనా ఇవ్వాలి...

పొన్నం వెంకటరమణ, కాచిరాజుగూడెం



మా గ్రామం కాచిరాజుగూడెం రెవెన్యూలో మొత్తం 18 ఎకరాల భూమి కొరవి- కోదాడ హైవే కింద పోతుంది. మేము ఇద్దరం అన్నదమ్ములం. మా ఇద్దరి పొత్తున ఎకరం పోతుంది. మాకు ఏడు ఎకరాలుండగా చెరి మూడున్నర ఎకరాలు వస్తాయి. దానిలో ఎకరం పోతే మా పరిస్థితి ఏమి కావాలి. రిజిస్ట్రేషన్ వాల్యూ ప్రకారం ఇస్తామంటున్నారు. మా గ్రామం సుడా పరిధిలో లేదు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం మాకు మూడు వంతులు కలపాలి. గ్రామంలో ఎకరం రూ.కోటి ఉంది. కనీసం మాకు ఎకరానికి రూ.50లక్షలైనా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం.

ముస్లింలకు 'రంజాను' మాసం పవిత్రం

- తెలంగాణ వచ్చాకే మతసామరస్యత
- సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య
- ముస్లింలకు రంజాను తోఫా పంపిణీ

నవతెలంగాణ-సత్తుపల్లి



ముస్లింలకు రంజాను మాసం ఎంతో పవిత్రమైనదని, ఎంతో నిష్ఠతో రంజాను మాసమంతా కఠినమైన ఉపవాస దీక్షలు ఆచరిస్తూ సర్వమానవాళి సుఖసంతోషాలతో ఉండాలని అల్లాను వేడుకుంటారని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. ప్రభుత్వం అందించిన రంజాను తోఫాను సోమవారం స్థానిక పాతసెంటరు జామే మసీదులో ముస్లింలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సండ్ర మాట్లాడారు. తెలంగాణ రాకముందు ఏ ప్రభుత్వం కూడా మతసామరస్యానికి ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. తెలంగాణ వచ్చి, కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాడ్డాక అన్ని మతాలను సమాన దృష్టితో గౌరవిస్తూ వారివారి పండుగలకు ప్రభుత్వం కానుకలు అందించే సంప్రదాయం తెలంగాణ ఏర్పడిన నాటినుంచి గత 9 యేండ్లుగా ఆనవాయితీగా అమలు చేసుకుంటూ ప్రభుత్వం ముందుకు సాగుతోందనన్నారు. తెలంగాణ ప్రభుత్వం ముస్లిం సామాజిక వర్గానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోందన్నారు. అందులో భాగంగానే గురుకులాలు, షాదీఖానాలు నిర్మాణాలు, ఖబరస్తాన్లకు స్థలాలు, మసీదుల అభివృద్ధి ఇతరత్రా ముస్లిం ప్రజలు అడిగే ప్రతి కోరికను బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చుకుంటూ వస్తోందన్నారు. అన్నదమ్ముల్లా ఉంటున్న మనందరి మధ్య చిచ్చుపెట్టేందుకు మతపార్టీ బీజేపీ విషప్రచారం, మతకల్లోలాలు సృష్టించడం, అలజడులు, అరాచకాలు సృష్టించి రాజకీయ పబ్బం గడుపుకునేందుకు శతవిధాల ప్రయత్నాలు చేస్తోందన్నారు. అట్టి ప్రయత్నాల పట్ల అన్ని వర్గాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సండ్ర కోరారు. ఈ కార్యక్రమంలో మసీదు సదర్ ముఖరం హుస్సేన్, బాషా, మన్సూర్ ఆలీఖాన్, ఫతేమహ్మద్, అమీర్‌జాని, మౌలానాసాబ్, మదీనాపాషా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, మున్సిపల్ ఛైర్మెన్ కూసంపూడి మహేశ్, ఆత్మ ఛైర్మెన్ వనమా శ్రీనివాసుదేవరావు, నాయకులు ఎస్కే రఫీ, దొడ్డా శంకరరావు, వల్లభనేని పవన్, మున్వర్‌ఖాన్, ఫయాజ్, రియాజ్, షాకిర్ (ఎన్‌సీసీ), కౌన్సిలర్లు గ్రాండ్ మౌలాలి, వేములపల్లి మధు, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

తెలంగాణలో సుపరిపాలన టీడీపీతోనే సాధ్యం

నవతెలంగాణ-చింతకాని

తెలంగాణలో టీడీపీతోనే సుపరిపాలన సాధ్యమవుతుందని టీడీపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం పేర్కొన్నారు. ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో తొలుత పార్టీ జెండా ఆవిష్కరించి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వాసిరెడ్డి మాట్లాడుతూ మధిర నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో పార్టీ సభ్యత్వ నమోదును ముమ్మురం చేసి పార్టీని విస్తృత పరచి 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని స్థానాలలో పోటీ చేసే విధంగా కార్యకర్తలు పని చేయాలన్నారు. మధిర నియోజకవర్గంలో టీడీపీ పతాకాన్ని ఎగురవేసే లక్ష్యంగా పార్టీ శ్రేణులందరూ పనిచేయాలని రామనాథం కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు నున్న తాజుద్దీన్, బొప్పారం గ్రామ శాఖ అధ్యక్షులు డి.నాగరాజు, కార్యదర్శి రేఖం వెంకటేశ్వరరావు, వార్డ్ మెంబెర్ షేక్ హసినాబీ, నాయకులు సురేష్, కాసిమళ్ల రవి, ఆనంతయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రియదర్శిని కళాశాల విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

బెంగళూరుకి చెందిన మెయిన్ టెక్ టెక్నాలజీస్ వారు ఈనెల 4 వ తేదీన వర్చువల్గా నిర్వహించిన నియామకాల్లో మండల పరిధిలో సాయిప్రభాత్ నగర్‌లోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రిన్సిపల్ గోపాల్ తెలిపారు. నియామకాలకు ఎంపికయిన విద్యార్థులను కళాశాలలో సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్ బాబు మాట్లాడారు. అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకొని విద్యార్థులు తమ నైపుణ్యాలకు పదును పెట్టి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గోపాల్,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్

నవతెలంగాణ - ఎర్రుపాలెం

మండల పరిధిలోని పెగళ్ళపాడు గ్రామానికి చెందిన వెంకటాచారి అనే ప్రయాణికుడు మధిర నుండి విజయవాడ వెళుతున్న బస్సును ఎర్రుపాలెం బస్‌స్టాప్‌లో బస్సు ఎక్కి విజయవాడలో దిగిపోయాడు. అట్టి ప్రయాణికుడు తన పర్సును బస్సులో మరిచి పోయిన విషయాన్ని గుర్తించిన బస్సు కండక్టర్ వేణు ప్రయాణికుడు వెంకటాచారికి సమాచారం అందించి విజయవాడ బస్టాండ్‌లో ఆర్టీసీ అధికారుల సమక్షంలో ప్రయాణికునికి పర్సును 16 వేల రూపాయలు నగదును అందించి తన నిజాయితీని నిరూపించుకున్నారు. ప్రయాణికుడు కండక్టర్‌కి ఆర్టీసీ అధికారులకి కృతజ్ఞతలు తెలిపారు.

బలహీన వర్గాల అభివృద్ధి బీఆర్ఎస్ లక్ష్యం

మైనార్టీలకు తోఫా అందజేసిన ఎమ్మెల్యే సండ్ర

నవతెలంగాణ-పెనుబల్లి

కులమతాలకు అతీతంగా అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి కెసిఆర్ కట్టుబడి ఉన్నారని సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో రంజాన్ పండుగ సందర్భంగా మైనార్టీ సోదరులకు సోమవారం ప్రభుత్వం తరపున తోఫా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయా మతాల పండుగల సందర్భంగా పేదలకు బహుమతులు అందజేయడం తెలంగాణ ఆవిర్భావం తర్వాత కెసిఆర్ తీసుకున్న గొప్ప నిర్ణయం అన్నారు. పెనుబల్లి షాదీ ఖానతో పాటు మండలంలో మిగిలిన షాదీఖానాలను కూడా నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రమాదేవి, ఎంపీపీ లక్కినేని అలేఖ్య వినీల్, జడ్పిటిసి చెక్కిలాల మోహన్ రావు, పెనుబల్లి వీఎం బంజర్ సర్పంచులు తావు నాయక్, పంతులి, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు కనగాల వెంకట్రావు పాల్గొన్నారు.

ఉత్తమ గ్రామపంచాయతీ సర్పంచ్‌కి సన్మానం

నవతెలంగాణ-తల్లాడ

జిల్లా స్థాయిలో ఉత్తమ గ్రామపంచాయతీగా ఎంపికైన కుర్నవల్లి సర్పంచ్ తైలూరి లక్ష్మిని సొసైటీ చైర్మన్ ఏలూరు ప్రతాపరెడ్డి సోమవారం ఘనంగా సన్మానించారు. మహిళా సాధికారితలో భాగంగా మహిళా సర్పంచ్‌గా గ్రామపంచాయతీని అన్ని విభాగాల్లో అభివృద్ధి చేసినందుకు గ్రామపంచాయతీకి జాతీయ ఉత్తమ పంచాయతీ అవార్డు రావడం అభినందనీయం అన్నారు. భవిష్యత్తులో పూర్ణాలు గ్రామాన్ని మరింతగా అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పోతురాజు వెంకటయ్య, కార్యదర్శి వెంకటేష్ వార్డు సభ్యులు సావిత్రి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

పాఠశాలకు డిజిటల్ బోర్డ్ బహూకరణ

నవతెలంగాణ-కూసుమంచి



చెన్నైకి చెందిన శ్రీ ఇన్ఫోటెక్ సొల్యూషన్స్ లిమిటెడ్ సంస్థ సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు రెండు లక్షల రూపాయల విలువైన డిజిటల్ బోర్డును బహుకరించింది. ఈ సందర్భంగా పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి ఆ డిజిటల్ బోర్డును ప్రారంభించి, విద్యార్థులను, ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం, దాతలు ఏర్పాటు చేస్తున్న మౌలిక సౌకర్యాలను సమర్థవంతంగా వినియోగించుకొని విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. డిజిటల్ బోర్డును బహుకరించిన శ్రీ ఇన్ఫోటెక్ సొల్యూషన్స్ యాజమాన్యం యలమంచి శేషు చౌదరిని, సహకరించిన చేతన ఫౌండేషన్ సంస్థను అభినందించారు. భవిష్యత్తులో కూడా పాలేరు నియోజకవర్గం లో ఇలాంటి దాతృత్వ కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని కోరారు. చేతన ఫౌండేషన్ అధ్యక్షులు వెనిగళ్ళ అనిల్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు, పాఠశాలలకు ఫౌండేషన్ ద్వారా అనేక రకాల కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లుగా తెలిపారు. భవిష్యత్తులో సంస్థ కార్యక్రమాలను ఇంకా విస్తరిస్తామని దానికి కూసుమంచి పాఠశాలను కేంద్రంగా చేసుకొని పనిచేస్తామని హామీ ఇచ్చారు. కరోనా సమయంలో జిల్లా వ్యాప్తంగా వివిధ సహాయ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి బానోత్ శ్రీనివాస్, డిసిసిబి డైరెక్టర్ ఇంటూరి శేఖర్, సర్పంచ్ చెన్నమోహన్, చేతన ఫౌండేషన్ ప్రతినిధులు ఎం సురేష్ కుమార్, డి కృష్ణారావు, రషీద్, శ్రీనివాస చారి, పాఠశాల చైర్మన్ మైమోనా, ప్రధానోపాధ్యాయులు విక్రమ్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేలపట్ల మహిళకి పునర్జన్మ

ప్రభుత్వ వైద్యులకు అభినందనల వెల్లువ

నవతెలంగాణ- ఖమ్మం



ఓ మహిళకి పునర్జన్మ సంఘటన ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో చోటు చేసుకుంది. ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం... ఓ గర్భిణి అనారోగ్య సమస్యతో ఖమ్మం ప్రభుత్వ ప్రధానాస్పత్రిలో చేరింది. రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ఇన్సెంటివ్ కేర్ యూనిట్ వైద్యుల బృందం ఆమెకు పునర్జన్మ ప్రసాదించిందన్నారు. కూసుమంచి మండలం నేలపట్ల గ్రామానికి చెందిన ప్రవళిక (22) పురిటినొప్పులు రాకపోవడం వల్ల అత్యవసరంగా ఎల్ఎస్సిఎస్ చేశామని, పేషంట్ శస్త్ర చికిత్స మందు తర్వాత ఆరోగ్యం నిలకడగానే ఉందన్నారు. పేషంటును శస్త్ర చికిత్స అనంతరం వార్డుకు తరలించే క్రమంలో ఆమెకు మూర్ఛ వచ్చినదని, వెంటనే అప్రమత్తమై మూర్ఛ తగ్గించి చికిత్స అందించామని , రెండోసారి మూర్ఛతో పాటు స్పృహ కూడా కోల్పోయిందని, సందర్భంగా గుండె కొట్టుకునే వేగం, రక్తపోటు రికార్డు కాలేదని ఈ క్రమంలో పేషంట్ అనారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని సిపిఆర్ ప్రక్రియ చేపట్టామని, ఈ ప్రక్రియలో డాక్టర్ విమల, డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ మానస వీరు మూడుసార్లు సిపిఆర్ చేశారని తెలిపారు. తర్వాత రక్తపోటు, నాడీ స్పందన నమోదయిందని, అనంతరం ఆమెను ఇన్సెంటివ్ కేర్ యూనిట్‌కు తరలించామని తెలిపారు. ఈ క్రమంలో ఆమెకు పిపిసిఎం ఉందని నిర్ధారణ అయిందని సరైన సమయంలో డాక్టర్ రాజశేఖర్ గౌడ్ ఇన్సెంటివ్ కేర్ యూనిట్ ఇన్చార్జి ఆధ్వర్యంలో సిపిఆర్, ఇంట్యూ బేషన్ చేయడం వల్ల పేషెంట్ ఆరోగ్యం నిలకడగా ఉందని అన్నారు. ఈ ప్రక్రియలో ఇన్సెంటివ్ కేర్ యూనిట్ స్టాఫ్ నర్సులు శ్రావణి, సుజాత సహకరించారని, ప్రస్తుతం ఆమెను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసేందుకు అనుకూలంగా ఉందని తెలిపారు. వైద్య బృందాన్ని మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ రాజేశ్వరరావు, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఆర్ఎంఓ శ్రీనివాసరావు అభినందించారు.



నువ్వుల లక్ష్మి కాంతమ్మకు నివాళి

నవతెలంగాణ-రఘునాథపాలెం

కామంచికల్ గ్రామంలో ప్రముఖ స్వాతంత్ర సమరయోధురాలు నువ్వుల లక్ష్మి కాంతమ్మ దశ దిన కార్యక్రమాల్లో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు సోమవారం పాల్గొన్నారు. కాంతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇటీవల మరణించిన సీపీఐ సీనియర్ నాయకులు కొనకొండ్ల అయోధ్యా కుటుంబాన్ని, కామంచికల్ గ్రామ వాసి అయిన జలగం శ్రీను ఇటీవల గుండెపోటుతో మణించారు. వారి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో రఘునాథపాలెం మండల కార్యదర్శి ఎస్.నవీన్‌రెడ్డి, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాస్, మెరుగు సత్యనారాయణ, మండల కమిటీ సభ్యులు ప్రతాపనేని వెంకటేశ్వర్లు, గ్రామ కార్యదర్శి అనంతనేని వీరయ్య, చెరుకూరి మురళీకృష్ణ, నువ్వుల కృష్ణయ్య, గండు లక్ష్మీనారాయణ, చెరుకూరి వెంకట నరసయ్య నివాళులు అర్పించారు.

కలెక్టరేట్‌లో బిందు సేద్యం యూనిట్ ఏర్పాటు

- ప్రారంభించిన కలెక్టర్



నవతెలంగాణ-పాల్వంచ

కలెక్టరేట్‌లో ప్రాంగణంలో మొక్కలు పరిరక్షణకు (డ్రిప్పు) బిందు సేద్యపు యూనిట్ ఏర్పాటు చేయడం పట్ల కలెక్టర్ అనుదీప్ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో మొక్కలు పరిరక్షణకు ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రూ.18 లక్షలతో ఏర్పాటు చేసిన బిందు సేద్యం యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రిప్ ఏర్పాటు వల్ల మొక్కలకు సమృద్ధిగా నీరు అందుతుందని చెప్పారు. నీటి వృథాను అరికట్టి నీటి పరిరక్షణకు అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. ఐడీఓసీ కార్యాలయం అన్ని కాలాల్లో పచ్చదనం, చక్కటి లాన్‌తో ఆహ్లాదకరంగా ఉండాలని చెప్పారు. నాటిన ప్రతిమొక్కను కాపాడుకోవాలనే లక్ష్యంతో నీటి సంరక్షణ చర్యలు పాటిస్తూ మొక్కలు సంరక్షణకు డ్రిప్ ఉపయోగపడుతుందని చెప్పారు. వేసవిలో మొక్కలు కాపాడుకోవాలని చెప్పారు. నాటిన ప్రతి మొక్కకు డ్రిప్ ఏర్పాటు ద్వారా పుష్కలంగా నీరు అందించాలని చెప్పారు. ఐడీఓసీ కార్యాలయం అన్ని కాలాలలో పచ్చని మొక్కలు లాన్‌తో ఆహ్లాదకరంగా కలకలలాడే విధంగా గ్రీనరీతో ఉండాలని చెప్పారు. 25 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో నిర్మించిన ఐడీఓసీ కార్యాలయంలో 4 ఎకరాల విస్తీర్ణంలో 205 రకాల వివిధ పూలు, పండ్ల మొక్కలతో పాటు నీడ నిచ్చే చెట్లు, పలు ఔషద గుణాలు కలిగిన మొక్కలు నాటినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి జినుగు మరియన్న, వ్యవసాయ అధికారి అభిమన్యుడు, డీఆర్ఓ అశోక్ చక్రవర్తి కార్యాలయ అధికారి సముద్రాల విజయకుమార్, బిందు సేద్య వరంగల్ మేనేజర్ ఎస్.భవాని ప్రసాద్, సిబ్బంది రమేష్, బాలాజీ, ప్రశాంత్, క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్ణశాల రామయ్యను దర్శించుకున్న ఏటూరు నాగారం ఏఎస్పీ సంకీర్త్

నవతెలంగాణ-దుమ్ముగూడెం

ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల రామయ్యను ఏటూరు నాగారం ఏఎస్పీ సంకీర్త్ సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది ఆయనకు ఆలయ మర్యాదల ప్రకారం ప్రధాన ద్వారంలో స్వాగతం పలికి గర్భాలయంలో ప్రత్యేక పూజలు అనంతరం ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం వారు శీతా కుటీర ప్రదేశంతో పాటు నారచీరల ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పర్ణశాల విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎస్సై కేశవ్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా మాధవ రావు



నవతెలంగాణ-ఇల్లందు

మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, ఉమ్మడి ఖమ్మం జిల్లా సీనియర్ నేత పులిగల్ల మాధవ రావు బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరిప్రియ హరిసింగ్ నాయక్ అభినందించారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ సహకరించిన విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు, ఇల్లందు ఎమ్మెల్యే హరిప్రియ హరి సింగ్ నాయక్ దంపతులకు, జిల్లా గ్రంధాల సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కలెక్టర్‌కు వినతి



నవతెలంగాణ-చంద్రుగొండ

అర్హులైన పేద ఆదివాసులకు మండల కేంద్రంలోని ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ఆదివాసీ సంఘం జిల్లాలు నాయకులు కుంజా వెంకటేష్ దొర డిమాండ్ చేశారు. మండల ఆదివాసీలతో కలిసి సోమవారం కలెక్టర్ అనుదీప్‌కు వినతిని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏండ్లుగా ఇండ్ల స్థలాల కోసం ఆదివాసీలు దరఖాస్తు చేసుకుంటున్నా అధికారుల పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘం నాయకుల్లో తెల్లం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



అనారోగ్య బాధితుడికి చేయూత ట్రస్ట్ చేయూత

నవతెలంగాణ-బూర్గంపాడు

మండల పరిధిలోని సోంపల్లి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న నస్కూరి ముత్తయ్య అనే వ్యక్తికి సోమవారం మోరంపల్లి బంజరు గ్రామానికి చెందిన చేయూత ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.5000 ఆర్థిక సహాయం అందించి మానవత్వం చాటుకున్నారు. గత కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో బాధ పడుతుండగా మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లు తెలపడంతో నిరుపేద కుటుంబం కావటంతో పలువురు వద్ద అప్పు చేసి కుటుంబ సభ్యులు ఆపరేషన్ చేయించారు. తిరిగి మళ్లీ చెకప్ కోసం ఆసుపత్రికి వెళ్లాల్సి ఉండగా చేతిలో చిల్లిగవ్వ లేక ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్న తరుణంలో చేయూత ఈ సాయం అందించారు. ఈ సందర్భంగా చేయూత ట్రస్ట్ చైర్మన్ కైపు లక్ష్మీ నారాయణ రెడ్డి మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అనే అదే లక్ష్యంతో ట్రస్ట్‌ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో చేయూత ట్రస్ట్ సభ్యులు జక్కి రెడ్డి మల్లారెడ్డి, కైపు నాగిరెడ్డి, పుట్టి రాజేష్, శనగా మల్లేశ్వరరావు, వేముల సురేష్, సాయి బాబు, గంట మస్తాన్ బాబు, బిజ్జం వెంకట రామిరెడ్డి, కామిరెడ్డి వెంకట రెడ్డి, గ్రామ యూత్ నస్కూరి క్రాంతి, బోరెం సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట ఆందోళన

నవతెలంగాణ-కొత్తగూడెం

అనేక ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అండ్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జేఏసీ పిలుపు మేరకు సోమవారం కలెక్టరేట్ ముందు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఎస్. అజరయ్య, ఆర్.వెంకటేశ్వర రావు మాట్లాడుతూ చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రతి నెల మొదటి తేదీన పెన్షన్ చెల్లించాలని, విశ్రాంతి ఉద్యోగులకు నాణ్యమైన, అపరిమితంగా వైద్య సేవలు అందించాలని, అన్ని గుర్తింపు పొందిన ఆసుపత్రులలో అందించాలన్నారు. తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి, ప్రధానమంత్రికి అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు ఆనంద్ కుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.నాగేశ్వరరావు, నారాయణరావు, రామారావు, మోహన్‌రావు, సుధాకర్ రావు, పుల్లయ్య, అజయ్ కుమార్, రాములు తదితరులు పాల్గొన్నారు. నిరసన దీక్షల్లో పలు మండలాల, శాఖల అధ్యక్షులు, కార్యదర్శులు, ఇతర విశ్రాంత ఉద్యోగులు ప్రసంగించారు.

అనుదినం...జనపక్షం

www.praja.khammam@gmail.com

నవతెలంగాణ

భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం 11 ఏప్రిల్ 2023

స్విమ్మింగ్ శిక్షణ కోసం ఉద్యోగులు దరఖాస్తు చేసుకోవాలి



నవతెలంగాణ-ఇల్లందు

సింగరేణి ఇల్లందు ఏరియాలో గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఈత కొలను ఏప్రిల్ 17న ప్రారంభిస్తున్నామని ఇల్లందు ఏరియా జీఎం ఎం.షాలేము రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యము అని, ఆరోగ్యంగా ఉండడానికి మానసిక ఉల్లాసానికి ఈత అనేది చాలా చక్కటి క్రీడ అని, చాలా మంది ఉద్యోగులు సరైన శారీరక శ్రమ లేనందున అనారోగ్య పాలవుతున్నారు. స్థానిక 24 ఏరియాలో ఉన్న ఆఫీసర్స్ క్లబ్‌లోని స్విమ్మింగ్ పూల్‌ను ఉపయోగించుకొనుటకు ఉత్సాహవంతులైన ఉద్యోగులకు, వారి పిల్లలకు ఈ అవకాశం కల్పిస్తున్నామని అన్నారు. కావున ఈ అవకాశాన్ని ఉపయోగించుకొనుటకు ఆసక్తి గల ఉద్యోగస్తులు జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగం నందు సంప్రదించగలరని తెలియజేశారు.

బీఆర్ఎస్‌కి వ్యతిరేక కార్యక్రమాలు చేస్తే సహించం

- విలేకర్ల సమావేశంలో విప్ రేగా



నవతెలంగాణ-మణుగూరు

బీఆర్ఎస్ పార్టీలోనే ఉంటూ పార్టీకి వ్యతిరేక కార్యక్రమాలు చేస్తే సహించేది లేదని విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. సోమవారం ఇల్లందు గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా పార్టీకి ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్న నేపథ్యంలో సస్పెండ్ చేసినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ జాతీయ అధ్యక్షులు, సీఎం కేసీఆర్‌పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేదిలేదని అన్నారు. ఎనిమిది సంవత్సరాల్లో కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులు రైతుబంధు, దళితబంధు, ఇంటింటికి నల్లా కలెక్షన్, కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు కనబడట్లేదా అని ఘాటుగా విమర్శించారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తుంటే వీళ్ళు మాత్రం తెలంగాణలో అభివృద్ధి జరగలేదని అనడం విడ్డురంగా ఉన్నదన్నారు. ఏ పార్టీలో ఉన్నారో తెలియకుండా అభ్యర్థులను ప్రకటించుకుంటూ వెళుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదికి పది గెలిచి తీరుతామని ధీమా వ్యక్తంచేశారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్‌పై విమర్శలు మానుకోవాలని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు భవాని శంకర్, జడ్పీటీసీ పోశం నర్సింహారావు, ముత్యంబాబు, అడపా అప్పారావు, నవీన్, యాదగిరి గౌడ్, టిబిజికె ఎస్ అధ్యక్షులు ప్రభాకర్‌రావు, వట్టం రాంబాబు, మాజీ ఎంపీటీసీ రవి తదితరులు పాల్గొన్నారు.

మండలంలో రెండు కరోనా పాజిటివ్ కేసులు

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

మండలంలో కరోన ఫోర్త్ వేవ్ మొదలు అయి ఇద్దరకు కరోనా పాజిటివ్ రావండంతో మండల ప్రజలు మళ్ళీ అందోళన చెందుతున్నారు. ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం కరోన పరీక్షలు నిర్వహించగా బూర్గుగూడెం ఒక్కరికి, యర్రగుంట ఒక్కరికి పాజిటివ్ రావండంతో కరోన ఫోర్త్ వేవ్ మొదలు అయిందని మండల ప్రజలు అంత ఉలిక్కిపడుతున్నారు. కరోన నుండి ఉపశయనం కలిగింది అనుకున్న ప్రజలకు మళ్ళీ కరోన భయం పట్టుకుంది. ప్రతి గ్రామంలో కరోన పై ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి తగిన జాగ్రత్తలు, సూచనలు మెడికల్ డిపార్మెంట్ అధికారులు, సంబదిత మండల అధికారులు సూచనలు సలహాలు ఇచ్చి వాటిని పాటించే విధంగా చూడాలని పలువురు కోరుకుంటున్నారు.

గ్రామీణ వైద్యులకు ప్రభుత్వ శిక్షణ ఇవ్వాలి



నవతెలంగాణ-చంద్రుగొండ

గ్రామీణ వైద్యులకు ప్రభుత్వ శిక్షణ ఇవ్వాలని గ్రామీణ వైద్యుల సమైక్య రాష్ట్ర స్టీరింగ్ కమిటీ నూరి రబ్బాని ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన మండల స్థాయి గ్రామీణ వైద్యుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ నెల 12న లక్ష్మీదేవి పల్లి మండల కేంద్రంలోని ఓం సాయిరాం ఫంక్షన్ హాల్ జిల్లా మహాసభ నిర్వహించడం జరుగుతుందని మండలంలోని గ్రామీణ వైద్యులందరూ సమావేశానికి హాజరై విజయవంతం చేయాలనుకున్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు పంగ మల్లేశం ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ఈ సమావేశంలో మండల కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

పొంగులేటికి....జూపల్లికి కేసీఆర్‌ను విమర్శించే అర్హత లేదు

- విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే వనమా



నవతెలంగాణ-కొత్తగూడెం

ఖమ్మం జిల్లా మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విమర్శించే ఆర్హతలేదని, ఎన్ని కుటిల ప్రయత్నాలు చేసినా...హ్యాట్రిక్ సాధించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా తిరిగి కేసీఆర్ అవ్వడం ఖాయమని, పొంగులేటి వెంట ఉన్న బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులపై వేటు తప్పదని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం కొత్తగూడెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వనమా మాట్లాడుతూ ఆదివారం కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో పొంగులేటి ఆత్మీయ సమ్మేళనం సభ ఏర్పాటు చేసి ఇష్టం వచ్చినట్లు బీఆర్ఎస్ పార్టీని, కేసీఆర్ కుటుంబాన్ని విమర్శించే ఆర్హతలేదన్నారు. రాష్ట్రంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి వీరిద్దకి కనిపించడంలేదా అన్నారు. కళ్ళు లేని వాళ్లకు సీఎం కేసీఆర్ అభివృద్ధి ఎక్కడ కనిపిస్తుందని ఎద్దేవ చేశారు. ఎవరేన్ని కుట్రలు కుతంత్రాలు చేసిన సీఎం కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అవ్వడం ఖాయం, హాట్రిక్ కొట్టడం ఖాయమన్నారు. దేశంలోని ప్రజలు కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం నెంబర్ వన్‌గా ఉందని పొగుడుతుంటే, పొంగులేటికి, జూపల్లికి కనబడకపోవడం దురదృష్టకరమన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు కేసీఆర్ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఉద్యమం చేశారని గుర్తుచేశారు. కొట్లాడి సాధించిన తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి మీకు తెలియదా...అన్నారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు మొన్నటిదాకా టిఆర్ఎస్ పార్టీలోనే ఉండి కెసిఆర్, కేటీఆర్‌లకు తెగ పొగిడిన విషయం మర్చిపోయారా అని గుర్తు చేశారు. జూపల్లి కృష్ణారావు నీ బూటకపు మాటలు కట్టిపెట్టు నీవు సీఎం కేసీఆర్‌ను విమర్శించే స్థాయికి ఎదగలేదన్నారు. నీవు కొల్లాపూర్‌లోనే గెలవలేకపోయావు, ఇక్కడ కొత్తగూడెంలో ఏమి చేయగలవన్నారు. పొంగులేటి వెంట ఉన్న బీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులకు కూడా వేటు తప్పదన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, జెడ్పి వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ దామోదర్, కౌన్సిలర్లు కోలాపురి ధర్మరాజు, టిఆర్ఎస్ నాయకులు ఎంఏ.రజాక్, ఉర్దూగర్ చైర్మన్ అన్వర్ పాష తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ- ఇల్లందు

ప్రగతిశీలా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ అనుబంధం జిల్లా నూతన కార్యవర్గం 17 మందితో ఏకగ్రీవంగా మహాసభ ఎన్నుకున్నదని ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.ప్రసాద్ సోమవారం విలేకరులకు తెలిపారు. అధ్యక్షులుగా మిట్టపల్లి రాజేందర్ (మణుగూరు మున్సిపాలిటీ), ఉపాధ్యక్షులుగా పాల్వంచ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శిగా షేక్ యాకుబ్ షావలి, ఇల్లందు, సహాయకార్యదర్శిగా బత్తుల వెంకటేశ్వర్లు (మణుగూరు), కోశాధికారిగా మాట్ల శ్రీను (ఇల్లందు) మున్సిపాలిటీ, 12 మంది కార్యవర్గస భ్యులను ఎన్నుకున్నారు.

పేదల ఇండ్లు తొలగించే కుట్ర

30 ఏండ్లుగా నివాసం ఉంటున్న పేదలకు నోటీసులు

- బాధితులకు అండగా సీపీఐ(ఎం)



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం శివారులోని రాజుపేట కాలనీలో 30 ఏండ్లుగా నివాసం ఉంటున్న 40 నిరుపేద కుటుంబాల నివాస గృహాలకు ఆంధ్రప్రదేశ్ గ్రామపంచాయతీ రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. దేవస్థానం భూములలో అక్రమంగా నివాసం ఉంటున్నారన్న పేరుతో పేదలను ఖాళీ చేసే కుట్రకు ప్రభుత్వ పెద్దలు పూనుకుంటున్నారు. నోటీసులు జారీ చేసి పేదల గుండెల్లో అలజడిని సృష్టిస్తున్నారు.

వివరాలుకెళ్తే భద్రాచలం పట్టణానికి అనుకొని ఉన్న రాజుపేట కాలనీ సగం ప్రాంతం పోలవరం ముంపు పేరుతో పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలోని భూములు ఆంధ్రాలోకి వెళ్లిన విషయం తెలిసిందే. అట్టి భూములలో గత 30 ఏళ్లుగా నివాస గృహాలు ఏర్పాటు చేసుకొని నివసిస్తున్న పేదలకు కోర్టు ఉత్తర్వుల పేరుతో ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రెవిన్యూ అధికారులు నోటీసులు జారీ చేసి నెల 15 రోజుల్లో ఖాళీ చేసి ఆ భూభాగాని ప్రభుత్వానికి అప్పజెప్పాలని ఆదేశాలు జారీ చేశారు. 30 ఏళ్లుగా ఇంటి పన్నులు చెల్లిస్తూ విద్యుత్తు బకాయిలు చెల్లిస్తూ స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న పేదలపై ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించి ఇప్పుడు ఖాళీ చేపిస్తే మా పరిస్థితి ఏంటి అని సంబంధిత బాధితులు వాపోతున్నారు. ఇక్కడ నివాసం ఉండే 40 కుటుంబాలు కూడా ఎస్సీ, ఎస్టీ బీసీ వెనకబడ్డ తరగతులకు చెందిన రోజువారి కూలీలు కావటం చేత ప్రభుత్వం చేసే ఈ చర్యల వల్ల దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఎటపాక పురుషోత్తపట్నం పంచాయతీలలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యే, ఎంపీతో సహా అందరూ అధికార పార్టీ వైయస్సార్ సీపీ వారే అయినా బాధితులు అండగా వారు నిలబడక పోవటంతో బాధితులు సీపీఐ(ఎం) పార్టీని ఆశ్రయించారు.

బాధితులకు అండగా సీపీఐ(ఎం)

నిరుపేదలకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసిన విషయాన్ని తెలుసుకున్న భద్రాచలం సీపీఐ(ఎం) నియోజవర్గ కమిటీ అలాగే ఆంధ్రప్రదేశ్ ఎటపాక సీపీఐ(ఎం) మండల కమిటీల బృందం బాధితుల వద్దకు వెళ్లి విషయం అడిగి తెలుసుకుని వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్ ఎటపాక మండల కార్యదర్శి ఈసంపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 30 ఏళ్లుగా నివాసం ఉంటున్న పేదలపై ప్రభుత్వం అధికారులు చేసే కుట్రను మానుకోవాలని హెచ్చరించారు. ఇదే భూభాగంలో ఇల్లు నిర్మించుకున్న పేదలకు ఇంటి పనులు ఇచ్చింది ప్రభుత్వ అధికారులు కాదా అదే ఇంటిపై రేషన్ కార్డులు మంజూరు చేసి కాలనీకి మౌలిక సదుపాయాలు కల్పించి ఇప్పుడు ఖాళీ చేయమంటే వాళ్ళు ఎక్కడికి పోతారని ప్రశ్నించారు. వందల ఎకరాలు ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతుంటే పట్టించుకోని అధికారులు పేదలు నివాసముంటున్న భూములను గుంజుకోవాలని చూడటం సరైనది కాదని, అధికారులు మానవతా దృక్పథంతో ఆలోచించి పేదలకు న్యాయం చేయాలని కోరారు. బాధితులకు అండగా సీపీఐ(ఎం) తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కమిటీలు ఎల్లప్పుడూ ఉంటాయని బాధితులకు భరో సాను కల్పించారు. బాధితులను పరామర్శించిన వారిలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.వి నర్సారెడ్డి, భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కమిటీ సభ్యులు సున్నం గంగ, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకట రామారావు, సంతోష్ కుమార్, లీలావతి, పట్టణ కమిటీ సభ్యులు డి.సీతామాలక్ష్మి, ఎటపాక పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు రాము తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీపై ముఖ్యమంత్రి స్పందించాలి

- డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు లిక్కి బాలరాజు



నవతెలంగాణ-కొత్తగూడెం

టీఎస్ పీఎస్సీ పేపర్ లీకేజీపై సీఎం కేసీఆర్ స్పందించాలని, హైదరాబాద్‌లో జరిగే విద్యార్థి, నిరుద్యోగ మహాదీక్షను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు లిక్కి బాలరాజు అన్నారు. సోమవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణ కేంద్రంలోని టీచర్స్ భవన్‌లో (యూటిఎఫ్) టీఎస్ పీఎస్సీ పేపర్ లీకేజీ అంశంపై విద్యార్థి, నిరుద్యోగ జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సెమినార్‌కు ఎస్ఎఫ్ఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి మంద నాగకృష్ణ అధ్యక్షత వహించారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు లిక్కి బాలరాజు ప్రధాన వక్తగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత జీవితాల పట్ల నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. టీఎస్ పీఎస్సీ ఏఈ, గ్రూప్-1 పేపర్లు లీకై రాష్ట్రంలో విద్యార్థి, నిరోద్యోగ యువత తీవ్ర మానసిక ఒత్తిడికి లోనౌతుంటే వారికి భరోసా కల్పించేందుకు కేసీఆర్ కనీసం స్పందించరా...? అని అడిగారు. టీఎస్ పీఎస్సీలో 30 లక్షల మంది వన్ టైం రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వీరందరిలో ఈ పేపర్ లీకేజీతో చదివితే ఉద్యోగం వస్తుందో...!, రాదోనన్న...! అభద్రతాభావం ఏర్పడిందన్నారు. ఉద్యోగ నియామకాలు చేపట్టే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లోనే 450 పై చిలుకు ఉద్యోగాలు అవసరం ఉంటే కేవలం 80 ఉద్యోగాలతో కాలం వెళ్ళదీస్తున్నారని విమర్శించారు. ఈ ఘటనపై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతాయనీ ముఖ్యమంత్రి స్పందించే వరకూ తమ పోరాటం ఆపబోమన్నారు. పేపర్ లీకేజీపై హైకోర్ట్ సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లీకేజీ వలన నష్టపోయిన ప్రతీ నిరుద్యోగ యువతకు ప్రతీ నెలకు రూ.20,000లు ఇవ్వాలనీ, రాష్ట్రంలో ప్రతీ యేటా ఉద్యోగాల క్యాలెండర్ ప్రకటించి నియామకాలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. వరుస పోటీ పరీక్షల, పదవ తరగతి పేపర్ లీకేజీలలో రాజకీయ కుట్ర కోణంలోనూ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్ ఎస్వీకే, సుందరయ్య పార్క్ వద్ద పేపర్ లీకేజీ నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ మహాదీక్ష చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థి, నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బుర్రా వీరభద్రం, ఎస్ఎఫ్ఐ కొత్తగూడెం డివిజన్ అధ్యక్షులు బోడ అభిమిత్ర, జిల్లా కమిటీ సభ్యులు జమ్మి యశ్వంత్, వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యుత్ శాఖలో సమ్మె సైరన్

- 17 నుండి ఉద్యోగలు సమ్మెలోకి
- సమ్మె వాల్ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-లక్ష్మీదేవిపల్లి

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తు విద్యుత్ శాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో అనేక రూపాల్లో గతం కొంత కాలంగా అనేక ఆందోళనలు చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించక పోవడంతో విద్యుత్ శాఖలో సమ్మె సైరన్ మోగనుంది. విద్యుత్ ఉద్యోగు సమస్యల పరిష్కారం కోసం ఈనెల 17 నుండి సమ్మెలోకి వెళ్లనున్నారు. టీఎస్‌పీఈ ఏజేసీ (తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ) పిలుపులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సర్కిల్ ఆఫీస్‌లో 17 నుండి సమ్మె లోకి వెళ్ళడానికి సమ్మె సైరన్ మోగించారు. దానికి ప్రతీకగా సోమవారం సమ్మె వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏజేసీ నాయకులు మోహన్ రావు, ఎస్ఏఓ మురళి, డిఇ రవి, ఏఇ రఘు రామయ్య, ఏఇ సునీతా, హేమంత్, గణేష్ బాబు, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల సమస్యలపై 28న చలో కలెక్టరేట్

నవతెలంగాణ-ఇల్లందు

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్, భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఏప్రిల్ 28న జరుగనున్నది. కొత్తగూడెంలో తలపెట్టిన ప్రదర్శన కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఐఎఫ్టియూటీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు యాకన్న పిలుపునిచ్చారు. సోమవారం ఇల్లెందు మండలం ధర్మపురంలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలతో నిర్వహించిన ప్రచార గ్రూప్ మీటింగ్‌లో వారు పాల్గొని మాట్లాడారు. కొలతలతో సంబంధం లేకుండా రోజు కూలి రూ.750 ఇవ్వాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని, వారానికి ఒకసారి వేతనాలు చెల్లించాలని, రెండు వందల రోజులు పని కల్పించాలని, పెండింగ్లో ఉన్న వేతనాలను చెల్లించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐకేఎంఎస్ గ్రామ నాయకులు చింత ఎర్రయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మచ్చ పాపారావు, బిజ్జా ముత్తయ్య, రాములమ్మ మచ్చ వీరభద్రం, బాలకృష్ణ రత్నమ్మ, దనసరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ దర్బార్‌కు స్పందన

- గిరిజనుల దరఖాస్తుల స్వీకరించిన పీవో



నవతెలంగాణ-భద్రాచలం

నిరుపేదలైన ఆదివాసీ గిరిజన కుటుంబాలకు జీవనోపాధి పెంపొందించుకోవడానికి, ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టే గిరిజన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు అందే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని పీఓ గౌతమ్ పోట్రు అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశం మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ఆదివాసి గిరిజన గ్రామాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి ఆయన అర్జీలు స్వీకరించి, తన పరిధిలో ఉన్నవి వెంటనే పరిష్కరించి మిగతా వాటిని సంబంధిత అధికారులకు పంపుతూ అర్హులైన ప్రతి దరఖాస్తు దారునికి ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. గిరిజన దర్బార్‌లో గిరిజనులు సమర్పించిన అర్జీలలో స్వయం ఉపాధి పథకాలు, జీవనోపాధి పెంపొందించుకోవడానికి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు, సబ్సిడీ ద్వారా లభించే ట్రైకార్ రుణాలు, వ్యవసాయానికి సంబంధించి కరెంటు, మోటారు, బోరు ఏర్పాటు, ఒంటరి మహిళ, వితంతు పెన్షన్లు, కిరాణా షాపు, ఫ్యాన్సీ స్టోర్‌లు, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు, మారుమూల గిరిజన గ్రామాలలో కరెంటు సౌకర్యం, పై చదువులు చదవడానికి ఆర్థిక సహాయం, అలాగే ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో జీవనోపాధి పెంపొందించుకోవడానికి వృత్తి శిక్షణ శిక్షణలు ఇప్పించుట, గిరిజనులు దరఖాస్తు చేసుకున్నారని ఆయన అన్నారు. గిరిజన దర్బార్‌లో గిరిజన గిరిజనులు సమర్పించిన అర్జీలు అన్ని ప్రత్యేకమైన రిజిస్టర్లో నమోదు చేసి, అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు విడతలవారీగా సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తున్నట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్, ఎస్ఓ సురేష్ బాబు, డీటీఆర్ఓఎఫ్ఆర్ శ్రీనివాస్, డీఎస్ఓ ప్రభాకర్ రావు, మేనేజర్ ఆదినారాయణ వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది ప్రమీల బాయ్, దుర్గయ్య, వెంకటేశ్వర్లు, సుగుణ, నాగభూషణం, రాజా చార్యులు, బాల మల్లు, రాందాస్, చలపతిరావు, జేడియం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బార్ అసోసియేషన్ అధ్యక్షుడు 'కోటా'కు సన్మానం

నవతెలంగాణ-భద్రాచలం టౌన్

భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా విశ్రాంత ఏపీపీ, న్యాయవాది కోట దేవదానం ఇటీవల ఎన్నికయ్యారు. ఆయన నివాసంలో సోమవారం భారత రాష్ట్ర సమితి మహిళా విభాగం నాయకురాలు ఇర్ల భారతి ఆధ్వర్యంలో 18వ వార్డు మహిళలు పుష్ప గుచ్ఛం ఇచ్చి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఇర్ల భారతి మాట్లాడుతూ పేద ప్రజల పట్ల వీరి సేవలు విస్తృతంగా కొనసాగించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వెంకమ్మ మంగమ్మ, లక్ష్మీ, మహిళా సంఘం నాయకురాలు పాల్గొన్నారు.

రహదారులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

నవతెలంగాణ-టేకులపల్లి



మండలంలోని పలు రహదారుల బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు బానుత్ హరిప్రియ నాయక్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఇల్లందు ఆర్ అండ్ బి రోడ్డు నుండి సాయన్నపేట వరకు 70 లక్షల అంచనాతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, బోడు రోడ్డు తుమ్మల చిలక స్టేజి నుంచి తుమ్మల చిలక గ్రామం వరకు రూ.1కోటి 70 లక్షల అంచనాతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. టేకులపల్లి మండలంలోని చింతోని చెల్క గ్రామపంచాయతీకి చెందిన పార్టీ జిల్లా నాయకులు కంభంపాటి చంద్రశేఖర్ సహకారంతో చలివేంద్రం, టేకులపల్లి మండలంలోని చింతోని చెల్క గ్రామపంచాయతీలో పార్టీ కార్యకర్తలు, నాయకులు ఏర్పాటుచేసిన నూతన పార్టీ గద్దెను ప్రారంభించారన్నారు. అనంతరం చింతోని చెల్క గ్రామస్తులు ఎమ్మెల్యే పూలమాలతో శాలువాతో ఘనంగా సత్కరించినట్లు తెలిపారు. టేకులపల్లి మండలంలోని చింతోని చెల్కగ్రామపంచాయతీలో చింతోని చెల్క ఆర్ అండ్ బీటీ రోడ్డు నుంచి పెద్దతండ గ్రామం వరకు 1 కోటి అంచనాతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, శంభుని గూడెం టీడబ్ల్యూ రోడ్డు నుంచి రాజు తండా వయ గోప్యా తండ వరకు బీటీ రోడ్డు 1కోటి 60 లక్షల అంచనాతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన, మండలంలోని గంగారం గ్రామపంచాయతీ సంపత్ నగర్ గ్రామంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు ఏర్పాటుచేసిన నూతన పార్టీ జెండాను ఆవిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంతలోకి ఆర్టీసీ బస్సులు రాకుండా నిలిపేయాలని నిరసన

నవతెలంగాణ-అశ్వాపురం



మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న సంత మార్గం గుండా మణుగూరు ఆర్టీసీ డిపో బస్సులు తిరగకుండా నిలిపివేయాలని సోమవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాదే కేశవరెడ్డి, సర్పంచ్ బానోత్ శారద నిరసన వ్యక్తం చేశారు. మణుగూరు డిపో అధికారులు బస్టాండ్‌లోకి బస్సులు వెళ్లాలన్న ఆదేశాల మేరకు కండక్టర్ బస్సు స్టాండ్ వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా వ్యాపారులతో కలిసి వీరు రోడ్డుపై బైఠాయించి సుమారు గంటపాటు ఆందో ళన నిర్వహించారు. అనంతరం అక్కడికి చేరుకున్న పోలీసులు వారికి సర్దిచెప్పి నిరసనను విరమించి ఇకపై మరల బస్సులు రాకుండా చర్యలు చేపడతామని తెలిపారు. నిరసనకు వ్యాపారుల నుండి పెద్ద ఎత్తున మద్దతు లభించింది.

11 నుంచి జరగనున్న బ్రహ్మోత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం

నవతెలంగాణ-దమ్మపేట



దమ్మపేట మండలంలోని నాచారం గ్రామంలో వేంచేసిన శ్రీశ్రీశ్రీ లక్ష్మి నరసింహాస్వామి జగదాంబసమేత జయలింగేశ్వరస్వామి వార్ల దేవాలయంలో ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని రాష్ట్ర గవర్నర్ ప్రయివేట్ కార్యదర్శి భవాని శంకర్ కలెక్టర్ అనుదీప్‌కు సోమవారం ఐడీఓసీ కార్యాలయం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. వార్షిక బ్రహ్మోత్సవాల కార్యక్రమాలను విశ్వకళ్యాణార్థమై సర్వజనుల రక్షణ కోసం అత్యంత వైభవోపేతంగా జరుగుతుందని, అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆయన సూచించారు.

మహిళలకు ఆదర్శం విమల రణదివే జీవితం

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నబి

నవతెలంగాణ-ఇల్లందు



నేటి మహిళలకు విమల రణదివే జీవితం ఆదర్శమని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నబి అన్నారు. సోమవారం ఏలూరు భవన్లో సోమవారం విమల రణదివే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జీవితాంతం సామ్రాజ్యవాద వ్యతిరేకిగా నిలబడ్డారని అన్నారు. పేదలతో, కార్మిక వర్గంతో సంఘీభావాన్ని పెంచుకుని కమ్యూనిస్టుగా మారారు. తన తోబుట్టువులను పోషించటానికి పనిలో చేరారు. కమ్యూనిస్టయిన బీటి, రణదీవెను పెళ్ళి చేసుకున్న రోజునే ఆయన అండర్గ్రౌండ్‌లోకి వెళ్ళారు. ఎమర్జెన్సీతో పాటు అనేక సంవత్సరాలు అండర్ గ్రౌండ్‌లో గడిపారన్నారు. తన కుటుంబ పోషణ కోసం కొద్ది కాలం పాటు సినిమాల్లో నటించారన్నారు. ముంబాయి కార్మిక వర్గాన్ని సంఘటితం చేయడంలో కృషి చేశారు. సిఐటియు నాయకత్వంలో మహిళా ప్రాతినిధ్యం పెంపు కోసం ఆమె పోరాడారు. ఈ కార్యక్రమంలో కుమారి, లక్ష్మీ సలేంద్ర, ఉమాదేవి, స్వరూప, మంజుల, కోటేశ్వరి, మౌనిక, రామ్బాయి, రాజయ్య, బిక్కులాల్, నాగేశ్వరరావు, వెంకన్న అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు మహ్మద్ రజబ్ అలీ

- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా

నవతెలంగాణ-కొత్తగూడెం

ఆదర్శ కమ్యూనిస్టు, ప్రజానాయకుడు మహ్మద్ రజబ్అలీ అని, ఆయన సిద్ధాంతాలను సాధించడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళిఅని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా అన్నారు. సీపీఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌లో సోమవారం మహ్మద్ రజబ్ అలీ వర్ధంతిని నిర్వహించారు. తొలుత రజబ్ అలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. అనంతరం సాబీర్ పాష మాట్లాడుతూ రజబ్ అలీ తన కుటుంబం కంటే పోరాటానికే ఎక్కువ ప్రాధాన్యమిచ్చారని తెలిపారు. సుజాత నగర్ ఎమ్మెల్యేగా సుధీర్గకాలం పనిచేసి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతోపాటు అన్ని వర్గాల ప్రజలకు, బడుగు బలహీన వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ వారిలో ఒక వ్యక్తిగా మెలిగిన వ్యక్తి రజబ్ ఆలీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వై.శ్రీనివాసరెడ్డి, జిల్లా సమితి సభ్యులు దమ్మాలపాటి శేషయ్య, నాయకులు లక్ష్మి నారాయణ, విజయలక్ష్మి సోమయ్య, కారం రమేష్, యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి ఘనంగా జరుపుకుందాం

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

బీఆర్ అంబేద్కర్ 132వ జయంతిని ఘనంగా జరుపుకుందామని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జోగా రాంబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రములో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం పునాదిగా కలిగిన సమాజమే అంబేద్కర్ ఆశయమని అన్నారు. మర్కోడు గ్రామంలో 14వ తేదీన జరుగనున్న మహోన్నత వ్యక్తి జయంతి వేడుకలకు ప్రజలు అధిక సంఖ్యలో కదలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అక్షర కాలేజి ప్రిన్సిపాల్ కీసరి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బీటీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

నవతెలంగాణ-ఇల్లందు



మండలంలోని ఆజాద్ నగర్, ఇంద్రానగర్ గ్రామం వరకు ఎస్టీ ఎస్డీఎఫ్ నిధుల నుండి మంజూరైన రూ.కోటి 20 లక్షల నిధులతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు, ఆజాద్ నగర్‌లోని 3 డీఎంఎఫ్ నిధులతో అంతర్గత సీసీ రోడ్లకు ఎమ్మెల్యే హరిప్రియ హరి సింగ్ నాయక్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇల్లందు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించిన గ్రామపంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని, ఉమ్మడి రాష్ట్రంలో పాలకుల చేతుల్లో నిరాదరణకు నిర్లక్ష్యానికి గురైన గ్రామాలు నేడు బీఆర్ఎస్ ప్రభుత్వం పాలనలో క్రమక్రమంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ దిండిగల రాజేందర్, జిల్లా అధికార ప్రతినిధి పులిగండ్ల మాధవరావు, వైస్ ఎంపీపీ ప్రమోద్ కుమార్, డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మెన్ మెట్ల కృష్ణ, ప్రభుత్వ ఉన్నత అధికారులు, సీడీపీఓ ప్రసన్న, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ హీరాలాల్, సెక్రెటరీ, నీలిమ రెడ్డి పాల్గొన్నారు.

సిఫారసుల లేఖల పరిష్కారంపై నివేదికలు ఇవ్వాలి

- కలెక్టర్ అనుదీప్

నవతెలంగాణ-పాల్వంచ



ప్రజా ప్రతినిధుల నుండి వచ్చిన సిఫారసు లేఖల పరిష్కారంపై నివేదికలు అందజేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ తెలిపారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయపు సమావేశపు హాలులో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి వినతులు స్వీకరించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు సిఫారసు చేసిన 56 లస్త్రఖలు పెండింగ్‌లో ఉన్నాయని ఆయా శాఖల అధికారులు బుధవారం వరకు పరిష్కరించి నివేదికలు అందజేయాలని అన్నారు. ఆయా శాఖల జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. సమస్య పరిష్కరించాలని కోరుతూ ప్రజావాణిలో చేసిన ధరఖాస్తులు కొన్ని సుజాతనగర్ మండలానికి చెందిన తొకచిచ్చు సీతరామరాజు సర్వే నెం.1497/ఈ/ఇ/2లో 2.90 ఎకరాల భూమి ఉన్నదని అట్టి భూమికి సంబంధించిన మాకు పూర్తి అధికారాలు ఉన్నాయని భూమి తక్కువగా ఉన్నట్లు తమకు అనుమానాలున్నాయని సర్వే చేపించాలని చేసిన ధరఖాస్తును తగు చర్యలు కొరకు సుజాతనగర్ తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు. భూర్గంపాడు మండలానికి చెందని వంగూరి అరుణ, వంగూరి కామేశ్వరి డిగ్రీ వరకు చదువకున్నామని ఉద్యోగాలు లేక కుటుంబ పోషణ కష్టంగా ఉన్నదని తమకు దళితబంధు పథకం మంజూరు చేపించాలని చేసిన ధరఖాస్తును తగు చర్యలు నిమిత్తం ఎస్సీ కార్పొరేషన్ ఏడీకి ఎండార్స్ చేశారు. చుంచుపట్టి మండలం రాంనగర్ గ్రామానికి చెందిన దామెర్ల వేణుమాధవ్ హైదరాబాద్ నందలి నల్లమల్లారెడ్డి గట్‌కేసర్ భూదరాబాద్ ఇంజనీరింగ్ ఎక్ట్రికల్‌లో ఇంజనీరింగ్‌లో చేరానని కరోనా వల్ల తరగతులు నిర్వహణ సరిగా లేకపోవడం తెలుగు మీడియం నుండి వచ్చిన తాను ఇంగ్లీషు మీడియంలో విద్యను అభ్యసించలూకపోవడం వల్ల మొదటి సంవత్సరం అన్ని సబ్జెక్టుల్లో ఫెయిల్ అయి ఇంజనీరింగ్ విద్య అభ్యసించలేనని తన సర్టిఫికేట్లు ఇప్పించాలని కొరగా మిగిలిన మూడు సంవత్సరాల ఫీజులు చెల్లించాలని చెప్పారని ఫీజులు చెల్లించలేని అర్థిక పరిస్థితుల్లో ఉన్నామని తన సర్టిఫికేట్లు ఇప్పించాలని చేసిన ధరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యలు కొరకు కలెక్టరేట్ ఒఎస్డీకి ఎండార్స్ చేశారు. పాల్వంచ మండలం మంచికంటినగర్‌కు చెందిన నూనావత్ శ్రీరాం మంచికంటినగర్ ముత్యాలమ్మ గుడి దగ్గర నాలుగు సంవత్సరాల నుండి నివాసం ఉంటున్నానని విద్యుత్ నీటి సైకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని కావునా విద్యుత్ నీటి సౌకర్యం కల్పించాలని చేసిన ధరఖాస్తును తగు చర్యలు నిమిత్తం విద్యుత్ శాఖ అధికారులకు ఎండార్స్ చేశారు. అన్నపురెడ్డి పల్లి మండలం తొల్లిపంపు గ్రామానికి చెందిన వసంతరావు మరికొంతరు గిరిజన రైతులు గత 20 సంవత్సరాలుగా ఆర్ఓఎఫ్ఆర్ భూముల్లో వ్యవసాయం సాగు చేస్తున్నామని నీటి సౌకర్యం కోసం సోలార్ ద్వారా బోర్లు వేసుకున్నామని అట్టి పట్టా కలిగిన భూముల్లో ఆయిల్ ఫామ్ సాగు చేయుటకు ప్రభుత్వ రాయితీతో అయిల్‌ఫామ్ మొక్కలు ఇప్పంచాలని చేసిన ధరఖాస్తును తగు చర్యల నిమిత్తం ఉద్యాన అధికారికి ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖలు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు డిపోలో ఉచిత కంటి వెలుగు

నవతెలంగాణ-మణుగూరు

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మణుగూరు డిపోలో ఉచిత కంటి వెలుగు కార్యక్రమాన్ని డిపో మేనేజర్ స్వామి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా అందిసున్న ఉచిత కంటి వెలుగు కార్యక్రమాన్ని డిపో సిబ్బంది, కుటుంబ సభ్యుల సౌకర్యార్థం డిపో ఆవరణలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొని కంటి పరీక్షలు నిర్ధారించుకోవచ్చు అని అన్నారు. ఏదైనా సమస్య ఉన్నట్లు వైద్య సిబ్బంది గుర్తించిన కళ్ళజోళ్ళు వెంటనే అందజేయడం జరుగుతుందన్నారు. కార్మికులందరూ తమ కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ కనకదుర్గ, సూపరిండెంట్ మెకానికల్ మూర్తి, ఆర్టీసీ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తిప్పన సిద్దులకు ఘనంగా సన్మానం

నవతెలంగాణ-భద్రాచలం



భద్రాచలం శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయం చైర్మన్ మామిడి పుల్లారావు, ఎస్.కే జానీ ఆధ్వర్యంలో సైనిక బోర్డ్ మెంబర్‌గా నియమితులైన తిప్పన సిద్దులుకి ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం డైరెక్టర్ చారి, పట్టణ బీఆర్ఎస్ మండల అధ్యక్షులు అరికెల తిరుపతి, మాజీ ఇంచార్జ్ మానే రామకృష్ణ, బల్ల రాంబాబు, తాళ్ల రవికుమార్, చాట్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై సమరశీల పోరాటమే పద్మకిచ్చే నివాళి

- పద్మ మరణం కార్మిక ఉద్యమానికి తీరని లోటు
- సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కాసాని, రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే.రమేష్

నవతెలంగాణ-కొత్తగూడెం



కార్మిక సమస్యలపై సమరశీల పోరాటమే పద్మకి ఇచ్చే ఘనమైన నివాళి అని సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కాసాని ఐలయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే.రమేష్ అన్నారు. సీపీఐ(ఎం) సీనియర్ నాయకురాలు వద్ది పద్మ సంతాప సభ రామవరం, మేషన్ కాలనీ పద్మ ఇంటి వద్ద పార్టీ పట్టణ కార్యదర్శి లిక్కి బాలరాజు అధ్యక్షతన జరిగింది. ముందుగా పద్మ చిత్ర పటానికి కాసాని, ఏజే.రమేష్‌లు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మిక సమస్యలపై జరిగిన పోరాటాల్లో వద్ది పద్మ చురుకైన పాత్ర పోషించిందన్నారు. ప్రభుత్వ హాస్పిటల్‌లో కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ యూనియన్ ఏర్పాటు చేయడంలో కామ్రేడ్ పద్మ కీలక పాత్ర పోషించారన్నారు. యూనియన్ వ్యవస్థాపకుల్లో ఒకరిగా కార్మికుల సమస్యలపై జరిగిన ప్రతి పోరాటంలో పద్మ పాల్గొన్నదని తెలిపారు. రూ.400లు ఉన్న ప్రభుత్వ హాస్పిటల్ కార్మికుల జీతాలు రూ.12 వేల వరకు పోరాడి సాధించిన విజయంలో పద్మ పాత్ర ప్రధానమైనదని అన్నారు. కార్మికులను సమస్యలపై సమీకరించే బాధ్యత పద్మ ఎపుడూ తానే చూసేదనీ, తనకు తెలిసిన జ్ఞానంతో కార్మికుల హక్కుల కోసం పోరాటం తప్ప వేరే మార్గం లేదంటూ వారిని చైతన్య పరుస్తూ పోరాటాల్లో తీసుకువచ్చే కృషి చేసిందన్నారు. తాను నమ్మిన ఎర్రజెండాను తుది శ్వాస వరకు విడవకుండా నిజాయితీ కలిగిన కమ్యునిస్టుగా పద్మ తన జీవితాన్ని కొనసాగించిందని నివాళి అర్పించారు. పద్మ మరణం కార్మిక ఉద్యమానికి తీరని లోటన్నారు. కేవలం హాస్పిటల్లో కార్మికుల జీతాల కోసం జరిగే పోరాటమే కాకుండా పేదలు కోసం ఇళ్ల స్థలాల పోరాటం, ఇతర కార్మికులు చేసిన పోరాటాల్లో కూడా తాను ప్రత్యక్ష భాగస్వామ్యం అయ్యేదని కార్మికుల పోరాటంలో తను సంఘీభావంగా పాల్గొనేదిదని గుర్తుచేశారు. యూనియన్‌ను ఐక్యంగా నడిపించడంలో పద్మ కీలక పాత్ర పోషించిందని, అనేక ప్రలోభాలు కల్పించిన ఒత్తిళ్లకు గురిచేసిన బెదరకుండా యూనియన్ విచ్చిన్నం కాకుండా కాపాడిన ఘనత పద్మకే దక్కుతుందని నేతలు కొనియాడారు. తను ఏమి చదువక పోయినా ప్రశ్నించే తత్వాన్ని అలవర్చు కున్నదని, ఈ పద్ధతి అధికారులు, కాంట్రాక్టర్ల మెడలు వంచడానికి ఉపయోగించిందన్నారు. కార్మిక పోరాటాలకు పద్మ లేని లోటు తీరనిదని, కార్మికుల సమస్యలపై సమరశీల పోరాటమే పద్మకి ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. పద్మ కుటుంబానికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్, పట్టణ కమిటీ సభ్యులు సందకూరి లక్ష్మి, నందిపాటి రమేష్, భాస్కర్, ఆది, శివారెడ్డి, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వాపును చూసి బలుపు అన్నట్లుగా ప్రవర్తించడం హాస్యాస్పదం

- భూ కబ్జాదారులు ఎవరో బహిరంగ చర్చకు సిద్ధం కావాలి
- ఖబర్దార్ పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి
- విలేకరుల సమావేశంలో హరిప్రియ

నవతెలంగాణ-ఇల్లందు



ప్రజా బలం ఉందని వాపును చూసి బలుపు అన్నట్లుగా మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జడ్పీ చైర్మన్ కోరం కనకయ్యలు ప్రవర్తించడం హాస్యాస్పదమని ఎమ్మెల్యే హరిప్రియ విమర్శించారు. క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భూకబ్జాల పేరుతో దందాలు నడుస్తున్నాయని మాట్లాడుతున్న కోరం కనకయ్య భూకబ్జాల విషయంలో ఏదైతే మాట్లాడుతున్నారో అది ఇల్లెందు గడ్డమీదికి వచ్చి మాట్లాడడానికి సిద్ధంగా ఉన్నారాని ప్రశ్నించారు. బహిరంగ చర్చకు రావాలని సవాలు విసిరారు. సీఎం కేసీఆర్, బీఎస్ఆర్ పార్టీ మీద అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు. ఆనాడు సీఎం కేసీఆర్‌ను దేవుడు అని పొగిడి ఈరోజు గజిని అంటూ అపరిచితుడు లాగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. ఓడిపోయిన కోరం కనకయ్యని జడ్పీ చైర్మన్ పదవి ఇచ్చి గౌరవించిన సీఎం కేసీఆర్‌ను విమర్శిస్తున్న కోరం కనకయ్య ఏమి ఆశించి మీరు పొంగులేటితో తిరుగుతున్నారని అన్నారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఇల్లందు సమస్యల పట్ల ఏ రోజు అసెంబ్లీలో మాట్లాడలేని కోరం ఈ రోజు సభలలో తెలంగాణ ప్రభుత్వాన్ని విమర్శించడం హాస్యాస్పదమన్నారు. ఒకసారి ఆత్మ విమర్శన చేసుకున్న తర్వాత ప్రజాక్షేత్రంలోకి రావాలని సవాల్ విసిరారు. మాజీ మంత్రిగా కొనసాగిన జూపల్లి కృష్ణారావు ఆనాడు ముఖ్యమంత్రి కేసీఆర్‌ని పొగుడుతూ చంద్రబాబు నాయుడు, రోశయ్య కంటే కూడా సీఎం కేసీఆర్ దేవుడు అని అన్నది మీరు కాదాని ప్రశ్నించారు.

కోరం లక్ష్మీ పేరు మీద భూకబ్జాలు

కోయగూడెం ఓసీ వద్ద కోరం లక్ష్మీ పేరు మీద భూకబ్జాలు చేసింది నిజం కాదా..? అని ప్రశ్నించారు. ఏవైతే మీరు చేస్తున్నారో ఆత్మీయ పలకరింపుల పేరుతో ప్రతి ఇంటిని తడుతున్న మీరు ఆ ఇంట్లో రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అందుతున్నాయా అని అడగాలని అడిగిన తర్వాత బహిరంగ చర్చకు రావడానికి సిద్ధమాని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, జిల్లా అధికార ప్రతినిధి పులిగండ్ల మాధవరావు, కీలక నేతలు పాల్గొన్నారు.



పేద ప్రజల ఆత్మబంధువు కేసీఆర్ : వనమా

నవతెలంగాణ-పాల్వంచ

రాష్ట్రంలోని పేద ప్రజల ఆరాధ్యుడు, ఆత్మబంధువు సీఎం కేసీఆర్ అని కొత్తగూడెం నియోజకవర్గం శాసనసభ్యులు వనమా వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం పాత పాల్వంచలోని వనమా స్వగృహంలో పాల్వంచ, కొత్తగూడెం, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి మండలాలకు చెందిన 31 మంది పేద లబ్దిదారులకు రూ.26 లక్షల 25 వేల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను వనమా అందజేశారు. ఈ సందర్భంగా వనమా మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుండి వృద్ధుల వరకు పేదవారి సంక్షేమమే ధ్యేయంగా కేసీఆర్ పరిపాలన సాగిస్తున్నారన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల, జడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, ఎంపీపీ సరస్వతి, బీఆర్ఎస్ నాయకులు ఎంఏ రజాక్, నరేందర్, వీర్రాజు, కిరణ్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు పెండింగ్ అక్రిడిటేషన్లు, ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలి

- టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

నవతెలంగాణ-దుమ్ముగూడెం



ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో వర్కింగ్ జర్నలిస్టులుగా పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ అక్రిడిటేషన్ కార్డులతో పాటు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పూదోట సూరిబాబు, గుండెబోయిన వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్‌ని కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలలో రెండవ విడత అక్రిడిటేషన్ కార్డులు జారీ చేశారని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జాప్యం జరుగుతుందని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లా డివిజన్ మండల కేంద్రాలలో పనిచేస్తున్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులకు ఇంటి స్థలాలు కేటాయించి వారికి హక్కు పత్రాలు అందజేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. దీంతో సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ఆన్లైన్ చేసుకున్న ప్రతి జర్నలిస్టుకు త్వరలో అక్రిడిటేషన్ కార్డులు అందజేస్తామని ఇంటి స్థలాల విషయం పరిశీలన ఉన్నట్లు ఆయన తెలియజేశారు. కలెక్టర్‌ని కలిసి వినతి పత్రం అందజేసిన వారిలో యూనియన్ జిల్లా నాయకులు వెలమ రాజేందర్, పర్సబోయిన రాధా కృష్ణ, ములకలపల్లి గోపీనాథ్, గోడ్డు గొర్ల నాగరాజు, రామదాసు రబ్బాని లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా చైతన్య యాత్ర గోడ పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-భద్రాచల

ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా చైతన్య యాత్రను జయప్రదం చేయాలని సీపీఐ భద్రాచలం పట్టణ కార్యదర్శి సునీల్ కోరారు. సోమవారం ప్రజా చైతన్య యాత్ర ప్రచార పోస్టర్లను స్థానిక పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని విమర్శించారు. ఏప్రిల్ 14వ తారీకు సాయంత్రం 5 గంటలకు స్థానిక అంబేద్కర్ సెంటర్లో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మా రెడ్డి శివాజీ, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామీణ ఉపాధిహామీ, అటవీ హక్కుల చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి

- బికెఎంయు జిల్లా జిల్లా నేతలు రేసు ఎల్లయ్య, యార్లగడ్డ భాస్కర్ రావు
- కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-కొత్తగూడెం

వ్యవసాయరంగ కార్మికుల సమగ్ర సంక్షేమ చట్టం అమలుకోసం, రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన మూడు ఎకరాల భూ పంపిణీకోసం వ్యవసాయరంగ కార్మికులు ఉద్యమ బాట పట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) భద్రాద్రి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యార్లగడ్డ భాస్కర్ రావు, అధ్యక్షులు రేసు ఎల్లయ్య పిలుపునిచ్చారు. బికెఎంయు రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు, పేదలకు ఇచ్చిన హామీలు ఏండ్లు గడుస్తున్నా అమలుకు నోచుకోవడం లేదని, ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించడంలో కేసీఆర్ దిట్ట అని విమర్శించారు. బికెఎంయు దేశవ్యాప్తంగా చేసిన పోరాటాల ఫలితంగానే గ్రామీణ ఉపాదిహామీ పథకం, అటవీ హక్కుల చట్టం సాధించుకున్నామని అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు. అనాదిగా గిరిజనులు, గిరిజనేతర పేదలు సాగుచేసుకుంటున్న పోడు రైతులపై ప్రభుత్వం కక్ష కట్టిందని, 2005 అటవీహక్కుల చట్టం ప్రకారం పోడు సాగుదారులకు పట్టాలు మంజూరు చేయాల్సిన ప్రభుత్వం పేదల సాగులో ఉన్న భూములను లాక్కుంటూ బతుకు లాగేసుకుంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు వీసంశెట్టి పూర్ణచందర్ రావు, వాగబోయిన రమేష్, వజ్జ పగడయ్య, ఇమ్మానియేలు, కత్తుల నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.





న్యాయం జరిగినట్టేనా..?

"మచ్చల బట్టలు, బూట్లు, నెత్తికి టోపీ, చేతిలో తుపాకి ఉన్న వారు మాపై అఘాయిత్యానికి పాల్పడ్డారు". ఇది తప్ప మరో విషయం చెప్పలేని అమాయకులు. అడవిని నమ్ముకు జీవిస్తున్న ఆదివాసులు. ప్రకృతిని ఆరాధిస్తూ అన్యాయం చేయటం తెలియని గిరిజన బిడ్డలు. "సంతకు వెళితే ఇప్పటికీ మమ్మల్ని పోలీసుల పెళ్ళాలనే అంటున్నారు" అంటూ ఆవేదన వ్యక్తం చేసే అడవి బిడ్డలు. వారే పోలీసుల చేతిలో అత్యంత దారుణంగా లైంగిక దాడికి గురైన వాకపల్లి ఆదివాసీ మహిళలు. న్యాయం కోసం 16 ఏండ్లు పోట్లాడారు. మూడు రోజుల కిందట కోర్టు ఈ కేసులో తీర్పునిచ్చింది. ఇప్పటికైనా వారికి నిజంగా న్యాయం జరిగిందా..? ఇన్నేండ్లు వారు చేసిన పోరాటం ఫలించిందా..? అసలు ఈ కేసుకు సంబంధించిన వివరాలు, కోర్టు తీర్పు గురించి మహిళా సంఘాలు, అభ్యుదయ వాదులు ఏమంటున్నారో ఈరోజు మానవిలో తెలుసుకుందాం...

అది 2007 ఆగస్టు 20వ తేదీ. విశాఖ ఏజేన్సీ ప్రాంతం. వాకపల్లి గ్రామం. సరిగ్గా పొద్దు కూడా పొడవలేదు. సూర్యుడు ఉదయించనే లేదు. మగవారంతా తమ పసుపు పొలాల్లో పని కోసం వెళ్లారు. మహిళలు కొందరు ఇంట్లో వంట చేసుకుంటూ, మరి కొందరు నీళ్ల మోసుకొచ్చుకుంటున్నారు. అకస్మాత్తుగా 21 మంది గ్రేహౌండ్స్ పోలీసులు వచ్చి గ్రామంపై విరుచుకుపడ్డారు. 'మీరు మావోయిస్టులకు సహకరిస్తున్నారా" అంటూ పచ్చి బూతులు తిడుతూ, దౌర్జన్యంగా ఇళ్లల్లో దూరి వంటగదిలో ఉన్న మహిళలపై లైంగిక దాడులకు పాల్పడార్డురు. ఒక్కరు కాదు ఇద్దరు కాదు ముగ్గురు నలుగురు పోలీసులు కలిసి ఒక్కో మహిళపై దాడికి పాల్పడ్డారు. ఈ హఠాత్పరిణామానికి భయపడి పారిపోతున్న వాళ్లను, బహిర్భుమికి వెళ్లిన వాళ్లను, పచ్చి బాలింతలని కూడా చూడకుండా సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు.

కేసు నమోదు చేయలేదు

దాడికి పాల్పడిన పోలీసులు వెళ్ళిపోయిన తర్వాత బాధిత మహిళలంతా గుంపుగా చేరి రోధిస్తున్నారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ వారి వద్దకు వెళ్ళారు. ఆయన వెంటనే మహిళలను తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకుని జరిగిన విషయాన్ని చెప్పారు. కానీ పోలీసులు ఎటువంటి ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేయలేదు. అసలు దీన్ని ఓ కేసుగానే పరగణలోకి తీసుకోలేదు. దాంతో మహిళా సంఘాలు, అభ్యుదయ వాదులు, మానవ హక్కులవారు రంగంలోకి దిగారు. ఉదయం 11 గంటలు అయ్యే సరికి ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించింది. పత్రికా విలేకరులు, మహిళా సంఘాలు, ప్రజా సంఘాలు తీవ్రంగా స్పందించి బాధితుల పక్షం నిలబడి బాధితులతో పాటు అధికారులకు ఫిర్యాదులు చేశారు.

కుమిలి కుమిలి ఏడుస్తుంటే...

వాకపల్లి ఆదివాసీలపై జరిగిన అత్యంత దారుణమైన ఈ సంఘటన విషయం టీవీల ద్వారా బయట ప్రపంచానికి తెలిసింది. తమపై ఘోరమైన దాడి జరిగి కుమిలి కుమిలి ఏడుస్తున్న మహిళల గురించి అప్పటి రాష్ట్ర డీజీపీ బాసిత్ చాలా అవమానకరంగా మాట్లాడాడు. అప్పటి హోంమంత్రి జానారెడ్డి అయితే ఏకంగా అసలు అక్కడ ఏమీ జరగలేదని, ఇది అవాస్తవ మని ప్రకటించారు. అప్పటి విశాఖ జిల్లా ఎస్పీగా ఉన్న అంజన్ కుమార్ సబర్వాల్ ఇది మావోయిస్టుల నీచ ఎత్తుగడని అభివర్ణించారు. అప్పటి పాడేరు డిఎస్పి స్టాలిన్ మరీ దిగజారి అమాయక గిరిజన మహిళలను అడ్డుపెట్టుకొని మావోయిస్టులు తమపై అసత్య ప్రచారం చేస్తున్నారని మీడియా ద్వారా ప్రచారం చేశారు.

సరైన విచారణ చేయలేదు

నిజానికి ఈ సమాజంలో ఏ స్త్రీ తనపై లైంగిక దాడి జరిగిందని బయటకు చెప్పుకోలేదు. పైగా ఇలాంటి ఘటన జరిగిందని తెలిస్తే తమను తమ జాతి వెలివేస్తుందని తెలిసిన ఆదివాసీ మహిళలు అసలే చెప్పరు. అందులోనూ ఆదివాసి సంస్కృతిలో అబద్ధం ఆడడం అనేది ఉండదు. అలాంటి వారికి జరిగిన అన్యాయంపై సరియైన విచారణ లేకుండా, సాక్షాధారాలు లేకుండా చేసి, గ్రేహౌండ్ పోలీసులను కాపాడే ప్రయత్నం ప్రభుత్వం చేసింది. కనీసం పోలీసులను చట్టబద్ధంగా అరెస్టులు చేసి విచారణ కూడా చేయలేదు. సంఘటన జరిగినా వెంటనే కలెక్టర్ గానీ, ఏ ఇతర అధికారులు గానీ, స్థానిక పోలీసులు ఎవ్వరూ కూడా వాకపల్లి వెళ్లి స్థానికంగా జరిగిన సంఘటనపై ప్రాథమిక దర్యాప్తు కూడా జరపలేదు.

అన్యాయం జరిగింది వాస్తవం...

సంఘటన గురించి తెలుసుకున్న వెంటనే మానవ హక్కుల సంఘాలు, మహిళా సంఘాలు, అభ్యుదయ వాదులు బాధితులకు అండగా నిలిచారు. వారి అండతో 16 ఏండ్లుగా ఆ ఆదివాసీ మహిళలు అలుపెరుగక సుదీర్ఘ పోరాటం చేశారు. నిరాహార దీక్షలకు దిగారు. ఆర్థిక, రాజకీయ అండ లేకపోయినా, అక్షరం ముక్క తెలియకపోయినా తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడం కోసం పోరాడుతూనే ఉన్నారు. ఈ పోరాట ఫలితంగానే విశాఖ అదనపు కోర్టు మూడు రోజుల కిందట సంచన తీర్పును ప్రకటించింది. మహిళలకు అన్యాయం జరిగిన మాట వాస్తవమే. అయితే ఈ కేసులో విచారణ సరిగ్గా జరగలేదని, సరైన ఆధారాలు లభించని కారణంగా పోలీసులను విడిచి పెడుతున్నామని కోర్టు దోషులపై కేసు కొట్టివేసింది. అయితే దర్యాప్తు సరిగా చేయలని అధికారులపై చర్యలు తీసుకోవాలని, అలాగే ఆదివాసీలకు నష్టపరిహారం చెల్లించాలని తీర్పులో చెప్పింది. ఈ మొత్తం సంఘటనను గమనించినపుడు మొదటి నుండి ప్రభుత్వంలో పని చేస్తున్న గ్రేహౌండ్స్ పోలీసులను రక్షించే ప్రయత్నం ప్రభుత్వం చేస్తుందని స్పష్టంగా అర్థమవుతుంది.

ఇద్దరు చనిపోయారు...

లైంగిక దాడికి గురైన తర్వాత సుమారు వారం రోజుల పాటు ఆ మహిళలను భర్తలు ఇంట్లోకి రానీయలేదు. "మీరు పోలీసోళ్ళ భార్యలయ్యారు, ఇంట్లోకి రావొద్దు" అంటూ బయటే కూర్చోబెట్టారు. అన్ని రోజులూ అవమాన భారాన్ని అనుభవిస్తూ గంజి తాగుతూ బతికారు. కనీసం పిల్లలకు పాలు కూడా ఇవ్వనీయలేదు. వాళ్ళ సంప్రదాయం ప్రకారం శుద్ధి చేసిన తర్వాత వారిని ఇంట్లోకి రానిచ్చారు. అలాంటి మహిళలపై అసలు దాడే జరగలేదని అధికాలు ఎలా ప్రకటించారో అర్థం కాని విషయం. తర్వాత కాలంలో ఆ పదకొండు మంది మహిళల్లో ఒకరు ఒత్తిడిని భరించలేక చనిపోయారు. మరో మహిళ పాము కాటుతో చనిపోయారు. ఇక ఈ కేసులో అసలు ఎలాంటి దాడి జరగలేదు అని అప్పుడు అధికారులు, పోలీసులు ఇచ్చిన ప్రకటన తప్పు అని నిరూపించడానికి బాధితుల తరపున నిలబడిన లాయర్లు ఇన్నేండ్లు ఎంతో శ్రమించారు. ఇన్నేండ్లకు అక్కడ అన్యాయం జరిగిన మాట వాస్తవమని కనీసం కోర్టు అంగీకరించే విధంగా కృషి చేసిన లాయర్లకు మహిళా సంఘాలు అభినందలు తెలియజేస్తున్నారు.

- సలీమ



ఇప్పటి వరకు ప్రభుత్వం స్పందించలేదు

ఇంతకాలానికి బాధితులు చేసిన ఫిర్యాదును కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఇది ఆహ్వానించదగిన విషయం. అయితే ఈ కేసులో మూడు తీవ్రమైన పొరపాట్లు జరిగాయి. అందులో మొదటిది ప్రభుత్వం, విచారణ అధికారులు ముందుగానే తీర్పు చెప్పేశారు. మావోయిస్టులు తప్పించుకోవడానికి గిరిజన మహిళలను ఉపయోగించుకున్నారని వారే నిర్ణయించేశారు. అలాగు పోలీసులే దాడికి పాల్పడితే విచారణ కోసం తిరిగి పోలీసులనే కేటాయించడం మరో తప్పు. మరో ముఖ్యమైనది ప్రాథమిక సాక్షాధారాలు. ఫిర్యాదు చేసిన వెంటనే దాడికి గురైన వారిని హాస్పిటల్‌కు పంపించాలి. అవసరమరైన సాక్ష్యాలను అంటే వారి బట్టలను సేకరించాలి. అక్కడున్న గుర్తులను సేకరించాలి. ఇవేవీ చేయకపోగా వాటిని కావాలని నాశనం చేశారు. సాక్ష్యాలను చెరిపేసే ప్రయత్నం చేశారు. ఇలా సాక్షాలు దొరక్కుండా చేశారు అనే దానిపైన సంపూర్ణంగా విచారణ జరిపి వాళ్ళకు శిక్ష పడితేనే బాధిత మహిళలకు న్యాయం జరిగినట్టు. అయితే ప్రభుత్వ చేసిన తప్పును సరిదిద్దు కోవడానికి వెంటనే వారికి పునరావాసం కల్పించాలి. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం స్పందించలేదు. అంటే గత ప్రభుత్వాల దారిలోనే ఈ ప్రభుత్వం కూడా నడుస్తుంది. ఆ మహిళలకు అన్యాయమే చేస్తుంది.

- డి.రమాదేవి,
ఐద్వా ఏపీ రాష్ట్ర కార్యదర్శి



కాఫ్ పంచాయితీలా ఉంది...

దళిత, ఆదివాసీలకు అన్యాయం జరిగిన ప్రతి సారీ ఎలాంటి తీర్పు ఇస్తారో ఇప్పుడూ అలాంటి తీర్పే ఇచ్చారు. అది రావడానికి కూడా ఎన్నో ఏండ్లు పడుతుంది. నేరం ఉన్నప్పుడు శిక్ష ఉంటుంది. కానీ ఇక్కడ నేరం జరిగిందంటున్నారు కానీ శిక్ష మాత్రం పడలేదు. కారంచెడు నుండి చూసుకుంటే అన్ని కేసుల్లో పరిస్థితి ఇలాగే ఉంది. నష్టపరిహారం ఇస్తున్నావంటే నేరం జరిగినట్టే కదా, అప్పుడు శిక్ష ఎందుకు ఉండదు అనేది నా ప్రశ్న. విచారణ జరగాల్సిన రీతిలో జరగలేదు. చాలా మంది వాళ్ళు గుర్తుపట్టే పరిస్థితుల్లో లేరు అంటున్నారు. గుర్తు పట్టినంత మాత్రాన శిక్ష వేస్తున్నారా..? కారంచెడులో నేరం చేసిన వారిని గుర్తు పట్టారు. మరి వారికి శిక్ష పడిందా.? ఆయేషా మీర కేసులో ఏం చేశారు. నేరం చేసిన వారు ఎవరో తెలుసు, ఆ కేసులో ఏం చేశారు. ఇక బిల్కిస్‌బాను నేరస్థులను వదిలేశారు. దీన్ని బట్టి భారతదేశంలో మహిళలపై లైంగిక దాడులు జరిగితే శిక్షలు పడే పరిస్థితులు లేవు.

- సూరేపల్లి సుజాత





కోర్టుల్లో కేసులు వేస్తేనే ..
పాస్ కాని బిల్లులు

(మొదటిపేజి తరువాయి)

సిద్దిపేట జిల్లా కుకునూర్‌పల్లి మండలం మంగోల్‌లో నిర్మించిన వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. కేంద్రం స్వయం ప్రతిపత్తి గల వ్యవస్థలను రాజకీయంగా వాడుకుంటున్నదని విమర్శించారు. అసెంబ్లీ పాస్ చేసిన బిల్లులను గవర్నర్ అమోదించకుండా 7 నెలలుగా పెండింగ్‌లో పెట్టారన్నారు. దీని వెనుక రాజకీయం ఏంటనేది అందరికి తెలుసని.. కోర్టులకు వెళ్లి కేసులు వేస్తే తప్ప బిల్లులు పాస్ కానీ పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. సుప్రీంకోర్టులో కేసు వేస్తే ఈరోజు రెండు, మూడు బిల్లులు పాస్ చేశారని.. రాష్ట్ర ప్రగతిని బీజేపీ అడ్డుకునేందుకు ఎన్ని కుట్రలు చేస్తోందో దీన్ని బట్టే అర్థమవుతోందన్నారు. దేశంలో తొలిసారిగా ఫారెస్ట్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే ఆ బిల్లును అడ్డుకుని, రాష్ట్రపతి పరిశీలనకు పంపారన్నారు. ఇది రాష్ట్ర ప్రగతిని అడ్డుకోవడం కాదా అని ప్రశ్నించారు. అలాగే కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా ఉద్యోగాలు ఇస్తామంటే.. 7 నెలలు ఆపి ఇప్పుడు రాష్ట్రపతి పరిశీలనకు పంపడం ఏంటని ప్రశ్నించారు. ఇక్కడి పిల్లలకు చదువులు చెప్పే ప్రొఫెసర్లు వద్దా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని యూనివర్సిటీలకు కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు బీహార్, జార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో 1961 నుంచే ఉన్నదని.. ఇక్కడ మాత్రం ఇలా చేయడం సబబేనా అన్నారు. గవర్నర్ రాష్ట్ర ప్రగతికి సహకరించడం మాని మోకాళ్లడ్డు పెట్టడం సరికాదన్నారు. తెలంగాణ ప్రజలు సరైన సమయంలో కేంద్రానికి తగిన గుణపాఠం చెబుతారని స్పష్టంచేశారు. కాగా, మూడు బిల్లులను ఆమోదించడం పట్ల గవర్నర్‌కు మంత్రులు ధన్యవాదాలు తెలిపారు.

వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలి
సీసీఎల్ఏ నవీన్‌మిట్టల్‌కు వీఆర్ఏ జేఏసీ వినతి

నవతెలంగాణ–హైదరాబాద్‌బ్యూరో

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని వీఆర్ఏల జేఏసీ కోరింది. ఈ మేరకు భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయంలో సీసీఎల్ఏ, రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్‌ను కలిసి వీఆర్ఏల పేస్కేలు, క్రమబద్ధీకరణ, పదోన్నతులు, వారసత్వ ఉద్యోగాలు, సమ్మె కాలానికి వేతనం వంటి తదితర అంశాలపైన వీఆర్ఏ జేఏసీ చైర్మెన్ ఎం.రాజయ్య, కో–కన్వీనర్స్ వంగూరు రాములు, కె.మాధవ్, వెంకటేష్‌యాదవ్, ఎస్కే.రఫీ వినతి పత్రం అందజేశారు. సీసీఎల్ఏ స్పందిస్తూ వీఆర్ఏల పేస్కేలు, ఇతర ముఖ్యమైన అంశాలన్నింటినీ సీఎం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సీఎం సారూ.. పర్మినెంట్ చేయండి..

రాష్ట్ర సర్కారు అలా చేయలేదు.

ఔట్‌సోర్సింగ్ జేపీఎస్‌ల పరిస్థితి మరీ దారుణం

పంచాయతీ కార్యదర్శులు రిటైర్డ్ అయినా, పంచాయతీరాజ్ జూనియర్ కార్యదర్శులు వివిధ కారణాలతో ఉద్యోగాలు మానేసినా 2019 నోటిఫికేషన్ మెరిట్ లిస్టులో ఉన్నవారిని రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్నది.

మొదటి మూడు మెరిట్ లిస్టుల ద్వారా ఎంపిక చేసిన వారికి వేతనం రూ. 28,719 అందుతున్నది. ఆ తర్వాత మెరిట్ లిస్టు ద్వారా ఎంపికైన వారిని మాత్రం ఏజెన్సీల ద్వారా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా నియమిస్తున్నారు. ఇలా పనిచేస్తున్నవారు రాష్ట్రంలో 1500 మంది వరకు ఉన్నారు. వీరికి మాత్రం ఒక్కో జిల్లాల్లో ఒక్కో విధంగా వేతనం అందుతున్నది. గరిష్ఠంగా రూ.15వేలు అందుతుండగా..కొన్ని జిల్లాల్లో అయితే రూ.11 వేలు మాత్రమే ఇస్తున్న దుస్థితి నెలకొంది. ఒకే ఎంట్రెన్స్ ద్వారా అర్హత సాధించిన వారికి వేర్వేరుగా వేతనాలు ఇవ్వడంపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి.

పెండింగ్‌లో వేతనాలు..ఆదుకునేటోళ్లు లేరు..

రాష్ట్ర సర్కారు జేపీఎస్‌లకు వేతనాలను కూడా సకాలంలో ఇవ్వడంలేదు. ఫిబ్రవరి, మార్చి నెల వేతనాలు ఇప్పటిదాకా జేపీఎస్‌ల చేతికి అందలేదు. 'మూడు, నాలుగు నెలలకోసారి వేతనాలు ఇస్తే ఎలా బతకాలి? పొద్దుగాల ఏడు గంటలలోపే పంచాయతీలో పని ప్రదేశం నుంచి ఫొటో తీసి ఉన్నతాధికారులకు ఫొటో పెట్టాలి. ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా పొద్దుగాల ఏడుగంటలకు వచ్చి సాయంత్రం ఆరేడు గంటల దాకా పనిచేస్తున్నారా? గొడ్డుచాకిరీ చేస్తున్నాం' అని నల్లగొండ జిల్లాకు చెందిన ఓ జేపీఎస్ తన ఆవేదనను వ్యక్తపరిచాడు. కొంతమంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు అధిక పని భారాన్ని భరించలేక తమ ఉద్యోగానికి రాజీనామా చేసిపోతున్నారు. మరికొంతమంది విధి నిర్వహణలో తమ ప్రాణాలను కోల్పోతున్నారు. గుండెపోటు, గ్రామ పంచాయతీ నుంచి మండల కేంద్రాలకు, ఇండ్లకు వెళ్లే క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇప్పటిదాకా దాదాపు 30 మంది జేపీఎస్‌లు చనిపోయారు. 50 మందిదాకా గాయపడ్డారు. వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం సహకారం పెద్దగా లభించడంలేదు. జేపీఎస్‌లే తమ జీతాల్లోంచి తలా వెయ్యి, రెండు వేల రూపాయలు ఇచ్చి బాధిత కుటుంబాలకు కొంత ఆసరాగా నిలుస్తున్నారు.

జేపీఎస్‌లను క్రమబద్ధీకరించాలి
గౌరినేని రాజేశ్వర్‌రావు, తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు

గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాం. ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందేలా చూస్తున్నాం. హరితహారం, శానిటేషన్, జనన, మరణ ధ్రువీకరణలు, భవన నిర్మాణ అనుమతులు, ఆస్తి మార్పిడి పనులు , లైసెన్స్ అనుమతులు, ఉపాధి హామీ పనులు, కోవిడ్ సర్వేలు, డ్రై డేల నిర్వహణ, కంటి వెలుగు కార్యక్రమాలు, పోడు భూముల సర్వేలు, విపత్తు నిర్వహణ సంబంధించిన మొదలగు అనేక రకాల పనులను చేస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సర్వేలు కూడా చేస్తున్నాం. జాతీయస్థాయిలో పంచాయతీరాజ్ శాఖ నుంచి తెలంగాణకు ఉత్తమ అవార్డులు రావడంలో కీలకపాత్ర పోషిస్తున్నాం. మూడేండ్లకు పర్మినెంట్ అన్నారు. ఆ తర్వాత నాలుగేండ్లకు పెంచారు. నాలుగేండ్లవుతున్నా పర్మినెంట్ ఊసేలేదు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రొబేషనరీ పీరియడ్‌ను సర్వీస్ పీరియడ్‌గా మార్చాలని వేడుకుంటున్నాం. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో తీసుకున్న జేపీఎస్‌లను కూడా పర్మినెంట్ చేయాలి.

పూలే ఆశయాలు, కార్యాచరణ నేటికీ స్ఫూర్తిదాయకం

(మొదటిపేజి తరువాయి)

బహుజన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పూలే 200 ఏండ్ల క్రితమే కార్యాచరణ చేపట్టారని సీఎం గుర్తుచేశారు. ఆయన అనుసరించిన సామాజిక సమానత్వ పంథా, నాటి భారతీయ సమాజంలో కొనసాగుతున్న సాంప్రదాయ సామాజిక విలువలను, వ్యవస్థలను సమూలంగా మార్చివేసేందుకు బాటలు వేసిందని తెలిపారు. గుణాత్మక మార్పు దిశగా దేశంలోని స్త్రీలు, దళిత బహుజనులు ఉద్యమించేలా పూలే కార్యాచరణ పురికొల్పిందని పేర్కొన్నారు. పూలేను డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్వయంగా తన గురువుగా ప్రకటించుకున్నారని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. ఆయన ఆశయాలను నెరవేర్చేదిశగా తెలంగాణ ప్రభుత్వం తన ప్రాధాన్యతాక్రమాన్ని రూపొందించుకుని అభివృద్ధి, సంక్షేమ కార్యాచరణను అమలు చేస్తున్నదని తెలిపారు. జ్యోతిబాపూలే అందించిన స్ఫూర్తితో 'వికాసమే వివక్షకు విరుగుడు' అనే విధానాన్ని అనుసరిస్తూ తమ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికోసం పాటుపడుతున్నదని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో నేడు తెలంగాణలోని మహిళా, దళిత, గిరిజన, బడుగు, బలహీనవర్గాలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా, విద్యాపరంగా మెరుగైన ఫలితాలు సాధించి సామాజిక సమానత్వ దిశగా పురోగమించాయని పేర్కొన్నారు. అణగారిన వర్గాలు, బహుజనుల సమగ్ర వికాసానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు వారి సామాజిక, ఆర్థిక ఆత్మగౌరవాలను ద్విగుణీకతం చేస్తున్నాయని వివరించారు. తమ ప్రభుత్వం చేస్తున్న ఈ కృషి వెనుక మహాత్మాబాపూలే ఆదర్శాలు, ఆశయ సాధన లక్ష్యాలు ఇమిడి ఉన్నాయని తెలిపారు.

అడవి అదృశ్యం...

(మొదటిపేజి తరువాయి)

మైనింగ్ కార్యకలాపాలకోసం అడవులను కార్పొరేట్లకు అప్పనంలా అప్పగించేస్తున్నారు. ఇప్పటి వరకు ఉన్న . నివేదికల ప్రకారం, 18,847 హెక్టార్ల అటవీ భూమిని మైనింగ్ కార్యకలాపాలకు ఉపయోగించుకోవడానికి అనుమతించి ంది కేంద్ర ప్రభుత్వం.మరోవైపు జల ప్రాజెక్టులకోస మంటూ..మరో 13,344 హెక్టార్ల అటవీ భూమిని వినియోగించారు. వీటితో పాటు 9,469 హెక్టార్ల అటవీ భూమిని విద్యుత్ ప్రాజెక్టుల కోసం కేటాయించారు. విద్యుత్ టవర్లు , వైర్లు వేయడం కోసం మళ్లించారు.

సాయుధ బలగాల కోసమంటూ..

సాయుధ బలగాల వినియోగానికి కూడా పెద్ద ఎత్తున అటవీ భూమిని కేటాయించారు. అడవుల్లో మావోయిస్టులను ఏరివేయటంపై కేంద్రప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిపెట్టిందని స్పష్టమవుతోంది. అందువల్ల. వివిధ రక్షణ ప్రాజెక్టుల కోసం గత ఐదేండ్లలో 7,630 హెక్టార్ల అటవీ భూమి ఉపయోగించబడింది.

అడవుల నిర్వచనం ఏమిటంటే..

దేశంలో ఒక హెక్టారు కంటే ఎక్కువ విస్తీర్ణం (భూమి)లో పచ్చదనం 10 శాతం కంటే ఎక్కువ ఉంటే, దానిని అడవీ అంటారు. అప్పుడు అది నిజంగా అడవి అయినా లేదా ఎవరిదో పొలం అయినా లేదా తోట అయినా లేదా ఎవరి వ్యక్తిగత ఆస్తి అయినా.అలాగే గుర్తిస్తారు. అయితే వాస్తవానికి నమోదైన అటవీప్రాంతం కాకుండా, ఐదేండ్లలో భారతదేశం 668,400 హెక్టార్ల అడవులు కోల్పోయింది.

బ్రెజిల్ తర్వాత భారత్

అటవీ విధ్వంసం విషయంలో బ్రెజిల్ తర్వాత భారతదేశం రెండవ స్థానంలో ఉంది.

అయినప్పటికీ, 13 జనవరి 2022న ప్రచురించబడిన "ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్ట్ 2021" (ఐఎస్ఎఫ్ఆర్ 2021)లో విడుదల చేసిన డేటాను పరిశీలిస్తే, 2019 , 2021 మధ్యకాలంలో అటవీ విస్తీర్ణంలో 1.6 లక్షల హెక్టార్ల (0.2 శాతం) స్వల్ప పెరుగుదల కనిపించింది. . కానీ ఇక్కడ గమనించదగ్గ విషయం ఏమిటంటే, ఇవి ఎక్కువగా ఫారెస్ట్ రికార్డ్ ఫారెస్ట్ (రాష్ట్ర ప్రభుత్వాల అటవీ శాఖ పరిధిలోని అటవీ భూమి) వెలుపల పెరుగుతున్నాయి. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్ఈ) చేసిన విశ్లేషణ ప్రకారం, 25.9 మిలియన్ హెక్టార్లలో విస్తరించి ఉన్న అడవులు, దాదాపు భారతదేశంలోని ఉత్తరప్రదేశ్ పరిమాణంలో లేవు. విశ్లేషణ ప్రకారం, ఇంత భారీ వ్యత్యాసానికి (ఐఎస్ఎఫ్ఆర్)2021లో ఎలాంటి వివరణ లేదు. ఈ రికార్డ్ చేయబడిన అడవిలో అటవీ విస్తీర్ణం లేకుండా పోయిందనేది మాత్రమే చూసినట్లయితే, ఈ తప్పిపోయిన అటవీ ప్రాంతం అంత విశాలంగా లేకుంటే, దానిని విస్మరించవచ్చు. కానీ సుమారు 26 మిలియన్ హెక్టార్ల విస్తీర్ణాన్ని విస్మరించడం సాధ్యం కాదు.

భారతదేశం 1990 , 2000 మధ్యకాలంలో 384,000 హెక్టార్లలో అడవులను కోల్పోయింది. అదే సమయంలో, 2015, 2020 మధ్య ఇది 668,400 హెక్టార్లకు పెరిగింది. అంటే ఈ రెండు కాలాలలో, భారతదేశం అటవీ విధ్వంసంలో 284,400 హెక్టార్ల పెరుగుదలను చూసింది, ఇది ప్రపంచంలోనే అత్యధికం.కార్పొరేట్ల లాభాల కోసం అడవులను వేగంగా నరికివేస్తున్నారు.

ఇలాగే అడవుల హననం కొనసాగితే శ్వాస పీల్చటానికీ ఆక్సిజన్ స్తంభాలను భుజాలపై పెట్టుకునే రోజులు ఎంతో దూరంలో లేవని పర్యావరణ వేత్తలు అంటున్నారు.



ఓటేయొద్దు..

(మొదటిపేజి తరువాయి)

ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. మండల కేంద్రంలో త్వరలోనే రైల్వే స్టేషన్ అందుబాటులోకి వస్తుందని చెబుతూ.. 'ఎంపీ సక్కటోడు లేడుగనీ.. వినోద్‌కుమార్ లాంటి ఎంపీ ఉంటే ఈపాటికే రైలు కూడా వస్తుండే' అన్నారు. ఎంపీకి 'తెల్లారిలేస్తే లొల్లి.. ఒకటే మతం పంచాయితీ, మసీదులు తవ్వుదామా.. ఏడ పేపర్ లీక్‌లు చేద్దామా.. ఈ లొల్లి తప్ప అసలు లొల్లిలు లేవని' ఆరోపించారు. కాబట్టి ఈ సారైనా ఆలోచించి ఎంపీగా వినోద్‌కుమార్ లాంటి మంచోనికి ఓటేసి గెలిపించుకోవాలని కోరారు. గ్రామంలో ప్రాథమిక ఉన్నత పాఠశాలను హైస్కూల్‌గా అప్ గ్రేడ్ చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతికి సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేస్తానని చెప్పారు. పరిహారం రాని నిర్వాసితులు ఎవరైనా ఉంటే బాధపడొద్దని, అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

స్ట్రాంగ్ రూం కీ మాయం

(మొదటిపేజి తరువాయి)

కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమన్నాయి. స్ట్రాంగ్ రూం తాళాల కీలు మాయం కావడం ఏంటని ప్రశ్నించాయి. ప్రభుత్వ సహకారంతో ధర్మపురి ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వరే కుట్ర చేశారని, ఆయనపై ఓటమిపాలై ఫలితాల రీకౌంటింగ్‌పై కొట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

'అడ్లూరి' పిటిషన్‌పై కోర్టు ఉత్తర్వులు..

2019 సాధారణ ఎన్నికల్లో ధర్మపురి నియోజకవర్గం నుంచి గెలిచిన బీఆర్ఎస్ అభ్యర్థి, ప్రస్తుత మంత్రి కొప్పుల ఈశ్వర్ ఎన్నిక అక్రమమని, ఫలితాలు తారుమారు చేశారని ఆరోపిస్తూ సమీప అభ్యర్థి.. కాంగ్రెస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోర్టులో పిటిషన్ వేశారు. గతంలోనే ఈవీఎంలలోని ఓట్ల రీ కౌంటింగ్ చేయాలని పలుమార్లు కోర్టు మెట్లెక్కారు. ఈ మేరకు విచారణ చేపట్టిన హైకోర్టు వారం కింద కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల ఫలితాలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూంను తెరవాలని ఆదేశించింది. అప్పటి ఎన్నికకు సంబంధించిన 17ఏ, 17సీ డ్యాక్యుమెంట్లు, సీసీ ఫుటేజీలు, ఎలక్షన్ ప్రొసీడింగ్‌ను ఈనెల11న (నేడు) సమర్పించాలని ఆ సమయంలో ఉన్న రిటర్నింగ్ అధికారి భిక్షపతికి నోటీసులు ఇచ్చింది. దీంతో సోమవారం కలెక్టర్, ఇతర అధికారగణమంతా జిల్లా కేంద్రంలోని వీఆర్‌కే ఇంజినీరింగ్ కాలేజీలోని స్ట్రాంగ్‌రూమ్‌ను తెరిచేందుకు వెళ్లారు. ఆ గదుల తాళాలు తెరిచే ప్రయత్నం చేయగా ఈవీఎంలు ఉన్న గది మాత్రమే తెరుచుకుంది. కోర్టు అడిగిన డ్యాక్యుమెంట్లు ఉన్న గదుల తాళాలు తెరచుకోలేదు. సదరు తాళాల 'కీ'లు కూడా అధికారుల దగ్గర లేవు. దీంతో కలెక్టర్ తాళం చెవులు(కీ లు) లేవన్న విషయాన్ని కోర్టుకు చెబుతామని తెలిపారు. స్ట్రాంగ్‌రూమ్ గదుల తాళాలు పగలగొట్టి అయినా డాక్యుమెంట్లు, సీసీ ఫుటేజీలు బయటకు తీయాలని కాంగ్రెస్ శ్రేణులు పట్టుబట్టగా.. కోర్టు అనుమతి ఇవ్వకుండా పగలగొట్టలేమని కలెక్టర్ స్పష్టం చేశారు. దీంతో పిటిషన్ దారుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సహా కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అధికారుల దగ్గర ఉండాల్సిన తాళం చెవులు ఏమయ్యాయి?

ధర్మపురి కాంగ్రెస్ అభ్యర్థి– ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్‌కుమార్ కలెక్టర్ లేదా అడిషనల్ కలెక్టర్ దగ్గర ఉండాల్సిన స్ట్రాంగ్‌రూమ్ తాళాల కీలు ఏమయ్యాయి.. కోర్టు నుంచి ఉత్తర్వులు వచ్చి ఆరు రోజులు గడిచినా తాళం చెవులు ఎవరి దగ్గర ఉన్నాయో తెలియకపోవడం ఏంటి? అని పిటిషన్‌దారుడు, కాంగ్రెస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రశ్నించారు. స్ట్రాంగ్‌రూమ్ భవనం ఎదుట మీడియాతో ఆయన మాట్లాడుతూ.. అధికారుల వద్ద ఉండాల్సిన స్ట్రాంగ్ రూమ్ తాళాలు వారి దగ్గర లేకపోవడానికి గల కారణాన్ని చెప్పాలని, దీనికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ కుట్ర చేశారని ఆరోపించారు. ఎన్నికల ఫలితాలు తారుమారు అయ్యాయని నాలుగేండ్లుగా తాను పోరాడుతుంటే ఇప్పుడు కోర్టు ఉత్తర్వులు వచ్చాయని చెప్పారు. ఇప్పుడేమో తాళాల కీలు లేవని చెప్పడం ఏంటని, ఇది కచ్చితంగా కుట్రేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్రికెట్ చరిత్రలోనే ఇలాంటి అద్భుతం చూడలేదు



కోల్‌కతా కోచ్

న్యూఢిల్లీ : గుజరాత్ టైటన్స్‌పై ఆఖరి ఐదు బంతుల్లో ఐదు సిక్స్‌లు కొట్టిన రింకూ సింగ్‌పై ప్రశంసలు కురుస్తోంది. ఇదే క్రమంలో ఆ జట్టు కోచ్ చంద్రకాంత్ పండిత్ మాట్లాడుతూ.. తన 43 ఏళ్ల కెరీర్‌లో ఇలాంటి అద్భుతం ఏనాడూ చూడలేదని అన్నాడు. దాదాపు ఓటమి ఖాయం అనుకున్న దశలో ఈ లెఫ్ట్ హ్యాండర్ బ్యాటర్ ఒంటి చేత్తో కోల్‌కతాను గెలిపించాడని పేర్కొన్నాడు. మ్యాచ్ అనంతరం చంద్రకాంత్ పండిత్ ఈ వ్యాఖ్యలు చేశాడు. 'ఇదొక అద్భుతం. అందులో సందేహం లేదు. రింకూ అలా చెలరేగడం ఒక మిరాకిల్. అయితే.. మేము ఆటగాళ్ల నమ్మకాన్ని, రింకూ ఆత్మవిశ్వాసాన్ని ఎన్నడూ తక్కువ అంచనా వేయలేదు. నేను ఎల్లప్పుడూ రింకూతో నువ్వు నా బెస్ట్ ప్లేయర్ అని అంటుంటాను. ఇప్పుడు కూడా అదే మాట చెప్తాను. నిజం చెప్తున్నా.. ఏడు వికెట్లు కోల్పోయిన దశలో తమ జట్టు గెలుస్తుందని ఏ కోచ్ కూడా చెప్పడు. కానీ, టీ20లో ఏ క్షణంలో ఏమైనా జరగొచ్చని మాకు తెలుసు. అందుకని నమ్మకం కోల్పోలేదు. ముఖ్యంగా రింకూ లాంటి ప్లేయర్ క్రీజులో ఉన్నప్పుడు ఓడిపోతామని ఎలా అనుకుంటాం. మూడో సిక్సర్. కవర్స్ దిశగా రింకూ కొట్టిన ఆ సిక్స్ చాలా నచ్చింది. ఫుల్ టాస్ బంతిని రింకూ అద్భుతంగా స్టాండ్స్‌లోకి పంపాడు. మ్యాచ్ సమయంలో మా సీఈఓ వెంకీ మైసూర్ స్టేడియంలోనే ఉన్నాడు. అతను చాలా సంతోషించాడు. ఫ్రాంచైజీ యజమానులు జై మెహతా, జూహీ చావ్లా కిందికి వచ్చి టీమ్ మొత్తాన్ని అభినందించారు. వాళ్ల కళ్లలో ఎంతో సంతోషం కనిపించింది.అని చంద్రకాంత్ తెలిపాడు.



యశ్ దయాల్‌కు నిద్రలేని రాత్రి

గుజరాత్ టైటాన్స్ బౌలర్ యశ్ దయాల్‌కు అరణ్య రోదనే మిగిలింది. కేకేఆర్ బ్యాటర్ రింకూ సింగ్ నిప్పులు చెరిగే బ్యాటింగ్ చేస్తూ వరుసగా సిక్సర్లు కొడుతుంటే.. యశ్‌కు ఏమి చేయాలో పాలు పోలేదు. యశ్ వేసిన చివరి ఓవర్‌లో కేకేఆర్ బ్యాటర్ రింకూ వరుసగా అయిదు సిక్సర్లు కొట్టి సంచలన విజయాన్ని నమోదు చేశాడు. గుడ్‌లెన్త్ బౌల్స్ వేసిన యశ్ దయాల్‌ను నిర్దాక్షిణ్యంగా బాదేశాడు రింకూ. కేకేఆర్ బ్యాటర్ జోరుకు.. దయాల్‌కు అవమానమే మిగిలింది. ఏం చేయాలో తెలియని స్థితిలోకి వెళ్లిపోయాడతను. చివరి బంతి ముగిశాక టవల్‌తో తన ముఖాన్ని కప్పేసుకున్నాడు యశ్ దయాల్.



క్రీడాస్ఫూర్తి చాటిన కేకేఆర్..

గుజరాత్ పేసర్‌పై ట్వీట్

న్యూఢిల్లీ : గుజరాత్ టైటాన్స్ బౌలర్ యశ్ దయాల్‌ను ఉద్దేశించి కేకేఆర్ ట్వీట్ చేసి క్రీడాభిమానుల మనసులు గెలుచుకుంది. ఐపీఎల్-2023లో భాగంగా అహ్మదాబాద్ వేదికగా ఆదివారం గుజరాత్ టైటాన్స్- కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి 204 పరుగులు చేసింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన కేకేఆర్ ఆరంభంలో తడబడ్డా..

వెంకటేశ్ అయ్యర్(83), నితీశ్ రాణా(45), ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన రింకూ సింగ్ విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. ముఖ్యంగా ఆఖరి ఓవర్లో ఐదు సిక్సర్లు కొట్టి కేకేఆర్‌కు మర్చిపోలేని విజయం అందించాడు. ఇక మ్యాచ్ అనంతరం కేకేఆర్ యశ్ దయాల్‌ను ఉద్దేశించి.

ఈ మేరకు ట్వీట్ చేసింది. "తలెత్తుకో.. ఒక్కోసారి అత్యుత్తమ క్రికెటర్ల విషయంలో ఇలా జరుగుతూ ఉంటుంది. ఈరోజు నీది కాదంతే! నువ్వు ఎల్లప్పుడూ చాంపియన్‌వే యశ్. ఇంతకంటే గొప్పగా.. మరింత వేగంగా పుంజుకుని నువ్వేంటో నిరూపించుకుంటావు" అంటూ కోల్‌కతా నైట్ రైడర్స్ క్రీడాస్ఫూర్తిని చాటుకుంది. క్రీడాస్ఫూర్తికి నిదర్శనంగా నిలిచిన ఈ ట్వీట్ నెట్టింట వైరల్ అవుతోంది.

ఈ ఏడాదినుంచి దులీప్, దేవధర్ ట్రోఫీ : బిసిసిఐ

ముంబయి: ఈ ఏడాది నుంచి దులీప్, దేవధర్ టోర్నమెంట్‌లను తిరిగి ప్రారంభించేందుకు భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. కరోనా కారణంగా గత మూడేళ్లుగా నిలిచిపోయిన దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్‌లను 2023-24 సీజన్ నుంచి ప్రారంభించనున్నట్లు బిసిసిఐ అధికారి ఒకరు తెలిపారు. దులీప్ ట్రోఫీని జూన్ 28 - జులై 16వరకు, జులై 24నుంచి ఆగస్టు 3వరకు దేవధర్ టోర్నమెంట్‌లు నిర్వహించనున్నట్లు ఆ అధికారి తెలిపారు. అలాగే ఈ రెండు టోర్నమెంట్‌లు తమిళనాడు, బెంగళూరు వేదికల్లో జరగనున్నాయి. అలాగే ఇరానీ కప్ అక్టోబర్ 1-5న సౌరాష్ట్ర వేదికగా.. సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీ అక్టోబర్ 16 - నవంబర్ 6న, విజయ్ హజారే టోర్నీ నవంబర్ 23నుంచి ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. ఇక రంజీట్రోఫీని వచ్చే ఏడాది జనవరి 5 నుంచి మార్చి 14వరకు నిర్వహించేందుకు బిసిసిఐ దేశవాళీ షెడ్యూల్‌ను సిద్ధం చేసినట్లు ఆ అధికారి చెప్పుకొచ్చారు. చివరిసారిగా ఈ రెండు దేశవాళీ టోర్నమెంట్‌లో 2019 ఏడాదిలో జరిగాయి.



ఆఫీస్ బేరర్స్ అలవెన్సులు పెంపు..

బిసిసిఐలో పనిచేసే ఆఫీస్ బేరర్స్ అలవెన్స్‌లు భారీగా పెరిగాయి. విదేశీ పర్యటనలకు వెళ్లే ఆఫీస్ బేరర్స్ జీతభత్యాలను భారీగా పెంచుతూ బిసిసిఐ తాజాగా నిర్ణయం తీసుకుంది. విదేశీ పర్యటనలకు వెళ్లే ఆఫీస్ బేరర్లకు ఫస్ట్‌క్లాస్ టికెట్‌తో పాటు రోజువారీ అలవెన్స్‌ను పెంచింది. తాజాగా అపెక్స్ కౌన్సిల్ భేటీలో బిసిసిఐ ఈ నిర్ణయాన్ని వెల్లడించింది. ఈ సౌకర్యాలన్నీ గతేడాది అక్టోబర్ నుంచే అమల్లోకి రానున్నట్లు పేర్కొంది. దాదాపు ఏడేళ్ల తర్వాత రోజువారీ అలవెన్స్‌లో మార్పులు చేసింది. ఇంతకుముందు 750 డాలర్లుగా ఉండే అలవెన్స్‌ను వెయ్యికి పెంచేసింది. ఇక దేశంలో జరిగే సమావేశాలకు హాజరయ్యే బీసీసీఐ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, ట్రెజరర్, సంయుక్త కార్యదర్శి సహా ఆఫీస్ బేరర్లకు రోజుకు రూ.40వేల అలవెన్స్‌ను బిసిసిఐ చెల్లించనుంది. బిజినెస్ క్లాస్ టికెట్ ప్రయాణ సదుపాయం కల్పిస్తుంది. 'వర్క్ ట్రావెల్ కోసం రోజుకు రూ. 30వేలు, సూట్ రూమ్ బుక్ చేసుకొనే వెసులుబాటు ఉంది. ఐపీఎల్ ఛైర్మన్‌కు కూడా ఆఫీస్ బేరర్స్ కేటగిరీలో అలవెన్సులు వర్తిస్తాయి.

బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్, ఇండియన్ క్రికెటర్స్ అసోసియేషన్ సభ్యులు కూడా త్రైమాసిక సమావేశాలకు హాజరైతే రూ.40వేలు, విదేశీ పర్యటనలకు వెళ్తే 500 డాలర్లను రోజువారీ అలవెన్సులుగా చెల్లిస్తుంది. ముగ్గురు సభ్యులు కలిగిన క్రికెట్ సలహా కమిటీ, పురుష, మహిళా జట్ల ప్రధాన కోచ్‌లు హాజరయ్యే ప్రతి సమావేశానికి రూ.3.5 లక్షలు ఇవ్వనుంది. సమావేశాల కోసం విదేశీ ప్రయాణాలు అవసరంలేనప్పటికీ.. ఒకవేళ వెళ్తే మాత్రం రోజుకు 400 డాలర్లు చెల్లించేందుకు నిర్ణయం తీసుకుంది. వీరంతా గౌరవ పదవుల్లో ఉండే ఆఫీస్ బేరర్ల కేటగిరీలోకి వస్తారు. అదే బీసీసీఐ సీఈవోకు.. విదేశీ పర్యటనకు వెళ్తే 650 డాలర్లు, స్వదేశంలో అయితే రూ.15 వేలను భత్యంగా చెల్లిస్తుంది.

తాత్కాలిక షెడ్యూల్..

దులీప్ ట్రోఫీ : జూన్ 28 - జులై 16
దేవధర్ ట్రోఫీ : జులై 24 - ఆగస్టు 3
ఇరానీ కప్ : అక్టోబర్ 1 - 5
సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీ : అక్టోబర్ 16 - నవంబర్ 6
విజయ్ హజారే ట్రోఫీ : నవంబర్ 23 - డిసెంబర్ 15
రంజీ ట్రోఫీ : జనవరి 5, 2024 - మార్చి 14

ఆర్మగెడాన్ ప్రపంచ చెస్ ఛాంప్ గుకేశ్

బెర్లిన్(రష్యా): ఆసియా, ఓషేనియానియా ఈవెంట్‌లో ఆర్మగెడాన్ ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా భారత యువ గ్రాండ్‌మాస్టర్ డి గుకేశ్ నిలిచాడు. ఆదివారం రాత్రి జరిగిన ఫైనల్లో గుకేశ్ ఉజ్బెకిస్తాన్‌కు చెందిన మాజీ ప్రపంచ ర్యాపిడ్ ఛాంపియన్ నోడిర్‌బెక్ అబ్దుసత్తోరోవ్‌పై సంచలన విజయం సాధించాడు. గేమ్-లో గుకేశ్ కొంత వెనుకబడ్డా.. ఆ తర్వాత పుంజుకొని తదుపరి గేమ్‌లో విజయం సాధించాడు.

ఇరువురి మధ్య జరిగిన ఆ తర్వాత మ్యాచ్ డ్రా అయ్యింది. నాల్గో గేమ్‌లో గుకేశ్ ప్రత్యర్థిని ఓడించి ఛాంపియన్‌గా నిలిచాడు. వీరిద్దరూ గత ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన అర్హత పోటీల్లో గెలిచి ప్రధాన టోర్నమెంట్‌కు అర్హత సాధించారు. ఫైనల్ పోటీల్లో 16ఏళ్ల గుకేశ్‌తోపాటు మాజీ ప్రపంచ క్లాసికల్ ఛాంపియన్ వ్లాదిమిర్ క్రామ్నిక్, డానియేల్ దుబోవ్, యాంఝ యు(చైనా) విదిత్ గుజరాతీ, కార్తికేయ మురళీ, పరమ్ మగ్సూద్లూ(ఇరాన్)లో తమ తమ బోర్డులలో గెలిచినా.. విజేతగా గుకేశ్ నిలిచాడు. ఆర్మగెడాన్ గేమ్‌లో తెలుపు పావులతో ఆడే ప్లేయర్‌కు ఐదు నిమిషాలు, నలుపు పావులతో ఆడే ప్లేయర్‌కు నాలుగు నిమిషాలు కేటాయిస్తారు. నలుపు పావులతో ఆడిన గుకేశ్.. ఉజ్బెకిస్తాన్ ప్లేయర్‌ను ఓడించడం విశేషం.



నవచిత్రం

ఈ రైడర్స్ ఎవరు?



ప్రభాస్

ప్రభాస్ నటిస్తున్న ఫ్యూచరిస్టిక్ సైన్స్ ఫిక్షన్ చిత్రం 'ప్రాజెక్ట్‌కె'. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రమిది. ప్రస్తుతం సినిమా నిర్మాణ దశలో ఉంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం యూనిక్ ప్రమోషనల్ కాంపెయిన్ ప్రారంభించింది. అందులో భాగంగా ఫ్రమ్ స్క్రాచ్ పేరుతో ప్రీ ప్రొడక్షన్ పనుల వీడియోను విడుదల చేస్తున్నారు.ఎపిసోడ్ వన్- ప్రత్యేకంగా రూపొందించిన చక్రం తయారీని చూపించింది. లేటెస్ట్‌గా సోమవారం ఎపిసోడ్ 2- అసెంబ్లింగ్ ది రైడర్స్‌ని విడుదల చేసారు. రైడర్స్ ఎవరు?, చర్చల తరువాత అది విలన్ ఆర్మీ యూనిఫాం సైన్ అని రివీల్ అవుతుంది. ఇది సినిమాలో అత్యంత ఖరీదైన భాగమని నిర్మాత తెలియజేశారు. ఈ వీడియోతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

దర్శకుడు నాగ్ అశ్విన్ స్క్రిప్ట్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ప్రపంచ స్థాయి నిర్మాణ ప్రమాణాలతో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. టెక్నికల్‌గా ఈ సినిమా మరో లెవల్‌గా ఉండబోతోంది. 50 మెమరబుల్స్ ఇయర్స్ జరుపుకుంటున్న టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ ఈ గోల్డెన్ జూబ్లీ ప్రాజెక్ట్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. అశ్విని దత్ నిర్మాత. బాలీవుడ్ నటి దీపికా పదుకొనే కథానాయికగా నటిస్తుండగా, బిగ్ బి అమితాబ్ బచ్చన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 12న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రభాస్ దీంతోపాటు ప్రశాంత్ నీల్‌తో 'సలార్', మారుతి దర్శకత్వంలో ఓ సినిమా, ఓం రౌత్ దర్శకత్వంలో 'ఆదిపురుష్'లోనూ నటిస్తూ బిజీగా ఉన్నారు.

డబుల్ సర్‌ప్రైజ్



పవన్ కళ్యాణ్

పవన్ కల్యాణ్ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'వకీల్ సాబ్'. కోర్టు రూమ్ డ్రామా నేపథ్యంలో సాగే కథతో తెరకెక్కిన ఈ చిత్రం ఏప్రిల్ 9తో విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా అభిమానులు ట్విట్టర్‌లో చిట్‌చాట్ సెషన్ నిర్వహించారు. ఈ సెషన్‌లో డైరెక్టర్ వేణుశ్రీరామ్ కూడా పాల్గొని, 'వకీల్‌సాబ్' తప్పకుండా రీరిలీజ్ అవుతుందని, అలాగే 'వకీల్‌సాబ్'కి సీక్వెల్‌గా 'వకీల్ సాబ్ 2' కూడా ఉండబోతుందని చెప్పి అందర్నీ సర్‌ప్రైజ్ చేశాడు. ప్రస్తుతం 'వకీల్‌సాబ్ 2' స్క్రిప్ట్ వర్క్ కొనసాగుతుందని తెలిపారు. ఈ డబుల్ ధమాకాలాంటి అప్‌డేట్ తెలుసుకున్న పవర్‌స్టార్ అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు.

వేణుశ్రీరామ్ దర్శకత్వం వహించిన 'వకీల్‌సాబ్'లో శృతిహాసన్ పవన్‌కళ్యాణ్‌కి జోడీగా నటించగా, అంజలి, నివేదా థామస్, అనన్య నాగళ్ల కీలక పాత్రల్లో నటించారు. ఈ ముగ్గురి చుట్టూ తిరిగే కథాంశంతో చివరి వరకు రక్తికట్టించేలా సాగే వకీల్‌సాబ్‌కు తెలుగు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. పవన్ కల్యాణ్ ప్రస్తుతం క్రిష్ దర్శకత్వంలో హరిహరవీరమల్లు, సుజీత్ దర్శకత్వంలో ఓజీ, సముద్రఖని డైరెక్షన్‌లో వినోదయ సీతమ్ రీమేక్, హరీష్ శంకర్ డైరెక్షన్‌లో ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాల్లో సినిమాల్లో నటిస్తున్నారు.

పోలీస్‌లు గ్రేట్ అని చెప్పే పాట..



నాగ చైతన్య

నాగచైతన్య, వెంకట్ ప్రభు క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తెలుగు-తమిళ ద్విభాషా ప్రాజెక్ట్ 'కస్టడీ'. తాజాగా చిత్ర బృందం ఈ సినిమాలోని ఫస్ట్ సింగిల్ 'హెడ్ అప్ హై..' లిరికల్ వీడియోను రిలీజ్ చేసింది. ఇళయరాజా, ఆయన తనయుడు యువన్ శంకర్ రాజా ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. 'హెడ్ అప్ హై..' థంపింగ్ బీట్‌లు, పవర్ ఫుల్ లిరిక్స్ మాస్ కాంబో. ఈ పాట పోలీసులకు ఘనమైన ట్రిబ్యూట్. అరుణ్ కౌండిన్య, అసల్ కోలార్‌లతో పాటు యువన్ శంకర్ రాజా స్వయంగా పాడిన ఈ పాటకు సరస్వతి పుత్ర రామజోగయ్య శాస్త్రి సాహిత్యాన్ని అందించారు. పాట మొత్తం ఎనర్జిటిక్‌గా ఉంది. సాహిత్యం పోలీసుల గొప్పతనాన్ని వర్ణిస్తుంది. నాగ చైతన్య తన గ్రేస్ఫుల్ డ్యాన్స్ మూవ్స్‌తో పాటలోని ఎనర్జీని మ్యాచ్ చేశారు. జానీ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై భారీ నిర్మాణ విలువలు, సాంకేతిక ప్రమాణాలతో భారీ ఎత్తున తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నాగ చైతన్య సరసన కృతిశెట్టి కథానాయికగా నటిస్తోంది. పవన్‌కుమార్ సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని మే 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు.

మగవాళ్ళు పడే బాధలతో సేవ్ ది టైగర్స్



చైతన్య కృష్ణ, పావని

విభిన్నమైన కంటెంట్‌తో తెలుగు ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేస్తున్న డిస్నీ ఫ్లస్ ఇప్పుడు 'సేవ్ ది టైగర్స్' వంటి మరో మంచి కథతో వస్తోంది. ప్రియదర్శి, అభినవ్ గోమటం, చైతన్యకృష్ణ, పావని, జోర్దార్ సుజాత, దేవయాని ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'సేవ్ ద టైగర్స్'. అంతరించిపోతున్న పులుల్ని, మొగుళ్లని కాపాడుకుందాం అనేది ఉపశీర్షిక.

నటుడుగా మంచి గుర్తింపు తెచ్చుకున్న తేజా కాకుమాను ఈ చిత్రానికి దర్శకుడు. ఆనందో బ్రహ్మ, యాత్ర చిత్రాల ఫేమ్ మహి వి రాఘవ, ప్రదీప్ అద్వైతం షో రన్నర్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ వెబ్ సిరీస్ డిస్నీ ఫ్లస్ హాట్ స్టార్‌లో ఈనెల 27 నుంచి స్ట్రీమింగ్ కాబోతోంది.

షో రన్నర్ మహి వి రాఘవ మాట్లాడుతూ, 'ప్రతి ఇంట్లోనూ ఒక కామెడీ స్టోరీ ఉంటుంది. భార్య భర్తల మధ్య ఉండే జోక్ ఎప్పుడు ఫెయిల్ కాదు. ఎవరి యుద్ధం వాళ్ళది. ఒకప్పుడు పెద్దవాళ్ళు చెబితే వినేవారు. ఇప్పుడు భార్య, భర్త జాబ్స్ చేయడం వాళ్ళ ఒక డామినేటింగ్ వస్తుంది. అది ఒక సంఘర్షణకు దారి తీస్తుంది. మా సిరీస్ ఖచ్చితంగా అందరు చూసేలా ఉంటుంది. ముఖ్యంగా కుటుంబాల్లో ఆడవారి వల్ల మగవాళ్లు పడే బాధలను ఎంటర్టైనింగ్‌గా చూపిస్తూ రూపొందించిన సిరీస్ ఇది' అని తెలిపారు.

ఈసారి పీరియడ్ యాక్షన్ డ్రామా..



తిరువీర్

ఏషియన్ ఫిలిమ్స్ నారాయణ దాస్ నారంగ్ సమర్పణలో ఒక పీరియడ్ ఫిల్మ్ రూపొందుతోంది. రవి పనస ఫిలిం కార్పొరేషన్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం.గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ప్రముఖ వ్యాపారవేత్త రవికుమార్ పనస అత్యున్నత సాంకేతిక విలువలతో నిర్మిస్తున్నారు. 'మసూద'లాంటి సూపర్ హిట్ చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు హీరోగా దగ్గరైన తిరువీర్ ఈ చిత్రంలో కథానాయకుడిగా నటిస్తున్నారు. విభిన్న కథాంశంతో నూతన దర్శకుడు జి.జి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు ప్రారంభమయ్యాయి.

'ఎక్కడా రాజీ పడిన నిర్మాణ విలువలతో, మునుపెన్నడూ చూడని కథాంశంతో, ప్రతిభావంతులైన నటులతో, దర్శకుడితో నిర్మితమవుతున్న ఈ చిత్రం ప్రేక్షకులని అలరిస్తుంది. ఏషియన్ ఫిలింస్ సమర్పణలో ఈ సినిమాని తీస్తుండడం మరింత సంతోషంగా ఉంది. ఇదొక పీరియడ్ యాక్షన్ డ్రామా జోనర్‌లో ఉంటుంది' అని నిర్మాత రవికుమార్ పనస చెప్పారు.

దుబాయ్‌లో నంది అవార్డులు

తెలంగాణ ప్రభుత్వం సహకారంతో తెలంగాణ ఫిలిం ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో 'టీఎఫ్‌సీసీ నంది అవార్డ్స్ సౌత్ ఇండియా- 2023' వేడుకలు దుబాయ్‌లో ఘనంగా నిర్వహిం చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు డా.ప్రతాని రామకృష్ణ గౌడ్. ఈ సందర్భంగా దీని బ్రోచర్‌ను సోమవారం ఫిలించాంబర్‌లో రచయిత, ఎంపీ విజయేంద్రప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'గత కొన్నేళ్లుగా ఆగిపోయిన నంది అవార్డ్స్‌ని మళ్లీ ప్రతాని రామకృష్ణ ప్రభుత్వ సహకారంతో ఇవ్వడం సంతోషకరం. అయితే తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా తీసే చిత్రాలకు స్పెషల్‌గా నంది అవార్డ్ కేటాయిస్తే బావుంటుంది. అలాగే తెలంగాణలో అద్భుతమైన టూరింగ్ స్పార్ట్స్ ఉన్నాయి. వాటిని బేస్ చేసుకుని 90 శాతం అక్కడే షూటింగ్ చేసే సినిమాలకు నంది అవార్డ్స్ తో పాటు నగదు ప్రోత్సాహకాలిస్తే మరిన్ని చిత్రాలు రూపొందడంతో పాటు తెలంగాణలో టూరిజం పెరిగే అవకాశం ఉంటుంది' అని అన్నారు.

'ఈ అవార్డ్స్‌కి ప్రభుత్వం నుంచి కచ్చితంగా మంచి సపోర్ట్ లభిస్తుంది. అలాగే విజయేంద్రప్రసాద్ చెప్పిన విషయాన్ని కచ్చితంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం' అని టియస్ ఐఐసి ఛైర్మన్ గ్యాదరి బాలమల్లు తెలిపారు.డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ, 'దుబాయ్‌లో జరిగే ఈ అవార్డుల వేడుకలో దుబాయ్ ప్రిన్స్ చేతుల మీదుగా అవార్డులు ఇవ్వనున్నాం. 2021-22 సంవత్సరంలో విడుదలైన చిత్రాల వాళ్లు అప్లయ్ చేసుకోవచ్చు' అని తెలిపారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886